# అలరాజు

## పలనాటి చారిత్రాత్మక నాటకము



ధనేకుల వెంకటేశ్వరరావు

# అలరాజు

# పలనాటి

## చారిత్రాత్మక నాటకము

ధనేకుల

సర్వస్వామ్యములు రచయితవి.

ధనేకుల వెంకటేశ్వరరావు,
తాడికొండ (గుంటూరు జిల్లా)

ప్రధమ ముద్రణ : అక్టోబరు 1968,
వాణీ ప్రింటర్సు, గుంటూరు – 2.

పునర్ముద్రణ–మే 2022.

భవానీ బుక్ స్టాల్,
అరండల్ పేట,
గుంటూరు–2.

## అంకితము

మానవ జాతికై మహనీయ సేవ
గావించి సత్కీర్తి కాయులైనట్టి
శాంతి కాములకు, కృపాంతరంగులకు
"అలరాజు" దృశ్య కావ్యమ్మంకితంబు !

సరస సంగీత సాహితుల్ చన్నుదోయి
గా వెలుఁగు బ్రహ్మరాజ్ఞి, వాగ్దేవి గ్రామ
మూర్తియయ్యె నా నొప్పు నా పుట్టినూరు
రెండు కొండలు గల తాడికొండ పురము !

## – భూమిక –

నన్ను గూర్చి నేఁజెప్పు కొనంగనేల ?
పంచభూతంబు లేక రూపంబు దాల్చి
నన్ను నిల్పిన వీ భువనంబు నందు!
ఈ మహా విశ్వసృష్టియం దేనొకండ !

ఏ గడచిన జన్మంబునం దేనెవఁడనొ?
నాకు సంబంధమేమొ పల్నాటితోడ?
పిన్న నాఁటనే తద్గాథయన్న నాకు
తనువు తనువెల్ల పులకరింతలు వహించె !

నవరసంబుల్ నటింప, పల్నాటి కతను
ఖడ్గఖేట శ్రుతి యమళికల్ వహించి
పిచ్చుగుంట్లు సెప్పఁగఁ దొల్త వింటిఁగౌతు
కమున మద్గ్రామ శృంగాటకంబు నందు!

ఎప్పటి కప్పుడే రసమదెంత యవశ్యమొ యూహ సేసి తా
నప్పటి కప్పుడే వివిధ హావములందు ననేక భావముల్
చిప్పిల నీ మహాకథను జెప్పుచునుండెడి పిచ్చుగుంట్ల కొం
డప్ప మృతించికూడ యిపుడాడెడు నాస్మృతిలో సజీవుఁడై!

నన్ను నానాటికా కథన మలరింపఁ
దిరిగినాఁడ నా పల్నాటి దేశమెల్ల!
చదివినాఁడ నా వీరుల చరితలెల్ల !
అరసినాఁడ నా గాథా మహత్తు నెల్ల !

ఆంధ్ర కవిసార్వభౌముఁడు, సాంద్రకీర్తి
కరుఁడు, శ్రీనాథుఁడే మొదట రచియించె
నీ ప్రసిద్ధ జాతీయ మ హేతి హాస
మును ద్విపదయందు సర్వ సమ్మోద సరణి!

ఇప్పటికి శతాబ్దికి పూర్వ మీ చరితనె
పద్య గద్యాలలో రసవత్తరముగ
వీరభాగవతంబను పేర వీర
భద్ర కవి వ్రాసె ముదిగొండ వంశజుండు!

హేతువాద కవిత కాద్యుఁ డీతఁడన్న
ఖ్యాతిగన్న సూతపురాణ కర్త, త్రిపుర
నేని కవిరాజు నూతనమైన గీత
నుగ్గడించె నీ సత్కథ నూఁత్రసేసి !

క్షేత్ర లక్ష్మిని సాహితీ క్షేత్రమందు
నృత్యమాడించు ఏటుకూరి కవి బ్రహ్మ
పల్లెనాటి పౌరుషమున బరవశించి
వీరభారతకృతులెన్నొ వెలయఁజేసె!
ప్రతిభాఢ్యుల్ కవిసార్వభౌములు, కవిబ్రహ్మల్ మహాకావ్యసం
తతులం దీపలనాటిగాథ కమరత్వ ప్రాప్తి గావింప, నే
నతి వాంఛమతి దృశ్యకావ్య మలరాజాఖ్యంబు సృష్టింపఁబూ
నితి! ఏతత్కవిరాజ మార్గముల నేనే తీరునం బోదునో ?

సరసకవీంద్రులున్, రసికచంద్రులు, ఆప్తవిమర్శకుల్ నిరం
తరము వసించు గర్తపుర ధాత్రిపయిన్ నెలకొక్క రోజునన్
జరిగెడు సాహితీ సదసు సందొకనాఁ డలరాజునేన్ బఠిం
చి, రచన భేషుభేషను అశేష విశేష ప్రశంసలందితిన్!

తన హితులైనవారికి సదా నను జెప్పెడు వేళ, నాదు నం
దనుఁడుకవీంద్రుఁడౌననుచుఁ దాననుచుండెడునంట మున్ను మ
జ్జనకుఁడు ! స్వీయజోస్య మిటు సత్యశుభాకృతి దాల్చినందుకీ
తనయుశిరంబుమీఁద సముదశ్రులఁ దాన్ దివినుండిరాల్చెడున్

తానొక తత్త్వవేత్తయయి, తానొక సద్వ్యవహర్తయై, మహా
మానవుఁడై, కళా విభవ మాన్యుఁడునై, విలసిల్లి నట్టి సు
జ్ఞాని – ధనేకులాన్వయ శిఖామణి – నా పితృ దేవుఁడైన రా
మానుజయాభిధున్ దలఁచుమాత్రన నాహృది పొంగిపోయెడున్

జీవితారంభ దినముల, చిన్ననాఁడె
చిత్రలేఖన తాత్త్విక చింతనాది
సత్కళలతోడఁ బుట్టిన మత్కవితకు
సార్థకత నలరాజ రచన యొసఁగుత!

కాలగర్భమం దెన్నఁడో గతము నందుఁ
గలసిపోయిన నొక మహోజ్జ్వల చరిత్ర
కేనొక సరసరూపకాకృతి నొసఁగితి !
వీరభారతి కిది శాంతిహార మగుత!

లోక నాటక రీతుల నాకళించి
నాఁడ! ఆ పోకడల నా మనంబు నందు
నిలిపి నాటక శిల్పంబు మలచి నాఁడ!
నా రసానుభూతి జగదానంద మగుత!

## నేపథ్య గాథ

ఈ చరిత్రయందు– ఈ నాటకమునకు ముందు–కలదు కొంత పూర్వగాథ !

అనుగురాజు పల్నాటి మహావిభుండు!
ముప్వురున్నారు దేవేరులవ్విభునకు!
తత్సతీత్రయమందు పుత్రత్రయంబు
గాంచి కొన్నాళ్ళ కతఁడు స్వర్గస్తుఁడయ్యె!

అనుగు రాణ్ణందన త్రయమందు ప్రథముఁ
డు నలగామరాజు, ద్వితీయుఁడు నరసింహ
రాజు, గుణశాలి మలిదేవరాజు చివరి
వాఁడు ! ప్రథముఁడే ప్రభువయ్యె వారిలోన !

ఆ మహీశుకు బ్రహ్మనాయఁడు సచివుఁడు !
రాచవారికి దేవుఁడా బ్రహ్మమంత్రి !
ఇంతలో బ్రహ్మనాయని కెదురు పోటి
యగుచు వచ్చి నిలచె నాగమాంబ యొకతె !

అపుడు నలగామ నరసింహు లామె వలను
బడిరి ! బ్రహ్మనాయని మంత్రిపదవి తొలఁగె !
ఆమె సచివురాలయె! ఏమైనను మలి
దేవుఁడామెను సుంత గుర్తింపఁడయ్యె !

అంత నలగామ నృపతి రాజ్యంబునందు
కొంతపంచి మల్దేవునకు నొసఁగె! మలి
దేవుఁడపుడు బ్రహ్మనకు మంత్రిత్వమొసఁగి
రాచవీడు మాచెర్లగా ప్రభుత నెఱపె !

కొమ్మరాజు మల్దేవుని కూర్మి మేన
మామ! అతని యేకైక కుమారుడె అల
రాజు ! నలగామునేక తనూజ పేరి
యాలదేవి యల్రాజున్ స్వయంవరించె!

ఇంతలో గోడిపోరుఁ గల్పించె నాగ
మాంబ ! అందు మాచెర్ల రాజ్యంబు నొడ్డి
బ్రహ్మనాయఁ డోటువడె! ప్రవాసపు గతి
పట్టె మల్దేవున కతని వర్గమునకు !

స్వార్థరహిత చిత్తుఁడు, ధర్మపక్ష సభ్యుఁ
డు నగు నలగామ జామాతృఁడు–అలరాజు
ప్రియసఖీ దూరుఁడై, మాతృపితృ సమేతుఁ
డై యడవికేగె మలిదేవు ననుసరించి!

వర్షసప్తకం బవ్విధి వారు ద్యూత
నిర్ణయ ప్రకార మడవినిం బ్రవాస
జీవితంబును గడపిరి చిట్టచివర
కిపుడు స్వీయరాజ్యమ్మున కేగ నుండి
ఇదియ పూర్వగాథ ! యిటనుండి యుత్తర
గాథ సాగు నాటకంబు వోలె

## రూపక స్వరూపము

**ప్రథమాంకము**

ప్రథమ రంగము — వననాటి, వీరమేడపి
ద్వితీయ రంగము – రచ్చసాల వీరమేడపి
తృతీయ రంగము –శాంతికుటి, వీరమేడపి

**ద్వితీయాంకము**

ప్రథమ రంగము –రాజవీధి, గురజాల
ద్వితీయ రంగము –శుద్ధాంతము, గురజాల
తృతీయ రంగము – హజారము, గురజాల

**తృతీయాంకము**

ప్రథమ రంగము – హజారము, గురజాల
ద్వితీయ రంగము — పాంథశాల, కారెమపూడి
తృతీయ రంగము – శుద్ధాంతము, గురజాల

**చతుర్థాంకము**

ప్రథమ రంగము– వనవాటి, వీరమేడపి
ద్వితీయ రంగము– శాంతికుటి, వీరమేడపి
తృతీయ రంగము – హజారము, గురజాల

**పంచమాంకము**

ప్రథమ రంగము– సింహసౌధము, గురజాల
ద్వితీయ రంగము — పాంథశాల, కారెమపూడి
తృతీయ రంగము – వీరశిబిరము, కారెమపూడి

## రంగ వివరణము

వనవాటి: మలిదేవుని ప్రవాసపురమైన వీర మేడవికి సమీపముగనుండు వనము.

రచ్చసాల: మలిదేవాదుల సమావేశ మందిరము.

శాంతికుటి: వీరమేడపిలో అలరాజ నివాసగృహము

రాజవీధి: గురజాలపుర దుర్గమునకుబోవు మార్గము

శుద్ధాంతము: గురజాల దుర్గమున పేరిందేవి యంతఃపురము
హజారము: గురజాలలో నలగాముని కొలువుకూటము
పాంథశాల: కారెమపూడిలో కొమ్మరాజు కట్టించిన సత్రము
సింహసౌధము: గురజాలలో నరసింహరాజ నివాస భవనము
వీర శిబిరము: కారెమపూడిలో బ్రహ్మనాయని శిబిరము

## పాత్రలు

**అలరాజు**: కొమ్మరాజ కుమారుదు
**కొమ్మరాజు**: అలరాజ జనకుఁడు
**మలిదేవరాజు**: పదవీ భ్రష్టుఁడైన మాచెర్ల ప్రభువు
**బ్రహ్మనాయఁడు**: మలిదేవుని మంత్రి
**కన్నమదాసు**: బ్రహ్మనాయని ధర్మపుత్రుఁడు
**బాలచంద్రుడు**: బ్రహ్మనాయని కుమారుఁడు
**నలగామరాజు**: గురజాల ప్రభువు – అలరాజు మామ
**నరసింహరాజు**: నలగామరాజ సోదరుఁడు
**బ్రహ్మరెడ్డి, వీరారెడ్డి** : గురజాల రాజ్యసభా గౌరవ సభ్యులు
**పోతురాజు**: (వీరభద్రుఁడు) నాయకురాలి యాంత రంగికుఁడు
**కేతరాజు**: నలగాముని మిత్రుఁడైన ధరణికోట ప్రభువు
**గానయ్య**: యువ గాయకుఁడు
**కొమ్మజియ్యరు**: గురజాలలోని మాలాకారుఁడు
**కవి**: గురజాల నివాసియైన కవీశ్వరుఁడు మఱియు కొందఱు భటులు
**స్త్రీలు:**
**పేరియాలదేవి:** ( పేరిందేవి) అలరాజు అర్ధాంగి. నల గాముని సుత
**శీలాంబ, జ్ఞానాంబ**: పేరిందేవి చెలికత్తెలు
**చెల్లమాంబ**: అలరాజ మాత
**నాయకురాలు**: (నాగమ్మ) నలగాముని మంత్రిణి.

నాగాపగా గాఢవేగంబడెల్ల,
చంద్రభాగా నదీ స్వచ్ఛంబడెల్ల,
ఎత్తిపోతల నాద హృదయంబడెల్ల,
నా కవనంబు లోన నిలుచును గాక !

## ప్రథమాంకము

## ప్రథమ రంగము

## (వనవాటి – వీరమేడపి)

**బ్రహ్మనాయఁడు**: (కోడికూత విని) అహో: కృకవాకమా! దిక్కులు పిక్కటిల్లఁ గూయుచుంటి వేల !

మానవ లోకమున్ నిదురమానుము లెమ్మని మేలు కొల్పుటో?
భానుని వేగ రమ్మనుచు స్వాగత మిచ్చుటొ? నాఁటి కోడి జూ
దాన సమస్త రాజ్యమును దాయల కిచ్చిన వారి గాథలన్
గానము సేయుటో? కితవ శంక జగత్తును హెచ్చరించుటో?
నేనిటు లెన్ని యెంతు నిఁక నీ యులి వారసి కుక్కుటోత్తమా!

చరణాయుధ ద్యూత వ్యసనుఁడ నైన నా మూలమునఁగదా, మలిదేవ ప్రభువు మాచెర్ల రాజ్యభ్రష్టుఁడై సపరివారముగా సప్తవత్సర ప్రవాస మొనర్చినాఁడు.

జూదరిని నమ్మి యాశ్రయించు జనులకును
జూదగాని దరిద్రమే చుట్టుకొనును !
శిథిల గృహము నందున్ నివసించు వారు
తద్గృహముతోఁడ గూలరే తాము కూడ !

(కన్నమదాసు ప్రవేశించును)

**కన్నమదాసు**: (ప్రాంజలించి) తండ్రీ! కన్నమదాసు నమస్కరించు చున్నాఁడు.

**బ్రహ్మనాయఁడు:** (ఆశీర్వదించి) నాయనా! నా కన్నమా! చిరకాలము వర్థిల్లుము నాయనా!

**కన్నమదాసు**: తండ్రీ! నాఁటి కోడిజూద మాపాదించిన ప్రవాసకాల మీ నాఁటికిఁ గదా యంతరించినది.

**బ్రహ్మనాయఁడు**: (నిట్టూర్చి) నా సుదీర్ఘ జీవితకాలమునం దా కోడి జూదపు దిన మత్యంత ఘోర భయంకర దుర్దినము! దుర్విధి యొక్క

దుష్టహస్తము ధర్మమునకుఁ బరాజయమును, అధర్మమునకు నఖండ విజయమును బంచిపెట్టిన దివసమది!

**కన్నమదాసు**: తండ్రీ! నేఁటికిని మాచెర్ల రాజ్యమును మలిదేవుల కీయఁబోమని నలగామరాజు గురజాల కొల్వునఁ బ్రకటించు చున్నాఁడఁట!

**బ్రహ్మనాయఁడు**: నాయనా అదెల్ల నాగమ్మసేయు దుర్బోధల ఫలితమేనోయి: ఆ నలగామరాజు –

ఎందఱు చెప్పినన్ వినఁడదేమి విచిత్రమొ కాని, నాయురా
లెందున దూఁకుమన్న నతఁడేమియుఁగొంకకయందెదూఁకు! ఏ
మందును నూఱిపోసినదొ, మాయలమారిది నాగసాని ! తా
నందల మెక్కకుండియు మహాధిపురాలిగ నున్న దక్కటా!

**కన్నమదాసు**: తండ్రీ ! ఆ నలగాముని దొక బ్రతుకా ?

అడుగులకు మడుఁగు లొత్తెన్
పడఁతికి స్వీయౌన్నతిఁ దలఁపక యజ్ఞానాం
ధుఁడు పౌరుషహీనుఁ డభా
గ్యుఁ డసహ్యావేశమున్ రగుల్కొల్పించున్!

**బ్రహ్మనాయఁడు**: కన్నమా! అటుచూడుము. బాలభానుఁడు పొడుపుమల నెక్కి, పుడమి కెల్ల పైఁడి మలాముఁ బూయుచు. చీఁకటి మూఁకను జెదరఁగొట్టుచున్నాఁడు.

**కన్నమదాసు**: తండ్రీ! నేఁడిది యపూర్వము కాదు కదా !

ప్రాగ్దిశాద్రిన్ నిలచి యినబాల మృగయుఁ
డీ తమస్సింహమున్ సంహరించుఁగాక;
తర తరాల మానవ జీవితాంధమేదొ
తొలచి వేధించు నా హృదిన్, తొలఁగిపోక!

**బ్రహ్మనాయఁడు**: నాయనా ! కన్నమా! నీహృద్వేదన నాకు విదితము కానిది కాదు.

కులము లేని, మతము లేని, కుళ్ళు లేని
నవసమాజ నిర్మాణ మొనర్ప నడుము
కట్టిపోద మభ్యుదయ మార్గంబునందు !
ఈ శుభోదయ మందిదే నా శపథము !

స్థిర చిత్తుడ నగుము. ఈ విశ్వ నాటక శాలయందు మన మింక వినూత్న జీవన్నాటక మాడవలయును. తుద కది మోదాంతమగునో, ఖేదాంత మగునో ? పోదము రమ్ము. (ఇరువుడు నిష్క్రమింతురు.)

## ద్వితీయ రంగము
## (రచ్చసాల – వీరమేడపి)

**మలిదేవరాజు**: (ఉద్వేగముతో) మామా. కొమ్మరాజా! మహామాత్యా, బ్రహ్మనార్యా! బంధుమిత్రులారా! నా బ్రదుకున వెతలు తెఅపి పడుటెన్నఁడో తెలియకున్నది.

తండ్రి తదుపరి తండ్రి యంతటి మదగ్ర
జుండె నా పొడ గిట్టక యుండె! తమ్ముఁ
డడుగుకొను దేశ దిమ్మరి యగుటయే తన
కిచ్చగించుఁ గాఁబోలు ! నేనేమి సేతు!
మా పరిష్కారమునకు సమరమే శరణ్యమని తలంతురేమో కాని
రాజ్యకాంక్షతో మే మిర్వురము సంగ
ర మొనరింతు మా ప్రవహించు రక్తఝురులు!
ఎవరి పాలన యందైన నేమి? నా ప్ర
జలు సుఖాన జీవించినఁ జాలు నాకు !

**కొమ్మరాజు**: మలిదేవా! యింకను నీ ఛాందసమును మానకున్నావు. విషోరగ ఫణము వంటి గురజాల వారి ఛత్రచ్ఛాయల సుఖపడు వారెవ్వరు ?

**కన్నమదాసు**: ప్రభూ! ద్రోహులను దండించుటలో నుదాసీనత తగునా?

**మలిదేవరాజు**: (ప్రక్షోభతో) విషాదావిలమైన నా హృదయాందో ళనను మీ రెవ్వరును గ్రహింపకున్నారు.

అక్కట! బాంధవుల్ ప్రజలు నందఱు సంగరరంగమందు నా
యొక్కని కోసమై తెగుట కోర్వదు చిత్తము ! స్వర్ణ భూమి నా
చక్కని దేశమా రుధిర సాగరమందొక తెప్ప రీతిగా
నుక్కిరిబిక్కిరై మునుఁగునో! దరిఁజేరునొ! ఏమిమూఁడునో
దురాశా మతినై దుష్కీర్తితో చరిత్రయందు తరతరాల వఱకు
మ్రోఁగుట కేను సమ్మతింపను.
అలుఁగు మహీవిభుండు ముగురాత్మజులన్ గనిపోవ, వారుపా
ళులు తెగకుంటచే కలనిలో పడి కొట్టుక చచ్చిరంచు లో
కులు మము దూఱుటేల? కడుఁగుచ్చితుఁడా నలగామరాజె లు
బ్ధుల పయి లుబ్ధరాజనెడి దుర్యశమందుచు నేలుఁ గావుతన్

**కన్నమదాసు**: ప్రభూ! మీ పలుకులే మీయెడ మాకున్న గౌరవాభిమానములఁ దొలగించు నట్లున్నవి. రాజదండమును మూలఁబెట్టి కేల జపమాలఁ గీలింతురా? అడవులఁ బడి కందమూలములఁ దిందురా?

**మలిదేవరాజు**: మిత్రమా! కన్నమా! నాకు నా జీవికను గూర్చి యాందోళన మెన్నఁడును లేదు.

శిలఁగల కప్పకున్, గగన సీమలఁబోయెడు పక్షికిన్, జలం
బుల ఝషజాతికిన్, తుదకు పుట్టలలోని పిపీలికాళికిన్
వలసిన ఓగిరంబుల నెవం డొనగూర్చునొ ఆ ప్రభుండె మ
మ్మలనొకకంటఁజూచును, ప్రమోదముకూర్చునుజీవితంబులన్
మాచెర్ల గద్దెపై నన్ను బునరాసీనుఁ గావింప మీ రేల ప్రయాస పడెదరు?
పుడమికి నాథుఁడైన, మఱి పుట్టుక చేతఁ గుబేరుఁడెన, ఎ
వ్వఁడయిన పొట్ట నింపుకొనువాఁడె ! నికృష్టదరిద్రుకై నసుం
గుడువఁగ నింత కూడు దొరకుంగద! అయ్యది లేక చచ్చునె
వ్వఁడిలను? దీని కింతటి వివాదములేలొకొ ? బాధలేలొకో ?

**కన్నమదాసు**: ప్రభూ! యివేటి మాటలు: జీవితము నేల నీరసమును, నిరర్థకమును జేసికొందువు?

కానల నిన్నియేండ్లు మనకర్మము కాలి నివాసముంటి మ
ద్ధానికిఁదోడు సర్వమును దాయలకే యిడి పొట్టకూటి నె
ట్లైనను గూర్చుకొందు నని యాడుదువే మలిదేవ భూప ! ఔ
రా! నిజరాజ్యవై భవములన్ విడి బిచ్చము లెత్తుకొందువే ?

బ్రతుకున వెన్నిచ్చి పలాయనము చిత్తగించు యీ పంద తన మెన్నఁడును నెవ్వరికిని హితముకాదు –

విన్నఁదనంబుతోడ పృథివీవర! నీ విటు లాడనేల? నా
విన్నప మాలకించి యవివేకపు టూహలు మానుమింక ! నీ
యన్నకు బుద్ధి సెప్ప నిడు మానతి! భైరవ ఖడ్గధారి యీ
కన్నమ దాసుఁడే సమరకార్యము సర్వము నిర్వహించెడున్!

ఆజ్ఞ! ( వీరముష్టితో నతమస్తుఁడై మోఁకరిల్లును )

**మలిదేవరాజు**: (నిశ్వసించి) నా పలనాటి వైభవమెల్ల కొడిఁగట్టు కాల మేతెంచినది!

**బ్రహ్మనాయఁడు**: (ఉద్వేగముతో) మలిదేవా! నీ వట్టి యమంగళము లాడరాదు. నాయనా! కన్నమా! శాంతింపుము నీ వెవరి మీదికో పరాక్రమించుటేల?

నీతి విహీనరీతి అవనీపతి రాజ్యము నెల్ల కుక్కుట
ద్యూతమునందు శాత్రవులు దోసిటఁబోసిన ధూర్తమానవుం
డీతఁడు నీ సమక్షముననే కలఁడీతని ముందు చంపు మ
య్యా! తరువాతనే పగతురందఱఁ గూల్తువుగాక పోరిలోన్

**కన్నమదాసు**: (భగ్నస్వరమున) తండ్రీ! తండ్రీ!

అఖిలదేశ జనార్చితా ! అద్వితీయ
శౌర్య సద్యశా! ఆదర్శ సచివ! అపర
కేశవా ! భవన్మానస క్లేశమైతి !
తండ్రి! సైఁపుమా యీ బిడ్డ తప్పు నిపుడు!

(అని సాగిలపడి ప్రణమిల్లును)

**బ్రహ్మనాయఁడు**: లెమ్ము! నాయనా! లెమ్ము! (లేవఁదీసి యుపలాలించుచు) కన్నమా! పసికాయపు! వట్టి పిచ్చికొయ్యవు! ఈ కొంచెమునకేల కనులనీరు నించెదవు (కన్నీరు తుడుచును)

**మలిదేవరాజు**: (ప్రహర్షముతో) మిత్రమా! కన్నమా!.

నీ జన్మము ధన్యమైనదయ్యా? కాదేని —
ఎక్కడిబ్రహ్మనాయఁడొ? మరెక్కడికన్నమదాసొ? యిర్వురున్
జక్కగ తండ్రి బిడ్డలగు సత్కథయెట్టిదొ? మానవాళిలో
నిక్కపు బాంధవం బరయ నిర్మల చిత్తము లెక్కడుండునో
అక్కడనే కదా మొలుచు! అక్కడనే కద వర్ధిలున్ సఖా !

(బాలచంద్రుఁడు ప్రవేశించును)

**కొమ్మరాజు**: మనమింక కాలయాపన మొనర్చుటేల? ప్రస్తుత కర్తవ్యమును బర్యాలోచింపుడు.

**బ్రహ్మనాయఁడు**: బావా! కొమ్మరాజా! అందఱును వినుఁడు, తొడుగునఁబడిన పట్టు వలువను విడువరాదు, బఱబఱ లాగను రాదు, మాచెర్ల విషయమై మన ముపేక్షించుట కాని, యుఱవడించుట కాని రెండునుఁ దగిన మార్గములు కావు మరియు —

దెబ్బకు దెబ్బతీయఁగల దీమసమా మనకేది? నాయురా
లిబ్బడి కిబ్బడిన్ ధనము నెల్లెడ జిమ్మి మహా చమూ బలం
బొబ్బిడి సేసియుండ, మనమో వనిలోఁబడియుంటి మక్కటా
డబ్బును నోరునుం గలుగు టక్కరిదే కదరాజ్య మెప్పుడున్ !

**బాలచంద్రుఁడు**: (దిగ్గున లేచి) అట్టిమాటలకే నాయొడలు మండును.

**బ్రహ్మనాయఁడు**: (కనుబొమలు చిట్లించి) ఎట్టి మాటలకురా నీ యొడలు మండుట?

**బాలచంద్రుఁడు**: ఇట నదురు గుండియ లెవ్వరును లేదు. వారితో పోరలేని శక్తిహీను లెవ్వరు నిటలేరు. ఇట నెవ్వరి శౌర్యమును చవట బాఱలేదు. ప్రభువు లనుమతింపవలయునేకాని (చిటిక వైచి) క్షణము పట్టదు; నేను, నా సోదర మిత్రులమే–

**బ్రహ్మనాయఁడు**: (క్రోధ గంభీర స్వరమున) బాల చంద్రా!

నీ బాలిశ ప్రగల్భములకుఁ దగిన చోటు భ్రమరక క్రీడారంగమే కాని, వ్యవహర్తలుండు సభారంగము కాదు.

**కొమ్మరాజు:** బాలచంద్రా! శాంతింపుము! మనమెల్లరము కూడఁబలుకుకొని పోవలసిన ప్రస్తుత విషమ సమయమందు మనలో మనకి పరస్పర విభేదాభిప్రాయవర్తనము లేల ?

**బాలచంద్రుఁడు**: (రోషావేశములో) మామా! దొంగ నేలపై వారి పారుపత్తెమునకేను సైరింతునా? పౌరుషమున్నవాఁడెవ్వఁడైనను సైరించునా? ఒప్పరికించియున్న కొలఁది వారంతయు చప్పరించి మ్రింగెదరే కాని ఫలితముండునా?

**మలిదేవరాజు**: ఐన నిపుడేమి సేయుమందువు బాలచంద్రా?

**బాలచంద్రుఁడు**: ప్రభూ! స్వరాజ్య ప్రాప్తికి శత్రు సంహారమే మగసిరిగలపని; కానీ, వారి పాదములచెంత ప్రాథేయపడుట పనికిమాలిన పని.

మలిదేవరాజు: ఇట నెవ్వరును వారి పాదముల చెంత ప్రాథేయ పడుట లేదు. నీవు మాత్రము కుదురుగా నొకచోట కూర్చుండుము నాయనా!

(బాలచంద్రుఁడు రోషించి నిష్క్రమించును)

**బ్రహ్మనాయఁడు**: ఇఁక వినుఁడు; మన పక్షము నుండి రాయబారి నొకని సంధి యత్నమునకై నిర్ణయించితిని. (కొమ్మరాజుతో) బావా నీ యభిప్రాయమేమి?

**కొమ్మరాజు**: ఇది ప్రశంసనీయముగ నున్నది. ఇంతకును మన రాయబారి యెవరు?

**బ్రహ్మనాయఁడు**: ఎవరో యెందులకు? బావా! నీపుత్రుడలరాజేకలఁడు!

ఇరువురి చుట్టమై పుడమి నెంతయు కీర్తిని గన్నవాఁడు, కో
పరహితుఁడార్తరక్షకుఁడు! వైరము కోరనివాఁడు ! శాంతినే
నిరతము కోరువాఁడు! రమణీయ చరిత్రుఁడు రాచమల్లుఁడే
సరియగువాఁడు వారికడ సంధి విధంబును నిర్వహింపగన్ !

(చేతులు పట్టుకొని) బావా! యిందులకు నీవు కాదన దగదు; ఆమోదింపక తప్పదు.

**కొమ్మరాజు**: ( కష్టాంగీకారముతో) సరే, కానిండు,

## తృతీయ రంగము
## (శాంతికుటి – వీరమేడపి)

**బాలచంద్రుడు**: బావా! అలరాజా! కాలము మాఱిపోయినది. స్వార్ధపరుల, ప్రజాద్రోహుల పడగలు కూలుకాలమాసన్నమైనది. శత్రు చండాలుర నెంప నూర్పిడి సేయక నిద్రపోఁడీ బాలచంద్రుఁడు.

**అలరాజు**: నీ పొలికేకలు, పోటుఁగూఁతలు కట్టిపెట్టు మింక బాలచంద్రా!

**బాలచంద్రుడు**: ఆ తుక్కు మూఁకను దుక్కు రేఁగఁ గొట్టెదను. మండెవైచి పొడిచెదను, మునుము పెట్టి నఱకెదను.

**అలరాజు**: పోరికొాఱకిట్లు బెరసవై జాతర సేయుచున్నావు: సమరమన్న కారు బొల్లనిపై స్వారి యొనర్చుటనుకొంటివా?

**బాలచంద్రుడు**: సంధించుటనిన సావరాల జమ్ముపై స్వారించుటనుకొంటివా? నీ వీ యత్నమున నెగ్గుదువేని పేరు మార్చి నన్నుఁ బిలువుము

అందఱి నోళ్లుగొట్టి, తమ కందిన దంతయు మెక్కి, ధాత్రిలో
నం దమదే జగా దొరతనంబను బిఱ్ఱున నిక్కు మందతో
పొందొనగూర్ప నీ వటకుఁ బోయిన నిష్ఫలమౌ నటంచు నే
పందెమువైతు ! నా కెదురు పందెమువేయుమ దొమ్మలున్నచో!

**అలరాజు**: (చిఱునవ్వుతో) నోరు పెట్టుకొని బ్రతుకుచున్నావు; కానిమ్ము.

**బాలచంద్రుడు**: (చిఱచిఱలాడుచు) కానీ, నీవలెమాత్రము కాదు,
దోచిన రాజ్యమున్ మరల దోచు తలంపునఁ దొండిసేయు ఆ
నీచుల పజ్జకున్ దగును నెయ్యమటంచు వచింపఁబోయినన్
యాచన సేయవచ్చిరని ఆమున కెక్కుదురయ్యవారు! ఆ
లోచన లేక యెట్టి పనిలోనయినన్ జెయివెట్టఁగూడునే ?

**అలరాజు**: నీవుమాత్ర మాలోచించియే కయ్యమన్న నొంటికాలితో దూఁకుచుంటివి కాఁబోలు! పిల్లకాకికి నుండవింటిదెబ్బ తెలియదు కదా! బాలచంద్రా ! నీ కొండాట మిఁక కట్టిపెట్టుము.

**బాలచంద్రుడు**: తమరు గురజాల వారికడ సేయఁబోపు మండాట మునకే నెప్పుడును గొండాటమే పెట్టెదను. అది నా విధి.

(చెల్లమాంబ ప్రవేశించును)

**బాలచంద్రుఁడు**: అత్తా! నీ కొడుకు మామగారి యింటి కేగుచున్నాడమ్మా! బావా! అరణ మారగించి రమ్ము; కానీ, ఆరణ మాపించుట నీ తరము కాదు. ఇదే చూడఁగలవు. బాలవాక్కు బ్రహ్మవాక్కు సుమా! (నిష్క్రమించును)

**అలరాజు**: (ఆర్ధ స్వగతము) బాలుని వాక్కులకును, బ్రహ్మన్న వాక్కులకును ఎన్నటికిని సామ్యముండదు బాలచంద్రా!

(బ్రహ్మనాయఁడు, కన్నమదాసు ప్రవేశింతురు)

**అలరాజు**: (అంజలించి) గురుదేవులకు అభివాదనములు!

**చెల్లమాంబ**: (వినయ హర్షములతో) అన్నయ్యా! యెన్నాళ్ళకు మా యింటి కేతెంచితివి !

**బ్రహ్మనాయఁడు**: చెల్లెలా! కుశలమే కదా! నీతనయుఁడు రాయబారిగా నీ వియ్యంకుని కడకేగుచున్నాడమ్మా!

**చెల్లమాంబ**: అన్నా! యిట్టి వ్యవహారములకు మీరిందఱు పెద్ద తలలుండఁగా–

నల్లని వన్నియు నీళ్ళను.
తెల్లని వన్నియును పాల తీరునఁగను! ఏ
కల్లా కపటము లెఱుఁగని
పిల్లఁడు వీడెట్లు నీకు పెద్దగ దొరకెన్

బ్రహ్మనాయఁడు: అదికాదు చెల్లెలా ! వినుము.
నలగామuni జామాతృఁడు,
మలిదేవుని బంధుఁడు, జన మాన్యుఁడు, సుగుణో
జ్జ్వల హృదయుఁడు, నీ తనయుఁడు –
అలరాజొక్కండె దీని కర్హుండమ్మా!

అందుచే మాకెల్లరకును ఆమోద యోగ్యుఁడైనాడు. ఇందులకు కొమ్మన బావకూడ యనుమతించినాఁడు. నీవును సుముఖురాల వగుము.

**చెల్లమాంబ**: (డగ్గుత్తికతో) అన్నా! మా పంచప్రాణములు వీఁడే అందఱవంటివాఁడుకాఁడు నా బిడ్డ నోట నాలుకలేని వట్టి మేదకుఁడు! అచట నిరుగింటి దెయ్యము, పొరుగింటి గూబ ఆ నాగమ్మ యున్నది. నా గుండెయందేదో గుబులుగా నున్నది (కన్నీరోడ్చును)

**బ్రహ్మనాయుఁడు**: అమ్మా! ధైర్యముగ నుండుము. నీ బిడ్డ కెట్టి బెడదయురాదు. అన్నిఁటికి నా చెన్నకేశవుఁడున్నాఁడమ్మా!

సమర పథానఁ గా కిటుల సంధి విధంబున బోయి, తత్ప్రయ
త్నమునజయించి, భూములనుదక్కెడునట్లుగఁజేయు టెంత పు
ణ్యమొ! భవదంతరంగమున కన్నియునున్ విశదంబె! యిట్టి స
త్సమయమునందె యీ శుభ విదారక శోకములేల చెల్లెలా!

**చెల్లమాంబ**: (కొంగుతో కన్నీరు తుడుచుకొని) నాయనా ! అలరాజా! పెద్దవాఁడీయన చెప్పునట్లాచరింపుము (నిష్క్రమించును)

**బ్రహ్మనాయఁడు**: అలరాజా! బాలచంద్రుఁడేమి వాగినాఁడేమి?

**కన్నమదాసు**: (స్వగతము) తండ్రిగారు కుతూహలాంశమునే యెత్తినారు.

**అలరాజు**: (చిఱునవ్వుతో) గురుదేవా !

బాలచంద్రుఁడాడు పలుకులఁ దిలకింప
నాతఁ డాతని హితు లందఱనికి
దూఁకుచున్న తెఱఁగు తోచుచున్నది నాకు!
సంధి యరద మింక సాగుటెట్లొ ?

**బ్రహ్మనాయఁడు**: (తీవ్రవ్యథతో) కడుపు చించుకొన్న కాళ్ళమీద బడును! ఏమి చెప్పుకొన్న నేమి తీరును?

వినుమలరాజ! బాలుఁడొక వెంగలి తానెఱుఁగండు మంచిఁజె
డ్డను! మది నూహసేయఁడకటా! యివి పల్కెడు పల్కులౌను కా
వని; యిటు ముందు వెన్కలకు నాగుటలేదటు పిచ్చిగంతు లె
త్తుననికి! ఇట్టి వీనివగు దోసము లారసియేను కుందెదన్!

అదియునుగాక ——

ఆలమనిన మాటలా? బాలుఁడెగురుట
కద్ది బొంగరాల యాటకాదు!
అనుభవంబె యున్న ఆవేశముండునే ?
బాలుఁడకట! వట్టి బాలుఁడయ్య !

**అలరాజు**: చిఱునవ్వుతో ఏ జనకునికేని తన తనయుఁడు బాలుఁడే కదా !

**బ్రహ్మనాయఁడు**: (ధోరణి మార్చి) ఇక, పరిస్థితులెట్లు పరిణమించునో యన్న సంశయమే నా మస్తిష్కమును గలఁచివైచుచున్నది.

నలగామాధిపుఁడే విధానఁ జనునో? నాగాంబనే నమ్మునో?
తలయందే పురుగో చరింపఁగ మరే తంత్రాలకుం డిగ్గునో?
పలనా డాలపుఁ జిచ్చునంబడి వెసన్ భస్మంబెయై పోవునో?
అలరాజా! యిఁక నేదియెట్టులగునో యాందోళనం బయ్యెడున్!

నాతల నేనిట్లు పగులఁగొట్టుకొనుచుండ నిటు వీరును, నటు వారును పోరికొఱకు కరవాలముల నూఱుచున్నారు.

''శాంతి! శాంతి!'' యనుచు గొంతెత్తి నే మొత్తు
కొందు! అన్యకార్య బంధచిత్తు
లౌచు ఆలకింప రక్కటా! యింక స్మ
శాన శాంతియైన జాలునాకు!

మరణముం గాక సర్వముం జయించితినని దర్పించు మానవుఁడు నిత్య జీవితమం దెన్నింటినో సాధింపలేకున్నాడు! నాటినుండి నేఁటి దాఁక పలనాటి గడ్డమీద సుస్థిర శాంతిని నెలకొల్పలేనైతి!

**అలరాజు**: (వినమ్రుండై) గురువరా! యింక నా కర్తవ్యమును విశదీకరింపుండు.
**బ్రహ్మనాయుడు**: ఆం అలరాజా ! అచ్చటికే వచ్చుచున్నాను. దయా దూరుండైన గురజాల సౌర్వభౌముని సభామధ్యమున నీవుకావించు ప్రసంగములచే నాతని హృదయ మార్ద్రమై. కరుణా భరితమై పరివర్తింప వలె!

పోయెడువేళం గట్టుకొని పోవునదేదియు లేదు! నాల్గు నా
ళ్ళీ యిలమీద నిల్చునపుడేదియు నుండకపోదు! కాన, అ
న్యాయముంజేసి లోకుల ధనంబుల దోచుట పాడికాదు భూ
నాయక! యంచుగామునకు నచ్చెడుమాటలంజెప్పు మచ్చటన్

అలరాజా! అన్యథా భావింపవేని నిన్ను నేనొక విషయము హెచ్చరింప దలంచుచున్నాను.
**అలరాజు**: (వినయముతో) మీరు బోధింపదగిన వారు నేను పాటించవలసినవాండను. అది విధాయకమే కదా!
**బ్రహ్మనాయుడు**: అలరాజా! రాత్రి చీకటిం దఱుముటకు సుధాంశుండుదయించును రాత్రియే లేకుండం జేయుటకు చండాంశుం డుదయించును. అన్యాయమును వ్యతిరేకించు శాంతమూర్తివయ్యు, దానిని బరిమాఱ్చు తఱి తీవ్రక్రోధమూర్తివయ్యెదవు!
**కన్నమదాను**: అంధకారమును సంహరించు లోక బాంధవుండు చండాంశుండైన నేమి?
**బ్రహ్మనాయుడు**: కానీ, నలగాముని కొలువున అలరాజు ఆగ్రహమునే ప్రదర్శించునేని ఆదియొక నెపముగా లాగి వారు రాయబారమునే నిరాకరింపంగల ప్రమాదము లేకపోలేదు. అలరాజా! ఓర్పులేనివాండు నేర్పరి యెట్లౌను ?

మాటలతోడ నెయ్యమును, మాటలతోడనె కయ్యమందు రా
మాటలనెట్టు లాడుదువొ మామ సభాస్థలి! క్రూరనాగ మ
చ్చోటనెపొంచి నీనుడులం జొప్పడనిచ్చునె? పాలముంతువో?
నీటనె ముంతువో? బరువు నీపయి మోపితిమోయి నాయనా!

బుసకొట్టుచు, కాటేయ వచ్చు సర్పమును దప్పించుకొని నైపుణ్యముగ దానిని తన యదుపునకు దెచ్చుకొని, విసముఁగ్రక్కించి, కోఱలు పెఱికి, దానిని తన యిచ్చవచ్చినట్లాడించు పాములానివలె నీవా నాగమ్మ విషయమున వ్యవహరింపవలయును.

**అలరాజు**: నాకు మీ భావ మవగతమైనది!

నటుని పాత్రోచితంబగు నటన వలెనె
వ్యవహరింపవలయు వ్యవహర్త కూడ!
తనకు వచ్చు కోపము నాఁపుకొనఁగవలయు !
తనకు రాని కోపముఁ దెచ్చుకొనఁగ వలయు !

**బ్రహ్మనాయఁడు**: (వికాసముతో) కుశాగ్రబుద్ధివి! సర్వ సమీక్ష్య కారివి! నీకు విదితము కాని విషయము లుండునా? ఇంక నీ ప్రయాణమున కే యే లాంఛనముల వాంఛించుచున్నావో?

**అలరాజు**: కన్నమ దా సొకఁడు మాత్రము నాకు తోడు వచ్చినఁ జాలు. ఎట్టి యాటోపములును నా కక్కఱ లేదు.

**బ్రహ్మనాయఁడు**: (హర్షముతో) భళిరా. అలరాజా! నీ వంటి సమర్థునకు కార్య సాధనయే పరమ లక్ష్యము కదా! కానీ ——

భావమొందు లేక వ్యర్థ పదాంబ
రంబుఁజూపు కుకవి వ్రాతలట్లు
ఫలితమొందు లేక పైకి డాబుగ నుండు
చేఁతగానివానిచేఁతలెల్ల !

ఇంక, అలరాజ వాక్చంద్రికలతో నలగామ మనోతిమిరము మటుమాయ మగుఁగాక?

**అలరాజు**: (సమ్మోదముతో) ధన్యుఁడను, గురుదేవా! ధన్యుఁడను,

**బ్రహ్మనాయఁడు**: (స్వగతము) అలరాజుతో నన్నియు సక్రమముగా వచించితిని గదా! కటకటా–

సైఁపలేని కొందలము "స్మశాన శాంతి!"
యని పలికె నపశకున మేమౌనొ యింక!
ఉల్లమా ! యూరడిల్లుమా ! ఉరువు నెఱుఁగ
కుండ, యేలకే నీకింత యూగులాట ?

అన్నిటికి నా చెన్నుఁడే యున్నాఁడు. (ప్రకాశము) అలరాజా యిఁక మేము వీడ్కొనుచున్నాము.

**అలరాజు**: గురువరా! శాంతియెడ నాకుగల భక్తి ప్రవృత్తులను నివేదించుకొను సదవకాశము గల్పించితిరి; మీకివే నాకృతజ్ఞతాంజలులు (వినమ్రుఁడై దోయిలొగ్గును).

**బ్రహ్మనాయఁడు**: (చేతులు పట్టుకొని) నాయనా! కృతజ్ఞతల చెప్పుకొనవలసిన వారము మేము నీ శాంతియాత్ర ప్రశాంతముగా సాగును గాక! అభయహస్తమును సదా వహించు శుభకార్య దేవత నీక జయమొసంగునుగాక! కన్నమా పోదము పద.

(బ్రహ్మనాయఁడు. కన్నమదాసు నిష్క్రమింతురు)

**అలరాజు**: (విచారముతో) ఇఁక, భవిష్య మెట్లుండునో?

నే నని గోరనెన్నఁడును నిత్యశుభప్రదమైన శాంతిలో
మానవజాతి బాగుపడు మార్గములున్నవి కాని, సంగరా
హ్వానము వల్కు మూర్ఖు లిరువైపుల నుండిన కారణాన నా
మానసమందు కొంత యనుమానము కల్గెడు నేమిసేయుదున్?
ఐనను జరుగనున్న దేదియో జరుగక మానదు.
శక్తివంచన లేకుండ శతవిధాల
శాంతికై నేను యత్నంబు సల్పవలయు!
యత్న మొక్కటె మనచేఁత నగును గాని
ఫలిత మెట్టిదో ఆ భగవంతు డెఱుఁగు!
ఇంకనేను సత్వరమే ప్రయాణ సంసిద్ధుఁడ నయ్యెదఁ గాక!

(నిష్క్రమించును)

## ద్వితీయాంకము
## ప్రథమ రంగము
## (రాజవీధి – గురజాల)

**కొమ్మజియ్యరు**: (విరిసజ్జతో బెక్కణ మొనర్చుచు) నాయనలారా!

అలరాజు: కందింతుఁ గలువ పువ్వులను!
వలరాజు కందింతు వలపుటమ్ములును!
నా పేరు నెఱుఁగరో నాయన్నలార!
నా యూరు నెఱుఁగరో నా యన్నలార !
కొమ్మ జియ్యరు పేరు కోటలో వినుఁడు!
కొమ్మ జియ్యరు ఊరు గురజాల గనుఁడు!
మాలకరిని నేను మహనీయులార !
మాటకారిని నేను మహితాత్ములార !
ఒక్కొక్క మొక్కకు నొక్కొక్క పువ్వు!
ఒక్కొక్క మోమున కొక్కొక్క నవ్వు!
పువ్వుల కొన్నింటఁ బొక్కును విషము!
నవ్వుల కొన్నింట నక్కును విసము !
(కవి ప్రవేశించును)

**కవి**: కొమ్మజియ్యరూ ! అలరాజుగారు ఆగమించుచున్నారు.

**కొమ్మజయ్యరు**: అవును కవీ! నా పూలమాలలతో నలంకరించెదను.

**కవి**: నేనును నా గేయ మాలికలతో అలరాజు నలరింతును బ్రహ్మనాయక హృదయవైశాల్యమువలె. నాగాంబికా మనోగాంభీర్యము పలె, అలరాజాత్మౌన్నత్యము మిన్నకదా! అడుగో! చూడుము!

శ్రీ బ్రహ్మనాయని శిష్యశేఖరుఁడు!
బాలచంద్రాదుల ప్రాణంపు బావ!
పలనాటి ప్రభువుల పసిఁడి జామాత!
రతనాల పేరమ్మ రమణీయ విభుఁడు!

కొమ్మ భూపాలుని కూరిమి బిడ్డ!
చెల్లమాంబ కడుపు చల్లని వంట!
శాంతికాముల కెల్ల చక్కని దూత!
వీరవరులకెల్ల మేరువు పూస!

కలహ ప్రియులకెల్ల తలమీఁది కొఱవి!
కుటిల చిత్తులకెల్ల గొడ్డలిపెట్టు!
నీతిహీనులకెల్ల నీతి బోధకుఁడు!
రూపవంతులకెల్ల రూపమన్మథుఁడు!

రాచమల్లుఁడను సార్థకకీర్తిమణిని
తన వెడఁద యురాన ధరియించు జోదు!
రాణకెక్కిన సావరాల జమ్మనెడు
హయరాజు నెక్కి స్వారియొనర్చు రౌతు !

సర్వ శాస్త్రజ్ఞుఁడు, సకల సద్గుణుఁడు,
అలరాజ మహనీయుఁడాదర్శమూర్తి!
ఘనుఁడు కన్నమదాసు తనతోఁడు కాగ
గురజాల పురమున కరుదెంచె నేడు!

## ద్వితీయ రంగము

## (శుద్ధాంతము – గురజాల)

**జ్ఞానాంబ**: ఓ! రాకుమారీ! ఇన్ని నాళ్ళను మితసాత్త్వికాహారముల, ఏకభుక్త శుష్కోపవాసములఁ గఠోరవ్రత మాచరించితివి.

**శీలాంబ**: ఓ! రాకుమారీ! నిరంతరము జీవితేశ్వరుని స్మరించుచు వియోగినివైన నీవు యోగిణి వలె భాసించినావు.

**జ్ఞానాంబ**: రాకుమారీ! నేటికి నీ నోములు ఫలించినవి. ప్రాణ విభుని సహధర్మచారిణివైన నీవు ఆహార విహారసౌఖ్యములనుభవింతువు గాక!

**శీలాంబ**: రాకుమారీ! యింతకాలము ప్రభు చరణములను నీ హృదయమందే నిలుపుకొంటివి. నేటినుండి నీ హృదయమును, నీ సర్వస్వమును ప్రభు చరణముల కర్పించు కొందువు గాక.

**పేరియాలదేవి**: (హర్షాశ్రువులఁ దుడుచుకొని) సఖీమణులారా! నన్ను మీ యాత్మీయురాలిగా. మీ ప్రియసోదరిగాఁ జూచుకొనుచున్నారు; సంరక్షించుకొనుచున్నారు. నేఁడు నాహృదయానందము మీ వదనము లందు ప్రతిబింబించి ద్విగుణీకృతమగుచున్నది.

(ఇరువురినిఁ గౌగిలించును)

(నలగామరాజు అడావుడిగా ప్రవేశించును)

**నలగామరాజు**: అమ్మా ! పేరిందేవీ! పేరిందేవీ !

**పేరియాలదేవి**: తండ్రీ ! తండ్రీ ! (తండ్రి కెదురేగును) 1

**నలగామరాజు**: (బిడ్డ నక్కున చేర్చుకొని) ఎంత శుష్కీభవించి పోయితి వమ్మా!

(నాయకురాలు ప్రవేశించును)

**నాయకురాలు**: (అర్ధ స్వగతము) చక్కనమ్మ చిక్కినను జక్కదనమే!

**నలగామరాజు**: మహామంత్రిణీ! రారమ్మా! అమ్మా! పెరిందేవీ

సప్త వత్సరంబులు గురజాల రాజ్య
విభుని గుండెలఁ బిండిన ప్రియసుతా వి
యోగ దుఃఖ తమో భార ముపశమింప
నీ హృదీశ్వరుం డేతెంచు నేఁడు తల్లి !

(నాయకురాలు ప్రక్కకుఁ దిరిగి ముక్కు విఱుచును)

**నలగామరాజు**: ఓజ్ఞానాంబ శీలాంబలారా! అంతరంగసఖీమణులై నా బిడ్డ నిన్నాళ్ళు గాపాడితిరి. మీ ఋణ మెట్లు తీర్చుకొందునమ్మా ఇపుడు మీరు–

కురులదువ్వి, వాల్జెడనల్లి విరులఁదుఱిమి,
పట్టు పుట్టంబులను గట్టఁబెట్టి, పైఁడి
సొమ్ములను బెట్టవలయు మా యమ్మకిపుడు!
రాచమల్లుని ప్రణయ సామ్రాజ్ఞికిపుడు!

(నాయకురాలు ప్రక్కకుఁ దిరిగి మూతి త్రిప్పును)

**జ్ఞానాంబ**: రాకుమారీ! ఇఁక రమ్ము: సహజసౌందర్యవతివైన నిన్నిపుడు చితభూషలతో శృంగారింప వలయును.

**శీలాంబ**: రాకుమారీ! నిసర్గ సౌశీల్య మహాలంకృతవు!

**జ్ఞానాంబ**: రాకుమారీ! సర్వపల్నాటికి పర్వదినమిది!

**శీలాంబ**: రాకుమారీ ! నిఖిలపల్నాటికి శుభదినమిది !

(జ్ఞానాంబ శీలాంబలు పేరియాలదేవినిఁ దోడ్కొని పోదురు)

నలగామరాజు: మహా మంత్రిణీ! మహామంత్రిణీ–

మన పక్షంబున కెట్లు త్రిప్పెదవొ సామ్రాజ్యంబు సర్వంబు నీ
దను లాలింపుల కొమ్మరాట్సుతుని! నీ యత్యంత చాతుర్య వా
గ్వనధిన్ దాఁటఁగ శక్తులే హరిహర బ్రహ్మాదులున్ ? ధీమతీ
విను మేనేమియు చెప్పఁబో నఖిల మీవే నిర్వహింపందగున్ !

**నాయకురాలు**: (స్వగతము) నేనును ముఖప్రీతులాడెదఁ గాక ! (ప్రకాశము) మహారాజా! అందులకు నా యభ్యంతర మేమున్నది! పడుచునిచ్చితిరే యను గౌరవ మాయనకు మన మీఁద లేదు కాని మన మాయనను సదా కొండవలె చూచుకొందుముకదా !

**నలగామరాజు**: మంచిది. మీరు సభామందిరము కడకేగుఁడు నేనిదే వచ్చెదను. (సంబరపాటుతో నిష్క్రమించును)

**నాయకురాలు**: (స్వగతము) అల్లుఁడు చుట్టమును గాఁడు; ఆముదము అమృతమును గాదు. ఇంత మాత్రానకే మహిమీద, మింటమీఁద నిలువ లేకున్నాఁడీ మామ! కానీ యెంత నాలిముచ్చు వాఁడీయన! ఎన్ని నయగారి మాటల వాఁడీయన! ఎన్ని పొరలున్న వాఁడీయన!

ఒకవై పాత్మజపై, తదీయపతిపై నుప్పొంగు ప్రేమంబు! వే
ఱొకవైపూరక రాజ్యవిస్తరణపై నూరేగు పేరాస ! ఎం
తకు తానేమియు నౌనుఁ గాదనఁడు! ఈ ధాత్రీశుచిత్తంబు నా
కొక చిత్రంబుగఁదోచు ! మానవుఁడు తానూహించు నేదేదియో!

ఇఁక రాకుమారిగారున్నారు! ఆ భాగ్యశాలిని కదేమి జబ్బో! ఎప్పుడును గునారిలుచు. ''మగఁడో మగఁడో'' యని యొక్కటే యేడుపు! పాపము! మానవురాలు! దేశమెల్ల కొల్లవోయినట్లేరి కోరి వరించినదా వీరవరునే! మతిలేనమ్మకు గతిలేని మగఁడు! ఇన్నేళ్ళకీ నాఁటికి వచ్చుచున్నాఁడఁట! ఈ సంబరానికేనా యింత విఱ్ఱఁగబాటు! ఈ బులపాటమెక్కడనులేదు. పందిరి యిల్లా? పరదేశీ మగఁడా? కానీ, కోళ్ళబేరానికేగి కోటలో కబురు లడుగునట్లు వాఁడే లోతులు తీయుటకై యిటకుఁజేరుచున్నాడో?

చనుల ఎముకలు లెక్కింపఁజాలు ఘటికుఁ
డరయ సామాన్యుఁడే పేరియాల మగఁడు?
నేఁడితని రాయబారంబు నేనె చెఱుపఁ
జాలనో యింక నాయకురాలఁగాను

(నరసింహరాజు ఆదర బాదరగా ప్రవేశించును)

**నరసింహరాజు**: మహామంత్రిణీ! మీ కొఱకే యన్వేషించుచున్నాను. రాచమల్లుని రాక మీచెవింబడలేదా?

**నాయకురాలు**: అలరాజులుంగారు విజయము సేయుట రాయబారించుటకే కదా! ఇంత పిన్నవాని నేలొకో బ్రహ్మన్నగారిపుడే పెద్దలలోఁ గలిపినారు! లేక, చుట్టపుఁ జూపుగా వచ్చి తానే పట్టపురాజు కావలెనని రాచవారి యల్లుని భావమా?

**నరసింహరాజు**: (ఆత్రముతో) ఇపుడు నా విషయమేమి సేయనున్నారు?

**నాయకురాలు**: అదే విచారించుచున్నాను. ఆఁ! మీరు హజారము కడనుండుఁడు; నేనిదే వచ్చుచున్నాను.

(నరసింహరాజు చిఱు బుఱులాడుచు నిష్క్రమించును)

**నాయకురాలు**: (స్వగతము) మ్రింగలేఁడు; కక్కలేఁడు ఈత దొక యడవి మూర్ఖుఁడు! ఆహా! ఏమి యీతని గబ్బాత్రము!

మలిదేవుండు ప్రవాసమున్నతఱి ఆ మాచెర్ల పట్లబుపై
వెలిగించెన్ తన రాచ పెత్తనము ఈ విఖ్యాత వీరుండు, నేఁ
డలుకన్ బూను నృసింహ భూవిభుఁడు! అన్యాయార్జితంబైన క
ల్ములపై తీపి నితండు సేయగలఁడే మూర్ఖత్వమైనన్ వెసన్!
ఇఁక నా చమత్కారమెల్ల చూపెదఁగాక! (నిష్క్రమించును)

## తృతీయ రంగము
## (హజారము – గురజాల)

**అలరాజు**: మామా! నలగామ సార్వభౌమా! హైహయ వంశార్ణవ సోమా!
పంపిరి నేఁడు నన్నిటకు పార్థివుఁడాదిగ నున్న పెద్దలే
తెంపును జేయఁగా నరుగు దెంచిన వాఁడనుగాను చూవె! మీ
రంపఁగ నెల్ల రాయటవి యందొనరించిరి కాపురంబులన్,
నింపిరి నాటి యా గడువు నేటికి వత్తురు ధారుణీశ్వరా!

కడచిన దెట్టెటో కడచె! కాన నిఁకైనను గయ్యమాపి, నే
నుడువు విధాన వారి ధరనుం దగ వారికొసంగు మందు కీ
వొడఁబడవేని పోరికొఱకూనినవాఁడవు నీవ వౌదు వా
యిడుమలఁ జెందనేల? యిపుడే హితమార్గము చూడుక్ష్మాపతీ!

ఆజిని దూకుచో నరి భయంకరుఁడై, యముఁడై చెలంగు ను
త్తేజుఁడు బ్రహ్మనాయఁడును దీనతనొప్పును! మీకు మాకునై
గాజులు, పుస్తెలూడుటకు; కాలెడి చిచ్చులఁ జావుకున్: మరిం
కాజిని నెత్రుటేఱులకు నా సచివాగ్రణి సమ్మతించునే?

దురమున దూఁకి శాత్రవులఁ ద్రుంచెడు రోసము మీకు మాకునె
ల్లరకును గల్గు! అట్టిది తలంపున కెక్కఁగనీక నేర్పుతో
నిరువురు శాంతి మార్గమున నేగుట తారకమౌను! కానిచో
పరులను గూల్పఁబోవఁ దనవారును గూలకపోరు భూవరా!

వెతల గతమునెల్ల విస్మరించిరి వారు!
నీతి కొఱకునేఁడు నిలచినారు!
శాంతికోరి మీరు సంగరంబును మాని
ఎవరిపాలు వారలేలుకొనుఁడు!

**నాయకురాలు**: అలరాజా! గతమున బ్రహ్మనాయని దుస్తంత్రమున నఖండ పల్నాటి సామ్రాజ్యము చీలిపోయినది. మాచెర్ల రాజధానిగా, మలి

దేవుని ప్రభువుగా సృష్టించిన బ్రహ్మన్న తన చేనికి లేని దురాశ తాను గలవాఁడై సర్వమును మ్రింగనెంచి కోడి మేడము లాడి యోడినాఁడు; ఉన్ననాడు నూడగొట్టుకొనినాఁడు!

**అలరాజు**: మేము మా పరాజయ మంగీకరించియే ద్యూత నిర్ణయ ప్రకారము సప్తవత్సర ప్రవాసమును నెఱవేర్చితిమి.

**నాయకురాలు**: ద్యూత పరాజితులు కొన్నాళ్ళు ప్రవాసింపవలెననియే కాని, ప్రవాసానంతరము స్వీయావాసము జేరవచ్చునని మాత్రము కాదు. అలరాజా!

**అలరాజు**: (స్వగతము) ఇప్పుడే మెలిక పెట్టుచున్నది. (ప్రకాశము) కొన్నాళ్ళు ప్రవాస మనగా తదనంతరము ప్రవాసము కాదు– ఆత్మాయ తనము జేరఁదగు ననియే కదా భావము! మహా మంత్రిణీ! మీ స్థితికట్టి పేచీలు తగినవికావు; ఉన్నత పదవీ నిర్వాహకుల తలంపులు కూడ నున్నతములుగ నుండగలవని యాశించుచున్నాను.

**నాయకురాలు**: మీరు విషయము గ్రహించి మాటాడుటలేదు.

**అలరాజు**: మీరు మర్యాద గుర్తించి భాషించుట లేదు.

**నాయకురాలు**: అనుగు రాణ్ణందన ప్రథములైన నలగామ ప్రభువులు పలనాటి సీమకు సర్వం సహాధికారులు, వారి దయాదాక్షిణ్యాముల మేరకు మలిదేవులకు రాజ్యభాగ మీ బడినది. నేఁడా మలిదేవ వర్గము ప్రభువుల వారి విశ్వాసమును గోల్పోయినది, అదియుఁ గాక ——

వీరులైన వారు పోరఁజూతురు కాని
శక్తిహీనులెపుడు శాంతియనెడు
నెపము నొకటి పూని, నిశ్చల వ్యూహంబు
పన్ని, కూల్పఁగలరు పరుల నెపుడొ !

''శాంతి! శాంతి!'' యని పైకి మీరెంత పులుము కొన్నను మీ శాంతిలోని యంతరార్థమదే కదా!

**అలరాజు**: మీరా రీతి భావించుట యుచితమే!

పూలబుట్ట నయిన నుండు పొలసె యనుచు
సాజముగ నూహసేయుఁ గసాయి వాఁడు!
మంచి మదిలోన నున్నది మంచికాదు
చెడుగటంచు నూహించును చెడ్డవాఁడు!

**నాయకురాలు**: ఆ బ్రహ్మనాయఁడు వీరవైష్ణవ మొకటి సృష్టించి, పల్నాటి సీమ నెల్లరకును పంగనామాలువెట్టి. వర్ణ సంకర మొనర్చి, ప్రజా విప్లవములఁగల్పించి సర్వనాశ మొనర్ప సంకల్పించినాఁడు; అటువంటి విచ్ఛిన్నకర శక్తులకు మేము సదా వ్యతిరేకమే!

**అలరాజు**: అద్దము వంటి బ్రహ్మనాయని హృదయమందును నీ కుటిల మనోకురూపమే నీకుఁ గన్పట్టుచున్నది కానిమ్ము, కపట కుక్కుట దురోదరమున మీరు వంచించి దోచుకొన్న వారి రాజ్యలక్ష్మిని మరియాదగా వారి వశ మొనర్పుఁడు.

**నాయకురాలు**: (మొగము చిట్లించి) ఏ మే మీ? మీ రాజ్యమును మేమేదో యన్యాయముగా నపహరించినట్లు నుడుపు చున్నావు?

**అలరాజు**: నీ వెన్ని యపలాపములతో నోట్రించినను లోకము కోడియై కూయుట లేదా?

**నాయకురాలు**: కోడి పోరున మేమువారిని మభ్యపెట్టిన దేమియును లేదు. ఉత్తపున్నెమునకు వారే యీ చెత్తపుకారును లేవనెత్తిరి.

**అలరాజు**: అందులకే సిరిగల దొంగను తెలివిగల దొరయని లోకులాడుదురు.

పలుగు పాఱలతో రేయి పరులకొంప
దొంగిలుట యొండె కాదుపో దొంగతనము!
కపట పథకాలతో పెఱకల్మి నెట్లు
దోచుకొన్నను అదికూడ దొంగతనమే!

**నాయకురాలు**: మేము నూటికి నూఱుపాళ్ళు రాజనీతి ననుసరించు చున్నాము. కానీ, కొందఱు మా మార్గముల కిట్లు దురర్థముల గల్పించుచున్నారు!

**అలరాజు**: అవును! ఒకవ్యక్తిపై మరొక్క వ్యక్తి, ఒక రాజ్యముపై మరొక్క రాజ్యము కావించు దుస్తంత్ర కృత్యములెల్ల రాజనీతి, వ్యవహార రీతి యను తధాదృశ మృదు మధుర పదజాలముచే సమర్థింపఁబడుట శోచనీయము, విచారకరము!

**బ్రహ్మారెడ్డి**: నాయనా! నలగామరాజా! ఇప్పుడు నేనొకింత వివక్షించు చున్నాను, సోదరులు కలహించుట ఉభయులకును శ్రేయస్కరము కాదు. ఈ యవకాశమున మీరు పరులకు పలుచనై పోయెదరు, చిన్న వాఁడైనను రాచమల్లుఁడు చెప్పునదెల్ల దివ్యముగా నున్నది.

మామ నడుచుకొన్నాఁడు జామాత సెప్పి
నట్లనగ కీర్తినీకు నీ యల్లునకును
దక్కు, సమర సంరంభముల్ దప్పు, దేశ
మెప్పటివలెనె క్షేమాన నొప్పు భూప !
ఒకవేళ సమరము సేయలేకనే యనుకొందము ––
తిరిపమెత్తుకొనుచు మలిదేవ నృపతి
దీనముగ దేశదేశముల్ తిరుగునేని
అడుగుకొనువాఁడు నీ తమ్ముఁడనియె జనులు
వాకొనుదురు ! నీ కది తలవంపు కాదె ?
తుట్ట తుదకు చుట్ట పక్కములలో నీవేల లోకనిందల పాలయ్యెదవు?
అనుఁగుఁ జెలికాఁడ నేను మీ జనకుఁడనుగు
భూమిపతికి! తన్మహనీయు పుత్రులనద
లట్టులల్లరి పాలౌట కాత్మ సమ్మ
తింపకే నింతగాఁ జెప్పితి నలగామ!
అలరాజు: మామా ! దౌర్భ్రాత్ర మెన్నడునుఁ గూడదు.
శాంతిలోన యశంబు రాజ్యంబు దక్కు!
దురమునందవి రెండును దూరమౌను !
శాంతిలో నిల్తు రుభయ పక్షముల వారు !

సమరమునఁ జత్తురుభయ పక్షముల వారు!

శాంతిలో దేశమెంతగ సౌఖ్యపడునొ
సమరమం దంతకంత నాశంబు నందు!
దేశహితముగోరెడు భూపతి వగుదేని
పోరనెడు మహా మారినిఁ గోరవీవు!

దేశహితము కోరని భూపతి వగుదేని
శాంతి దేవతను వ్యతిరేకింతు వీవు!
అల్లుఁడను నీకు, వారల కాప్తబాంధ
వుఁడను; కాన, బోధించితి నుభయ శుభము !

**నలగామరాజు**: వీరా రెడ్డిగారూ! పెద్దలు! మీరే మందురు?

**వీరారెడ్డి**: రాజా ! నలుగురికిఁ జెప్పనేర్చిన ఉచితజ్ఞుఁడవు! బహు జన హితము, ఉభయ పక్షతారకమునైన విధమును అలరాజే ప్రవచించి నాఁడు మరియు నేనును బ్రహ్మారెడ్డియును

సమరమన్నచో మే మిర్వురమును వెఱచి
తనువులన్ దాచుకోనెంచి యనుట కాదు!
సర్వనాశన మొనరించు సమరమన్న
అనుభవజ్ఞు లెవ్వరు నియ్యకొనరు భూప !

నీవీ సంధి కంగీకరించి సంఘాత మరణమును దప్పించుము.

ఈ మహా విశ్వ గమనంబు నెపుడు నొక్క
ధర్మమునఁ గట్టువడియుండు ధారుణీశ !
ధర్మమార్గము తప్పిన దైవమేని
నాశమందక పోవఁడు నరవరేణ్య !

అడ్డగోలు సేయువాని నెల్లరును ఆక్షేపింతురు.

రాచమల్లుని రాయబారాన నీకు
మేలెకాని కీడేలేదు మేదినీంద్ర!
ఏల మాచేత నింత చెప్పించుకొనెదు ?
వారి చేరెఁడు నేలను వారికిమ్ము !

**నరసింహరాజు**: (క్రోధోద్రేకముతో) తనువును నలగామ ప్రభులకు, మనసును మలిదేవునకు నర్పించియున్న కపట చిత్తులు, అవకాశవాదులు నున్నారు. సమయానుకూల రాజ భక్తులు దేశద్రోహులు కొందరిటనున్నారు.

**నాయకురాలు**: పొరుగు పచ్చన కోర్వలేక కనుల నిప్పులు వోసికొను సాదు పలవలు, తిన్న యింటి వాసములు లెక్కించు నట్టింటి పగవాండ్రు కొందరిటనున్నారు.

**అలరాజు**: మామా! ఘోర దుస్సమయ మేతెంచినది. సమర జ్వాలల నిర్దయోన్మత్త తాండవము సర్వమును దగ్ధమొనర్చును.

ఇంతకు దాయభాగ మిడవేని, దురంబగునేని, దేశమం
దెంత జనక్షయంబగునొ? ఎంత దరిద్రత తాండవించునో
సుంత తలంపుమా! నృపతి సూనృత మార్గముఁదప్పి లోభియై
యింతలు జేసినాఁడని మహిన్ జెడు కీరితిఁగట్టుకొందువే ?

నిండుమనసుతో, జాలిగుండెతో వ్యవహరిపుమని నిన్ను నే నభ్యర్థించుచున్నాను. నిరపరాధుల కష్ట నష్టములతో స్వసుఖ లాభముల సాధింప యత్నింపకుము.

దేవుని వంటివాఁడు మలిదేవ మహాధిపుఁడట్టి పూజ్యుఁడీ
భూవలయంబు నందొకఁడు పుట్టునె? అన్నవు నీవటంచు భ
క్త్యావృత చిత్తమున్ గలిగి నంతటితమ్ముఁడు సుమ్ము! వానిపై
నీవు కుతంత్రమున్ దలఁతువే నది దారుణ దారుణంబగున్
అన్నియుఁ దెలిసియు నవివేకమునఁ బడుచున్నావు !
క్ష్మావలయంబు నందెవని శౌర్యము పూజలు చూఱగొన్నదో?
భూవరులెల్లరేఘనుని భూరి యశంబును గారవింతురో?

ఆ వివిధోన్నతాశయుని, ఆ మహనీయుని, బ్రహ్మానాయనిన్
కేవల మర్త్యుఁగాఁదలఁచి కీడొనరింతకుఁ బూనఁబోకుమా !

**నాయకురాలు**: అలరాజా! నీ గురుభక్తి ప్రశంస నీయమేకాని యీ భజన బ్రహ్మన్నగారి సమక్షమందే చేసిన ఫలిత ముండును.

**నరసింహరాజు**: (వికృత హాసమొనర్చి) అలరాజా! నీకీ కంఠశోష యేల? ప్రభువులు తమ నిశ్చయమును మహామంత్రిణీ ముఖమున స్పష్టీ కరించినారు కదా! చేఁతనైన సమర పాండిత్యమును జూపుఁడు, లేదేని –

**అలరాజు**: చినమామా! హింసా పాండిత్య మొక పాండిత్యమే కాదు. శత్రు సంహార నిబిడౌజులు మా పక్షమునఁ గూడ పరవళ్ళు త్రొక్కుచునే యున్నారు (నలగామునితో) మామా !

ఇరువు రింతకుఁ బోరఁగా మదినెంతురంచు నెఱుంగు దీ
యిఱుకులందిరి కెందరో మునుపెంతయో యిరువైపులం
పరువు పేరును, ఆయు వూడఁగఁ బడ్డ పాట్ల నెఱుంగు నీ
వొరుల పల్కుల నాలకించుచు నూరకుండుట సేమమే ?
మంచి చెడ్డలను నీకు నీవ విమర్శించుకొన వలయుఁ గాని
ఎవరో కూసెడు కూతలన్ వినుచు నీవే నమ్మి కూర్చున్నచో
నవనీ పాలన కార్యనిర్వహణ కన్యాయంబగున్! కావునన్
బవరంబే యొనరింప రమ్మనెదవో? భాగంబునే యిత్తువో
భవదంగీకృత మార్గమున్ దెలుపుమో పల్నాటి క్ష్మావల్లభా
మరియు వారి శౌర్య పరాక్రమములు నీకుఁ దెలియనివి కావు;
వారి వారిం గూర్చి నీ యెడ ప్రత్యేకముగా ప్రస్తావించుటేల?

**నరసింహరాజు**: (రోషముతో) అలరాజా! మలిదేవ పక్షపాతివైన నీవా మాకు మధ్యవర్తివి!

వారికి మాకుం గల పరి
వారం బరయంగ లేక వంది వలెన్ గై
వారింతువు! వారంతటి
వీరాగ్రణులైన నిట్లు వేడ్కొనుటేలా?

నీ పనికిమాలిన పగ్గెలకు మేము తగ్గెదమా? ప్రభువుల వారి పక్షమున మేమే వక్కాణించుచున్నాము.

ప్రళయ భీకరమై, భూనభ స్వరూప
పతన హేతువు నా ననివార్య శౌర్య
కాంతిపుంజ మస్మద్యోథ ఖడ్గచయము
కదలుచున్నది ! మీరింక కాచుకొనుఁడు!

(నాయకురాలు సుదీర్ఘ దరహాస మొనర్చును. నరసింహారాజు శ్మశ్రువులఁ ద్రిప్పుచు వికటాట్ట హాసమొనర్చును)

**అలరాజు**: (నలగామునితో) మామా! నీ యుద్దేశమదేనా ?

కలనికై మాకు చతురంగ బలములేల?
బాలుఁడొక్కండు చాలఁడే పార్థివేంద్ర ?
నీవు, నీ సేన, నీ కోట, నీ సమస్త
మొక్క యెత్తు! బాలుఁడొకఁడు నొక్కయెత్తు!

**నాయకురాలు**: దర్పము చూపిన దరిద్రము పోవునా ?

**నరసింహరాజు**: రాజ్యాలు పోయినను రాజసములు పోలేదు

**అలరాజు**: (కోపావేశముతో) చేటు కాలము దాపురించి మిట్టి పడుచున్నారు

నెయ్యపుఁ జేతినిఁ జాపఁగఁ
కయ్యమె మీకెంతో తియ్యగా మాఱెనయో !
చయ్యన నాజిన్ నుగ్గయి
యయ్యలపుడు నాగులేటి కరుగఁ దెలియులే !

(నలగామునితో) మామా నీకు స్తోత్ర పాఠము నచ్చినంతగా హిత వాక్యము నచ్చదను కొందును!

నాఁడు సంధికై సమ్మతింపక రణాంగ
ణమున దూఁకి యోడిన కురునాథు కన్న
ఘనుఁడవా? నీకు నాతని గతియె పట్టు
నపుడుఁగాని నా హిత వాక్కులరయ వీవు!

దుష్ట జన సాంగత్య ధూళి నీహృదయ నైర్మల్యమును గప్పివైచినది.
ఈ నాగమ్మను నమ్ముచు
నేనెంతగ మొత్తుకొన్న నీ వాఁగవు ! నీ
యీ నాగమ గీగమకును
మానాయని కెందుపోల్కి ? మామా! చెపుమా!
ఎన్నటికైనను నీకుఁ గను విప్పు కలుగునా ?
అబల బల్మినమ్మి, యీ జగజెట్టి పై
కయ్యమూని కత్తికట్టినావె ?
కుక్కతోఁకఁబట్టి గోదావరిని దాఁటఁ
దలఁతు వెంత జ్ఞానధనుఁడ వీవొ ?
(సభలోఁ గల కలము చెలరేగును)

**నరసింహరాజు**: (దృఢ గంభీర స్వరమున) సభలోని గుస గుసలు గొణ గొణలు, సకిలింపులు, యికిలింపులు, యిక యికలు, పక పకలు తగ్గవలయును. అలరాజా! గొంతు చించుకొని నీ వెంత గోండ్రిల్లినను నీ లేకి కూఁత లెవ్వరును లెక్క సేయరు,

**నాయకురాలు**: (లేచి పిడిచుట్టుఁగట్టి) అలరాజా! నీవాగ్విధానము సభ్యతా హీనముగా, సంస్కార శూన్యముగా నున్నది.

పలుకు పల్కిన వినువారిపైన విరుల
వానఁగురియించు నట్లుండ వలయుఁ గాని
ఊలు రువ్వునట్లొ, గునపాల తోడఁ
బొడుచునట్లొ యుండఁదగదో పూజనీయ !

నీవు వంకఁబెట్టినంత మాత్రమున నా వన్నె తఱుఁగదు కాని రాయబారించుటనిన నోరికి వచ్చినట్లు లొడారించుట కాదు.

వారి నాకసమున కెత్తి ప్రస్తుతింతు
వీవు! వారి చరిత్రల నెవ్వరెఱుఁగ
రిందు? నీ యూపులకు, బెదరింపులకును
గుండె చెదరు పిరికి పంద లుండరిందు !

అంత కన్న మహా మహా వారినే చూచినాను; యింత కన్న ఎచ్చులు పోయిన వారినే చూచినాను. అన్నియుఁగాఁచి వడపోసి యున్నాను.

పిల్ల పోటిగాని నొకనిఁ బెద్ద యోధుఁ
డనుచుఁ దప్పెట వాయింతు వంత ఘనుని
మార్కొనం జాలు వీరుఁడీ మంటిమీద
పుట్టనే లేదనెద వెంత బూటకమ్ము!

ఇఁక, భూనభోంతరాళమెల్ల ఘూర్ధిల్లునట్లు బ్రహ్మన్నగారి బాకా సూదుచున్నావు!

లోకమునకెల్ల తానే వెలుఁగును దెచ్చి
నట్లు, ప్రొద్దు తన మొగంబు నందెపొడిచి
నట్లు, తానే యుగ పురుషుఁడైన యట్లు
మిడిసి పడెడు బ్రహ్మన్నను మేమెఱుఁగమె ?

ఈ సింగినాదమునకే యింత యంత చేసి యిటఁ జెప్పఁ జూతువేల నాయనా!

ఈఁగ డేగకాదు; ఎలుక సింగము కాదు!
బాలుఁడొకఁడు పోటు బంటు కాఁడు!
నాయఁడొకఁడు వీర నాయకుండును గాఁడు !
కట్టి పెట్టు మిట్టి వట్టి నుడుల !

ఆ నిర్విష సర్ప వ్యర్థ ఫణా స్ఫాలనములకా మేము జలదరించుట!

పోరరారంట! వచ్చినఁ బొడుతురంట!
నవ్వరే యిట్టి గప్పాల కెవ్వరేని
వారు లేచిన మనుజులే కారటంచు
నెవరి వెఱపింపఁ జూతువీ మృషలు సెప్పి !

ఆ నిరస్త్ర దర్పితుల యశక్త హుంకారములకా మేముతారెత్తుట!

రాచమల్లుఁడా ! ఊరక రాలుగాయ
పలుకు లేలొకో నీ విట్లు దులపరింతు
వాజియున్నదా పైన జయాపజయము
లున్నవి మన బలాబలా లుగ్గడింప !

స్వర్గము నుండి దిగివచ్చినట్లు సవాళ్ళుచేసినావు ! నీవు వాగిన దానకెల్ల మేము నోట గడ్డకొట్టుకొని యుందు మనుకొంటివా?

**అలరాజు**: (క్రోధకంపిత స్వరమున) లజ్జాహీన దురహంకారిణి
దుశ్చారిణీ! చాలింపుమిఁక నీకుటిల వాచాలత్వము.
వారు వీరని చీల్చి. వైరమ్ములను బెంచి
వారినిఁ గానకుఁ బంపినావు!
వారి వారనియెంచి వైష్ణవ భక్తులఁ
జంపు కొఱకు సేన నంపినావు!
వారి పసులపైకి చోర వాహినిఁ ద్రోలి
హింసింపుఁడని ప్రోత్సహించినావు!
వారు వీరునుగాదు, పాలింతు నేనని
పలనాటి గద్దెపైఁ గులికినావు!
దేశ జాతకమందు మహా శనిగ్ర
హమ్మవై పట్టినావు ! పాపాత్మురాల!
హృదయ శూన్య చరితురాల! అధమురాల
నాగదంష్ట్రా సదృశురాల! నాయకురాల!

(కుపితుఁడై కౌక్షేయకమును నాయకురాలిపైకి విసరును; ఆమె తప్పుకొనును. పోతరాజు కత్తిదూసి ముందుకు దూకును. విచ్చుకత్తితో కన్నమదాసు విజృంభించును)

**నలగామరాజు**: ఏమిది ? చాలింపుఁడిఁక యనుచితోద్రేకముల!

**అలరాజు**: కన్నమా! శాంతింపుము. (కొలువు కలయఁజూచి)
సత్యపథంబునం జనుఁడు, శాంతి విధంబును గాంచుడంచు నే
దౌత్యముఁ జేయ వచ్చితిని! ధర్మవిహీన విరోధి వర్గముల్
నిత్యవిశుద్ధ భావమును, నెయ్యపుఁగల్మి నెఱుంగలేక యీ
పైత్యము నెత్తికెక్కిన అభాగ్యదురధ్వముఁ గాంతురక్కటా!

మామా! ధర్మమును బరిమార్చు వానిని ధర్మమే హతమార్పఁ గలదు. పోయివచ్చెద; సెలవొసంగుము. కన్నమా! రా! పోదము.

(అలరాజు, కన్నమదాసు నిష్క్రమింపనుండ —)

**నలగామరాజు**: (దీనస్వరమున) నాయనా! అలరాజా! రాజ మందిరమునకుఁ బోదము రమ్ము.

**అలరాజు**: మామా! మాకు రాజమందిరము లెందులకు?

**బ్రహ్మారెడ్డి**: నాయనా! అలరాజా! అట్లనకుము. ఇదంతయును నీదికాదా? రాక రాక వచ్చితివి. (ఆర్ద్ర స్వరమున) ఏడేండ్లుగా నీ యెడబాటు నేడు యుగములుగా గడపిన నీ హృదయేశ్వరి, సుకుమారి, పేరియాల రాజకుమారి కొఱకైనను రమ్ము నాయనా! నీవు వచ్చితివి! చూడుము. నేఁడు నీ యాగమనముచే గురజాల పురమెల్ల కళ్యాణ మంటపమువలె కళకళ లాడుచున్నది.

**అలరాజు**: (స్వగతము) ప్రియురాలా! పేరియాలా !

**నలగామరాజు**: అలరాజా! ప్రస్తుత రాజకీయాంశమును గూర్చి నేనేమియు నిప్పుడు చెప్పలేకున్నాను. నాకీ యొక్క దిన మవకాశ మొసంగుము; నా నిశ్చితార్థమేదియో సభా ముఖముననే రేపు నీకు నివేదింపఁగలను. రమ్ము! రాజమందిరమున కేగుదము, రమ్ము.

**అలరాజు**: మామా! నన్ను మన్నింపుము! రాజమందిరమున కేను వచ్చుట యటుండనిమ్ము; అందులకై నీవు నన్నిపుడు బలవంత పెట్టకుము. నేనెచ్చటకునుఁబోను ఇప్పుడు, నీ మాటమీద రేపు నేనిటకే కొలువు కూటమునకే వచ్చెదను.

(అందరును నిష్క్రమింతురు)

## తృతీయాంకము
## ప్రథమ రంగము
## (హజారము – గురజాల)

**బ్రహ్మారెడ్డి**: అలరాజు గట్టిమాటకాఁడు. నిండు కొలువున నాయకురాలి గాలి పోయినది.

**వీరారెడ్డి**:అలరాజు చక్కని మాటకారి. నాయకురాలి దురాగతముల మిక్కుటముగా నేకినాఁడు!

**బ్రహ్మారెడ్డి**: కానీ

పరుల గ్రసియింప సాఁకు సర్పమునకువలె
నీ మహాత్ముఁరాలికి స్థానమిచ్చినాఁడు!
తనకు వాటిల్లు ముప్పును దలఁపలేదు!
ఎంత మూర్ఖుఁడీ నలగామ నృపుఁడొ చూడు !

(నాయకురాలు పొంచి పొంచి ప్రవేశించు చుండును. ఆమె ననుసరించుచు పోతురాజుండును)

**నాయకురాలు**: (స్వగతము) ఎండు టాకుల మర్మర ధ్వనులవలె నెవ్వరిట గుబ్బిసలు పడుచున్నారు?

**వీరారెడ్డి**: (హీన స్వరముతో) అదిగో! ఎదుటివారి గుట్టులను వెదకు చూపులతో నిటే వచ్చుచున్నది!

**నాయకురాలు**: (సమీపించి, క్రోధ గర్భిత వ్యంగ్య స్వరమున) నమస్కారములు; పెద్దలకు! నిండు కొలువున మా కెల్లరకును నీతులు బోధించిన మహానేతలకు!

(బ్రహ్మారెడ్డి, వీరా రెడ్డి తడఁబడుచుందురు.)

**నాయకురాలు**: (పుత పుత లాడుచు) ముఖస్తుతి పరాయణులు!

మిథ్యావాదులు ! ద్రోహులు! వంచకులు!
వీరారెడ్డి: శాంతింపుము మహామంత్రిణీ!
బ్రహ్మారెడ్డి: కోపింపకుము మహామంత్రిణీ !

**నాయకురాలు**: ఈ మూతులు నాకు కూఁతలు నా కడఁ జెల్లవు ! (ధోరణి మార్చి) మీవంటి లోపాయికారుల నెప్పుడును నొక కంటఁగని పెట్టుచునే యుందును. ఎందులకైనను మంచిది; జాగరూకులై మెలఁగుడు. దయసేయుఁ డింక.

(బ్రహ్మారెడ్డి, వీరారెడ్డి నిష్క్రమింతురు.)

**నాయకురాలు**: పోతురాజా! నరసింహ ప్రభువును దోడ్కొని రమ్ము!

**పోతురాజు**: చిత్తము (నిష్క్రమించును)

**నాయకురాలు**: (స్వగతము) నా యుచ్ఛ్వాసమునఁ గాలకూట విషమున్నది! నేను దుర్భిక్షమును! నేను మహామారిని! నా క్రోధానల దృక్పాతమున మహా సామ్రాజ్యములే భస్మీపటలములగును. నా తీక్ష్ణ భ్రూక్షేపమున సూర్యచంద్రాది గోళ భ్రమణములే కట్టుపడును. అట్టినను ——

నను గోగాకునఁ బుర్వుకన్న కడు హీనంజేసి, పేరోలగం
బునఁగొమ్మన్న సుపుత్రుడిత్తెఱఁగునం దుమ్మెత్తునే? పూని యీ
తని పాడెం బిగదీయ కేను సుఖనిద్రం బోదునే? తోఁకఁద్రొ
క్కినఁ ద్రాఁచూరక పోవునే? పడగ పైకిన్ విప్పి కాటేయదే?

ఓరోరీ! అలరాజా! యిప్పు డెటకుఁ బోయెదవు ? నీ యడుగుల జిల్లేడు పాలు కొట్టెదను! నీ పుట్టెముక లేఱెదను; నీ రోగము కుదిర్చెదను! నీపుటమార్చెదను! నీ పేరు మాయ, నిన్నేమి చేసినను నాయుడు కాఱదు! నీవు కాకి చావు చచ్చినఁగాని నా కసి తీరదు.

(కవి ప్రవేశించును)

**కవి**: మహామంత్రిణీ ! నమస్కారము!

**నాయకురాలు**: కవీ! స్వాగతము!

**కవి**: మహామంత్రిణీ ! నా వినూత్న పద్యమును వినుఁడు.

హృదయ బాధయే యీర్ష్యకు ప్రథమ శిక్ష
స్వీయ పతనానుభవమె ద్వితీయ శిక్ష
చెఱకునం బుట్టి చెఱకునే చెఱచు వెన్ను
కెనఁగ వచ్చు ఈర్ష్య తగదు మనుజులార!

**నాయకురాలు**: చాలు, చాలింక పొమ్ము. నీ కవనము వినుటకు నాకు సమయము లేదు.

**కవి**: చిత్తము. (నిష్క్రమించును)

**నాయకురాలు**: (స్వగతము) అవును! అలరాజు నిష్ఠురోక్తులకు నేనేల మనసు చిముడఁబెట్టుకొనవలయును? సభలో నుద్రేకపడి నేను చాల పొరపడితిని కదా!

పలువురున్నచోట పగవాఁడెదురు నేని
తిట్టరాదు, వానిఁ గొట్టరాదు!
వాని జిమ్మఁదీసి, వాఁడు తిట్టునపుడు
శాంతమూని మనము సైఁప వలయు!

చూచువారికెల్లఁ దోఁచునతని తప్పు,
లోపముండదు మనలోన సుంత!
ఎవరు లేనిచోట నితరు లెఱుఁగ కుండ
పట్టవలయు నంత వాని పనిని !

అలరాజకృత పరిభవాగ్నిలో నాతను వెల్ల దగ్ధమైనది. ఇపుడు నా మనస్సు ప్రతీకార వాంఛా ఫూత్కారములతో సహస్ర ఫణముల విప్పుకొని యున్నది!

(నరసింహరాజు పోతురాజు ప్రవేశింతురు)

**నాయకురాలు**: (బాహువులు సారించి) స్వాగతము! నృసింహ ప్రభూ ! సుస్వాగతము!

**నరంసిహరాజు**: (విచారముతో) ఈ దినము మాకు గొప్ప దుర్దినము! అత్తెఱఁగున నీవు సభ యందవమానితవగుచుండ, గ్రుడ్లప్పగించియున్న అసమర్థులము మేము.

**నాయకురాలు**: (కృతజ్ఞతా స్ఫూర్తితో) నోటిమాట చాలదా? అన్న మంతయుఁబట్టి చూడవలయునా? నా యెడ మీకున్న అభిమానము నేనెఱుఁగనా? (వీరభద్రునిఁగను సన్నతో నిష్క్రమింపఁజేసి) మీతో

నేకాంత మాడుటకే మిమ్మిచటి కాహ్వానించితిని. (దీనముగ) నోటిలో మాట చెప్పుకొనుటకు మీకన్న నా కెవ్వరున్నారు ప్రభూ?

**నరసింహరాజు**: మహామంత్రిణీ! మా యెడ మీకున్నచనువు ఖిమానముచే మీ మా మర్మము లేకీ భావము నందగలవు! ఇఁకఁజెప్పుఁడు.

**నాయకురాలు**: (నిట్టూర్చి) ఏమున్నది నరసింహ ప్రభూ!

కొలువు నం దలరాజుతోఁ గొలుపునఁబడి
నారమీవు నేనేకాని నరవరుండు
తాను ముత్యమై యుండె! సత్య పరిశీల!
ఏది యేమైన నా ఉేనికేమి చెపుము ?

**నరసింహరాజు**: అలరాజు నెట్లయిన నాఁ కట్టుకొనవలెనని ప్రభువులు ప్రయత్నించిరి కాని, అది ఫలింపలేదు.

**నాయకురాలు**: అల్లుని మంచి తనమును నిరూపించినాడా అలరాజు! ఆరు రాజ్యాలను జయింపఁ గలము కాని యల్లుని జయింపగలమా? మింట బెట్టిన దీపమై రాచమల్లుఁడెన్ని చక్కట్లు దిద్దినాడో–

**నరసింహరాజు**: సుధర్మ సాదృశమైన మన సభారంగమునఁ గొమ్మన్న కొడుకట్లు గద్దటికాఁడై రేఁగి రజ్జులాడి నాఁడుకాని, వాని కూఁతలేరికి రుచించినవి?

**నాయకురాలు**: మోరెత్తి తాను దీసిన అంకె లెల్లరును వింటిరి కదా? చిమటను జీరేమిచేసె? చీడను జేనేమిచేసె? నేనేమంటిని? తానేమనెను. మోఱకునకు మొగలిపూవొసఁగి నట్లయినది! మామయందఁ జూచుకొని కదా, తానట్లాడినాఁడు! అంతకు మున్ను మీరెంత పెండెల కానఁబెట్టినను ఆ సిగ్గుకానఁడు.

**నరసింహరాజు**: కానీ, అల్లుఁడా రీతి నసభ్యముగా మిడిసిపడుచుండ ప్రభువులేమియు తమక కుండిరికదా, అదేనా బాధ.

**నాయకురాలు**: నృసింహ ప్రభూ! యిదెక్కడి విడ్డూరమో? చెల్లమ సూనుని ప్రల్లదములెల్ల వినుచు మొగము మాఁడ్చుకొని మన భూధవుఁడట్లు

మిన్నకుండెనే కాని నోరు మెదపఁడాయె. అందులకేకదా యాతని నిటకు నెక్కదోలి పంపినాఁడా బ్రహన్న. బ్రహ్మలోక పర్యంత మాలోచించినఁగాని మానవ మాత్రులకా నాయని లోతు తెలియదు.

తనజామాతృముఖంబుఁజూచియయినన్ ధాత్రీశుతత్త్వంబు మా
ఋనులెమ్మంచుఁ దలంచికాదెరణదూరుండైన బ్రహ్మన్న పం
పె నసాధ్యుండగు రాచమల్లు నిటకున్! పృథ్వీశుడీతండు తాన్
మనుజుండేకద! రేపు వీని మనమే మార్గమ్మునం బోవునో?

**నరసింహరాజు**: అవునవును! అల్లుని పలుకుబడిని మామకడ వినియోగించు కొనుట కాబ్రహ్మన్నపన్నిన పన్నుగడయే యిది.

**నాయకురాలు**: నృసింహ ప్రభూ! అన్నిఁటికన్నను నా మానసము నిపుడు దావానలమువలె దహించు విచార మొకటియున్నది.–

ఈ పల్నాటికి  రేపొమాపొ అలరాజే రాజు కానోపు ! ఈ
వై పావైపున కాప్తబంధు వతఁడై భాసింపఁడే? సంధియే
ద్వై పక్షంబుల మధ్యఁగూడిన నిదే తథ్యంబగున్ ధీనిధీ
నీపై తేనికిఁ గాటిపోవునది లేనేలేదు ముమ్మాటికిన్!

**నరసింహరాజు**: (ఆత్రముతో) మహామంత్రిణీ! అవాంఛనీయమైన ఆ పరిణామము ఘటింపకుండుటకు మనము సత్వరమే మేల్కొనవలయును.

**నాయకురాలు**: అందులకు పరిష్కారమార్గ మొక్కటే కలదు. చెప్పుదునా ప్రభూ?

**నరసింహరాజు**: చెప్పుము. మహామంత్రిణీ! చెప్పుము.

**నాయకురాలు**:అందుల కొక్కటే విఋగుడు!అదే అలరాజవధ!అదే అలరాజవధ!

(నరసింహరాజు నిశ్చేష్టుఁడై నిలచును. అతని హృదయమున ప్రచండ సంచలనము)

**నాయకురాలు**: (హీన గంభీర స్వరమున) కారెమపూడిలో తన తండ్రికట్టించిన పథికాశ్రయమున ఈశర్వరీవేళ అలరాజు విశ్రమించునని వేగుల మూలమునఁ దెలిసినది. (ధోరణి మార్చి) యథార్థము చెప్పుచున్నాను. ముండదైవమా నలగామునకుఁ బట్టము కట్టినది. కానీ పలనాటి సింహాసనము నీ వంటి మాననీయుని కొఱకెదురు చూచుచున్నది నృసింహ ప్రభూ!

> వైరి కంకాళ సోపానపంక్తు లధిగ
> మించి కాని సింహాసనం బెక్కఁదగదు!
> అందు తొలిమెట్టు దాఁటు మీ యర్ధరాత్రి
> సాహసంబు కాదొకొ సర్వ సాధకంబు !

ఇదెక్కడనుఁ బైకిఁ బొక్కరాదు. అంతయు మాఁటు మణఁగిన తరువాత పొందు. నరమానవునకుఁ దెలియకుండ. గుట్టు చప్పుడు కాకుండ పని పూర్తి సేయుఁడు.

**నరసింహరాజు**: (భగ్నహీనస్వరమున) మహామంత్రిణి!

**నాయకురాలు**: (ఆతురస్వరమున) ప్రభూ! ప్రభూ!

**నరసింహరాజు**: (ప్రాథేయ పూర్వకముగ) ఇందుల కెవ్వరినైన నియోగింతము; పోతురాజు....?

**నాయకురాలు**: అతని దోటి నోరు; గుట్టు దాగదు.

**నరసింహరాజు**: కేతరాజు ....?

**నాయకురాలు**:అతనిది మచ్చనాల్క:అంతయు వెల్లడియగును. వేఱొక రెవరైనను. తీఱ మునుము మీద తోఁక ముడుతురేని సర్వము నాఱు మూఁడగును. ఈ మహత్కార్యము నిర్వహింప,నా బుద్ధికి మీకన్న సమర్థులెవ్వరును గోచరించుట లేదు.

నరసింహరాజు: నా కది సాధ్యపడునా ?

**నాయకురాలు**: ఏ మది నరసింహ ప్రభూ ! ఇదేమైనను బ్రహ్మ ప్రళయమా? సంకల్పశక్తి కసాధ్యముండునా ?

ఆకసంబునంటు అచలరాజమునైన
ఎక్కఁగోరు నెడల ఎక్కవచ్చు !
దెసల దాఁటి పొంగు దీర్ఘాంబు నిధినైన
దాఁటఁగోరునెడల దాఁటవచ్చు !

(నరసింహరాజు సందిగ్ధమునఁబడి విచారించుచుండును)

**నాయకురాలు**: (స్వగతము) ఇపుడీ ప్రభువు నూరించి, యుబ్బించియైన అలరాజు హత్యోన్ముఖునిఁ జేసెదఁగాక! (ప్రకాశము) ఓ! అసహాయ శూరశిఖామణీ! అమానుష ధైర్యనిధీ! నీ నృసింహ నామమును సార్థక పఱచు కొనుము.

ఈ మాచెర్ల విభాగమొందునకె కాదీ సర్వ పల్నాటికిన్
భూమీ నాథునిఁజేతు నిన్ను! మరి నీవో, యీ నిశీథంబునన్
నీ మాటన్ నిలఁబెట్టు కొమ్మలునిఁ గూనీసేయు మాపైన నే
దే మైనన్ నినుగాచు భారమది నాదేపొమ్ము వీరాగ్రణీ!

ఇదిమీకు తలకుమించిన పనిమాత్రముకాదు. దీపశిఖ నార్పుట కెంత? క్షణము పట్టదు. అలరాజ పీడవిఱుగడగును, పలనాటి సింహ పీఠిపై మీకు నిలుకడ దొరకును. ఇంకను మీరు తటపటాయించుటేల ప్రభూ! లేక, అబలనైన నన్నే పూనుకొమ్మందురా?

**నరసింహరాజు**: (స్థిర నిశ్చయముతో) తర్జనీ సంకేత మాత్రమున సర్వమును శాసింపఁగల మహా నాయకురాలవు. నిన్ను గాదందునా?

తెంపొనరింపఁగాఁ దగిన ధీ బలముం గలవాఁడఁగాన, నీ
పంపొనరింతకున్ శిరము వంచితి నంతియెకాని రాజ్య మా
శింపను నాయకురాల! నరసింహుఁడు మున్ను హిరణ్యకశ్యపున్
జంపిన రీతిగా నలునిఁ జంపుదు! చూడుము నా ప్రతాపమున్

ఈలోన యమభటులే వచ్చి నన్ను నిరోధించినను వారితో ఘోరముగ పోరాడియైనను నేను నీ యాజ్ఞను నిర్వర్తింతును!

**నాయకురాలు**: (ప్రగాఢ హర్ష పులకితయై) చేవదూలమున వెదురుమ్రోఁత పుట్టునా? ఉదాత్తుడా! సాహసోపేతుఁడా! మహోన్నతుఁడా! నిరుపమానుఁడా! ప్రభూ! నీవు గొప్ప జాతకుఁడ వయ్యా! జన్మకొక శివరాత్రివలె నిట్టి యవకాశము లభించును; యీ యుద్యమమున నీవు సిద్ధి పొందెదవు.

(పోతురాజు ప్రవేశించును)

**పోతురాజు**: అమ్మా! ఈరోజు శివరాత్రి! రుద్రాలయమునఁ బూజలు సేయవలెనని పురోహితు లేతెంచి యున్నారు !

**నాయకురాలు**:అవునవును!నిక్కముగ నేఁడు శివరాత్రియే!జయజయ మహదేవ !

**నరసింహరాజు**: (గంభీర స్వరమున) జయ జయ మహాదేవ ఈ రాత్రి ఎటుచూచినను నాకు శివరాత్రియే మహామంత్రిణీ!

(వీరభద్రుఁడు తెల్లబోయి చూచును)

**నాయకురాలు**: (పుల్లముఖియై) ప్రభూ! ఈ దెబ్బతో బెమ్మనాయని యిరువది మూరల తలపాగా యూడిపోవలె! ఈరోజు శివరాత్రి ! శివరాత్రి(ముప్వరును నిష్క్రమింతురు)

## తృతీయాంకము
## ద్వితీయ రంగము
## (పాంథశాల – కారెమపూడి)

**నరసింహరాజు**: అహో! ఉన్నత శైలమాలవలె గాడాంధకారము: ఏమి సేయగలను నేను! కార్య సంఘట నేర్చు లేని వాఁడను.

శయనగతు నలరాజును జంపలేను

వట్టి చేతులతో దారిఁబట్టలేను!
హృదయ మిరువై పులకును దానొదుగుచుండ
దేహ మే వైపునకును దాఁ దిరుగ దకట !

చీఁకటిలోఁ గలసిపోయి నిద్రించుచున్న కన్నమదాసునకు నేను దగిలినంతనే, యాతఁ డెవ్వరనుచు లేవఁబోవ నాతఁడు తిరిగి నిదుర మంపున కొదుగునట్లు మచ్చుఁ జల్లితిని! ఆతఁడు నను గుర్తించె నేమో? ఛీ! తుచ్ఛ భయమును క్షుద్రసంశయమును నాకేల?

మున్ననేక యుద్ధములననేక శిరాలఁ
గోసినాఁడ నూఁచ కోత వోలె !
నేఁడు నిద్రితు నొకని నిరాయుధుని ధృతి
తోడఁ గెడపఁగ వెనుకాడు చుంటి!

ఛీ! క్షీణసంకల్పుఁడ! సంశయాత్ముఁడ! నే నేమి సేయగలను. నేనింక నిదానింపరాదు .... కానీ, అలరాజుపై నా యడిదము నెందుకో ప్రయోగింపలేకున్నాను! ఎందుల కేమున్నది?

తల్లిదండ్రుల కేకైక తనయుఁడు! మన
ఱేని యేకైక తనయకు ప్రియ విభుండు!
సుందరాంగుఁడు! సుమ సమశోభితాంత
రంగుఁడీతని సంహరింపంగఁ దగునె ?

అలరాజు నుక్కడింప వలదా? మఱి నిశాచరునివలె నేనేల యిటకు వచ్చితిని ఓ! నాయకురాల! నీమాటలు విన్నచో మానవుఁడు సులభముగా దానవుఁడగును గదా!

ఎంత కఠినాత్మురాలవే ? ఎంత కపట
నాటకాధ్వర్యురాలవే ? నాయకురాల !
నీ దురూహ కే నొక్కఁడనే క్రియాకృ
తి నిడు మందమతిని దక్కితినటె నీకు !

ఛీ! నే నెట్టి కృతఘ్నుఁడను! నా భాగ్యోదయము నా కాంక్షించుచున్న నాయకురాలినే నేను నిందించుచున్నాను. నా చిత్త మొక్కచోట స్థిరముగా నుండకున్నది మరల యిదేమి ?

ఏ దరిద్ర దేవత నన్నిప్పుడావ
రించి ''యీ ఘోర దుష్కృతి కీవె తగుదు
వోయి.! మూర్ఖాతి మూర్ఖుఁడా! చేయుమోయి
క్రూర సాహసం'' బని త్రోయు తీరుఁదలఁతు !

కటకటా! నాయం దిదేదో తీవ్రమైన, ఘోరమైన, భరింప రాని యలజడి! నా గుండె యిట్లు కొట్టుకొను టేల? ఓహో! విదితమైనది! విదితమైనది !

''నీ మనో నిర్ణీతంబిది నీచకృత్య
మందు కతన నీ దేహంబునందు నేను
నిలువలేకుంటి నెటకైనఁ దొలఁగిపోదు
నంచు నా హృదయము తొందరించుచుండె!

ఇతి కర్తవ్యతా మూఢుఁడనై నేనిటులెంత సేపని వితర్కించు కొనవలయు? (స్థిర నిశ్చయముతో) నేనిపుడు విఫలీ కృతయత్నుఁడఁగా రాదు. నాలో నేనిట్లు గుంజాటన పడరాదు.

నా కృపాణమా! నీకును నాకువలెనె
సందియంబేల? ఈ భయస్వాంతు హస్త
మందు నీవును భీగుణ మందినావె ?
స్థైర్యమూని చూపవె నిజశౌర్య పటిమ!

నేనిపుడు చేయ పచ్చినపని పూర్తిచేసెదఁ గాక! కనులు మూసికొని చేసెదఁగాక! వజ్ర సన్నిభ హృదయుఁడనై చేసెదఁ గాక ! కాదు ! కాదు! హృదయ శూన్యుఁడనై చేసెదఁగాక!

(నిష్క్రమించి. ప్రాంథశాల లోనికేగి.! ''చేయవచ్చిన పని పూర్తిచేసి,'' రక్తసిక్త హస్త కౌక్షేయకములతో తిరిగి ప్రవేశించి)

అయ్యో! దైవమా ! యిదేమి?
నా కరములందు, నా చరణంబులందు
నా మనమునందు, నా నరనరములందు
నా తనూసర్వమందు నెన్నఁడునులేని
నీరసంబిది యేలొకో చేరెనిపుడు!

నా పాణి తలమిదేమి? తడి తడిగా నున్నది! నెత్తురు! నెత్తురు అయ్యో! దైవమా ! యిదేమి ! కటకటా! యెటు చూచినను నెత్తురే !

కాలరాత్రంబు నాకు రక్తార్ణవంబు
వోలె గోచరించెడునిదియేలనేఁడు!
గగన తారకల్ నాకు రక్తవ్రణాల
వోలె గోచరించెడు నివియేల నేఁడు !

ఎటుచూచినను నెత్తురే! నింగిఁజూచినను, నేలఁజూచినను, దెసలఁజూచినను, నెటుఁజూచినను నెత్తురే!(కనులునులుముకొని) నా నేత్రములు చీఁకటి కలవాటు పడినవి; యిపుడన్నియు స్పష్టముగ గోచరించుచున్నవి! అంతయు నిశ్శబ్దముగ నున్నది! కాదు– కీఁచుఱాళ్ళరొద! అంతేకాదు–గూబ ఘూకరించు చున్నది! ఇంకను–ఏదో పామునోటఁ బడినకప్ప కూఁయివలెనున్నది! రాత్రులందిది భీకరరాత్రి! తెల్లవాఱు టెప్పటికో? ఇఁక నెంత తెల్లవాఱినను, ఎన్ని పుంజుల ఱచినను మేల్కొనఁడు కదా అలరాజు! నేను పోయెద;పోవుచు మార్గమధ్యమున–

రక్తసి క్తంబులై; భయప్రదములైన
నాకర కృపాణముల నింక నాగులేటి
నీరమందుఁ బ్రక్షాళింతునేని నాగు
లేరహో ! నెత్రు టేఱుగా మాఱునేమొ ? (నిష్క్రమించును)

## తృతీయాంకము
## తృతీయ రంగము
## (శుద్ధాంతము – గురజాల)

**పేరియాలదేవి**: (వ్యాకుల స్వరమున) కన్నమా! కన్నమా! మీ బావగా రెక్కడ? (రోదించుచు) చెప్పుము కన్నమా! చెప్పుము...

**కన్నమదాసు**: (కొలుకుల కన్నీళ్లు గోటఁ జిమ్మి) అయ్యో! తల్లీ!

హృదయములు ఛిద్రమొనరించు యీ విషాద
భరిత ఘోర వృత్తాంత మెబ్బంగి వెల్ల
డింతునే సోదరీ ! క్షమియింపు మమ్మ
తమ్ముఁడైన యీ కన్నమదాసు నిపుడు!

(పేరియాల దేవి విషాదభయ రయోత్కంపితయై మూర్ఛిల్లును)

**జ్ఞానాంబ, శీలాంబ**: అయ్యో! రాకుమారీ! (రాకుమారి పైఁబడి విలపించుచున్నారు)

(నాయకురాలు త్వరిత చరణములతో ప్రవేశించును)

**నాయకురాలు**: దుర్మార్గుఁడా! కృతఘ్నుఁడా! విశ్వాసఘాతుఁకుడా! అలరాజులుంగారి యాయువుల నూడఁబీకి యిటకు రా నీ ముఖమెట్లు చెల్లినదిరా? (పోతురాజు, భటులు ప్రవేశింతురు)

క్రూరకర్ముఁడితఁడె! నీచకులజుఁ డితఁడె!
బ్రహ్మనాయాధముఁడు చెప్పిపంపిన పని
సక్కఁబెట్టె! కాకిట్టి దుష్కార్య మెవ్వ
డాచరించు వాఁడు మన రాజ్యంబునందు?

**కన్నమదాను**: (కట్టుగ్రుఁడై, కనులెఱ్ఱజేసి, కఠోర స్వరమున) ఛీ! ఛీ!

ఛీ ! దురాత్మురాల ! చీల్చివైతునిఁక నీ
నాల్క! నీచకులము నాదికాదు!
దొరతనంబు ముసుగుతోడఁ గొంపలుఁదీయు
నీది నీ సములదె నీచ కులము !

మానవతా విరుద్ధమైన కుల ప్రసక్తిఁ దెచ్చి యీ ఘోరహత్యా పాతకమును నాకంటఁగట్టుచుంటివా పాపాత్మురాలా ?

చిట్టి గామాలపాటి యా నట్టడవిని
ఎవ్వరో కని పాఱవయిచిన నిన్ను
జేరఁదీసి పెంచె గృపాసింధుఁడొకఁడు!
ఇప్పుడు చెప్పుము నాకు నీదేకులంబొ?

**నాయకురాలు**: (అక్కసు పట్టలేక) ఓరీ! పచ్చిమాలా మదించి కూసెదవురా ? తాఁట నొలిపించి యరదండలు వేయింతును పోతురాజా, భటులారా, చూచుచున్నారేమి? కంటిలోన కలిమాయఁగావింపఁగలఁడు; శృంఖలింపుఁడీ గుండ గొయ్యను.

(వ్యాకుల వేగమున నలగామరాజు, బ్రహ్మరెడ్డి, నరసింహ రాజులు ప్రవేశింతురు)

**నలగామరాజు**: (బాష్పాకు లేక్షణుఁడై) తల్లీ ! పేరిందేవీ

**నాయకురాలు**: ప్రభూ! ఊరడిల్లుఁడు, మీ దుఃఖముచే హృదయములు ద్రవించిపోవుచున్నవి. (కొంగుతోఁ గన్నులు తుడుచుకొనును)

(కన్నమదాసు నరసింహరాజు నుఱిమిచూచును. నరసింహరాజు కన్నమదాసు నిరిమిరిమి చూచును)

**కన్నమదాసు**: (ఉగ్రస్వరమున) నాగమ్మా! ఇప్పుడే మీ యంతః కుటిలము నెల్ల పెల్లగించెద.

పువ్వువంటి మనసు వాఁడు ! నవ్వు మొగము
వాఁడు! నల్గురి మేల్గోరువాఁడు! చూడ
చక్కనగువాఁడు! నా బావ సచ్చరిత్రు
నిట్లు సేయువాఁడు నరుఁడే మృగము గాక !

ఆ మృగమెవ్వరోకాదు, ఎక్కడనో లేదు. ఇక్కడనే (వ్రేలితో నిర్దేశించి) వీఁడే యీ నరసింహరాజాధముఁడే ఆ నృశంసుఁడు. (నర సింహరాజు తత్తరబిత్తరలాడుచుండును)

క్రూరమృగములు ! వినపుఁ బురుగులు కంట
బడిన నంత వెంటాడి చంపఁగల మాన
వుఁడు స్వజాతియందున్న విషోరగముల
క్రూరజంతుల శిక్షింప నేరఁడేల ?

**నాయకురాలు**: (స్వగతము) కటకటా! అంతయు బెడిసికొట్టునా యేమి? (ప్రకాశము) ఓరీ! పుండాకోరా, కావించి చెప్పుదువా? ఈ తాలుఁగూఁతలకు నీ దౌడపండ్లు రాలఁ గొట్టెదను. ఏ మాలకూడుఁ గుడిచినను ఆ బ్రహ్మన్నకే చెల్లును. తానేమి యాసఁజూపెనో! నీ వేటికిఁ గుక్కుర్తిపడి యీ ఘోర కిరాత ఘాతుక కృత్యమొనర్చితివో రాక్షసుఁడా.

**కన్నమదాసు**: (క్రోధావేశమున) పాపిష్ఠురాలా! చాలింపు మిఁక నీ దురాలాపములు. ఈ క్రూరుఁడును, నీవును–మీరిరువురును జేరికై కుట్రపన్ని యొనర్చిన యీ విద్రోహ చర్యనుఁదగిన సాక్ష్యాధారములతో నిరూపింపఁగలను.

**నాయకురాలు**: నరసింహ ప్రభూ! ఏమిది! యీ కుక్కల కొడుకిట్లు పొగరెగదట్టి పెచ్చుటిల్లుచుండ ధర్మరాజువలె శాంతమూర్తివై యుందువా?

**నరసింహరాజు**: (వివృతాక్షుఁడై) ఓరీ! పరమ చండాలుఁడా మెడ నరము లుబ్బునట్లు పెడబొబ్బలు పెట్టుదువా? నాశమయ్యెదవు. ధ్వంస మయ్యెదవు. ఈ రెండు చేతులతో నీ గ్రుడ్లు రెండు నూడఁబెఱికి క్రింద బెట్టెదను.

**కన్నమదాసు**: ఓరీ! పొగరుఁబోతా! ప్రత్యుత్తర మీయ లేక దౌర్జన్యమునకు దిగుచుంటివా? చేసిననేర మెన్ని నిలువుల లోఁతున బాఁతి పూడ్చినను దాఁగదురా.

**నాయకురాలు**: నోరు నొక్కువారు లేరని యీ గౌదనుండి యా గౌదవఱకుఁ దెరచి బూకరించు చున్నాఁడు. వీని విషయమున శివ శివ యనరాదు.

**నరసింహరాజు**: ఒరీ! గాడిదా! అధిక ప్రసంగములతో డబాయింపకు మింక. అయ్యలారా!

చూడుఁడు! చూడుఁడీకుటిలశుంఠయొనర్చెడు దుష్ప్రచారమున్
జూడుఁడు! 'చిన్నమామ'యనుచున్ ననుబిల్చెడుమత్సుతాపతిన్
కాడునకంపువాఁడనె? జగంబిదినమ్మునె? నోరు మూయుమో
చాడిలకోర! నిన్నిపుడె చంపెద; త్రావెద నీదురక్తమున్.

(అని కన్నమదాసు పైకి దూఁకబోవు నరసింహరాజును పోతురాజు నివారించును)

**కన్నమదాసు**: (ఆగ్రహోదగ్రుఁడై) ఓరోరీ! హైహయా స్వయ కలంకా! నృసింహ హతకా.

రాత్రిం ఘాతుక చర్యకుం గడఁగి నిద్రాసక్త జీవంబు నే
మాత్రంబైనను గొంకఁబో కపహరింపన్ నేర్చినావోరి! యీ
ధాత్రీమాత భరింపలేదు నిను ధూర్తాత్మా! భవత్క్రూర దు
ష్పాత్రం బీ క్షణమందె యంతమగు నస్మత్ఖడ్గ ధారాహరిన్ !

(అని కత్తిదూసి ముందుకు దూకును)

**నరసింహరాజు**: క్రొవ్వి వాగెదవురా? గర్వాంధీ భూత పరిపంథీ! నిన్నేమి సేతునో చూడుము.

(నరసింహరాజు విచ్చుకత్తితో కన్నమదాసుమీది కుఱవడించును. వారిరువురు పరస్పరము కరవాలములఁ దాకించుకొని ద్వంద్వ యుద్ధము సాగింతురు.)

**బ్రహ్మరెడ్డి**: దిగ్భ్రాంతుఁడై) నాయనలారా! శాంతింపుడు యీ విషాద సమయముననా మీకీ యావేశ కావేషములు.

(బ్రహ్మరెడ్డి కన్నమదాసును, వీరభద్రుఁడు నరసింహరాజును గట్టిగాఁ బట్టుకొని విడఁదీయుదురు.)

**నాయకురాలు**: నరసింహప్రభూ ! యీ తుచ్ఛుఁ డాడిన చుచ్చుఱకుఁ బల్కులకు నీవేల నొచ్చుకొనవలయును ?

**కన్నమదాసు**: కులటా! ప్రేలకు మింక. స్త్రీత్వమును రాజకీయములందు సాధనముగా వాడి సఫలురాలవగుచున్నావు. ఈ బోడి పెత్తనము, కోడి కునుకు ఎన్నాళ్లు సాగునో చూచెదఁ గాక.

**నాయకురాలు**: చూచితిరా? చూచితిరా? మలిదేవునింట నెంగిళులు గతుకుచు బ్రతుకు యీ కింకరుఁడేమి మొఱుగుచున్నాఁడో? పోతురాజా! భటులారా! యింకను గ్రుడ్ల పక్షులవలె మిటకరించుచున్నారా? వీఁడు గ్రుడ్లు పొడుచువాఁడు గొంతులుఁ గోయువాఁడు. ఈ దున్నపోతును మట్టగించి మసి సేయుఁడు.

(పోతురాజు, భటులు కొంత చలింతురు)

**కన్నమదాసు**: (ఖడ్గమెత్తి) అడుగు ముందుఁబెట్టుఁడు ! ఏటు కొక్కని యమపురి కంపెద (నాయకురాలితో) సర్వనాళకారిణీ! నిర్దయ పాషాణీ! నాగసానీ!

అబలా జన్మమునెత్తి స్త్రీ సహజ చిత్తార్ద్ర స్వభావంబుఁ బా
సి బుసల్ గొట్టుచు ఘోరవైర విషమున్ జిందించి, యీరీతి సే
సి, బుకాయింతువె? నీవుకోరుననిలో జృంభించి మా సేన నీ
యుబలాటంబును దీర్చి చూపునిఁక నీ యూహాశ్మశానంబిటన్

**నాయకురాలు**: (అర్ధ స్వగతము) పొమ్ముర చచ్చినాఁడ, తక్కువ వానికి టెక్కెక్కువ. తవ్వెడు బియ్యానికి పొంగెక్కువ.

**కన్నమదాసు**: (నలగామరాజును దేఱిపాఱఁజూచి) ఓ! గురజాల పురాధీశ్వరా! యిపుడు కూతురి తల మాసినదని విషాదించు చుంటివా? ఇఁకనైన జాగృతుఁడ వగుము.

మాయల్ పన్ను దురాత్మురాలినొకతెన్ మంత్రిత్వమందుంచి, నీ
వీ యావద్ధర నేలఁగాఁదలఁచినావే బాంధవ ద్రోహివై ?
నీ యజ్ఞానము, నీ ప్రలోభగుణమున్, నీ ద్రోహదుర్బుద్ధియున్
నీ యల్పజ్ఞత నేఁటికిట్లు వికటించెన్ ధారుణీశాధమా!

**నాయకురాలు**: ఈ గుంటఁడిపుడు ప్రభువుల వారిని గూడ దూషించుచున్నాఁడు. శిక్ష కఠినముగా విధింపనిచో రాజదండము, రాజు శాసనము హాస్యాస్పదములగును.

**కన్నమదాసు**: లోక కంటకురాలా! పీడాకరమైన నీ దుస్వభావమునకుఁ దగిన ప్రతిఫల మనుభవించెదవు. తొందర పడకుము. (నరసింహరాజును జూపుచు) మీ యిరువురి కొఱకు బ్రహ్మదేవుఁడు ప్రత్యేక నరకమును సృజించును (భీకరాకారుఁడై తర్జించుచు)

పగసాధింపఁగ దూఁకి వత్తురిఁక మా వా రాజికిన్! నాగులే
ఱుగ రక్తంబిల పాఱఁజూడఁగలరో ద్రోహాత్ములారా! మహా
సుగుణాలంకృత ధీరచిత్తు నలరాజున్ ఘోర దుస్తంత్ర రీ
తిగ మీ పొట్టను బెట్టుకొంటి రిదికాదే మిత్తిమీ పాలికిన్!

**నాయకురాలు**: ఈ పౌరుషాలు నఱకిన వారి (జుట్టుఁజూపి) నిందఱఁజూచినాను.

**కన్నమదాసు**: (దోయిలొగ్గి శోక వివశ్యుడై, వినమ్రుఁడై) సోదరీ! పేరిందేవి!

ఎట్టి భోగభాగ్యంబులం దీవు బ్రతుకఁ
దగిన దానవో తల్లి! యీ పగిది నంతు
లేని వెతల పాలైతివే ? కూనతనము
నందె కన్నతల్లికి దూరమగుటె కాక !

రాచగీమునందు ప్రభవించి, యే సౌఖ్య
మనుభవించి తీవు వినుతశీల!
దుర్విధి యొనరించు తుంటరి చేతల
కెదురు సెప్పు వార లెవ్వరమ్మ!

రాచమల్లుఁడు నీవు పరస్పరాను
రాగ దాంపత్యమూనిరే రమణి! మిమ్ము
వేఱు సేసిన పసుల యీ ఘోరదురిత
మురకపోదు ! కొట్టదటె నీ యుసురు తల్లి ?

హృదిని పతి చరణంబులందెల్ల ప్రొద్దు –
లన్నిలుపు రాచమల్లు నిల్లాలి వీవు!
నిప్పువంటి శీలముగల నీకు, నీ ప
విత్ర సౌమ్య చరిత్రకివే జొహార్లు!
(అని మోకరిల్లి, ప్రణమిల్లి కన్నమదాసు నిష్క్రమించును)

**నాయకురాలు**: నూకలుండి బయటపడినావు ! పొమ్ము !

**నరసింహరాజు**: నెత్తురు కనులఁజూచి యుండెడివాఁడను! ప్రాణములు దక్కించుకొని తప్పించుకొని పోయినాఁడు!

**పోతురాజు**: పులినాకి విడుచునట్లు బ్రతికిపోయినాఁడు! కానీ ఏమి సోద్దెము! నీళ్ళు నిలుచునట్లు, రాళ్ళు కరుగునట్లు తెగఱంపటిల్లినాఁడు!

**నాయకురాలు**: (పోతురాజభటులతో) ఇంకను దిష్టిబొమ్మలవలె పిడుత మొగాలతో నిలుచున్నారేమి? పొండు! పొండు! మీ బండాలమెల్ల చట్టు బండలఁగలసినట్లున్నది, తగులఁబెట్టినట్లున్నది! పొండు! పొండు! పనిలేక మిమ్మూరక మేపుచున్నాము!

(ఇంతలో నున్నట్లుండి నలగామరాజు నిలువునఁ గూలిపోవును. అందఱును "ప్రభూ ! ప్రభూ!'' యనుచు నాతనిచుట్టు మూగెదరు)

## చతుర్థాంకము
## ప్రథమ రంగము
## (వనవాటి – వీరమేడపి)

**మలిదేవరాజు**: మహామాత్యా! ఈ వనభూమిని మాతృభూమిగా గణించుచున్నాను. ఇచ్చట నాకు పునర్జన్మ కలిగినది. ఇచట మనము దేవదేవుని నిజసృష్టి వైభవమును తిలకించి నేత్ర సాఫల్యమును బొందుచున్నాము!

తరువు తరువును జుట్టు లతా సరములు
ఛత్రగతినొప్పు భూరుహ పత్రరాజి
వన్నెకొక తావిఁజిమ్ము పుష్ప బహుళములు
స్వర్గసుధనైన నెదిరించు ఫలరసములు
కుహుకుహూ రాగముల్ దీయు కోకిలములు
విరులదోఁచి ఝుంకారించు భృంగములును
చెంగు చెంగునదూఁకు కురంగములును!
నిత్య నిర్మల నిర్ఝర నీరములును!
పరమ పావన మీ వనవాటి నరయ
భువిని నలరింప వెలసిన దివియె చూవె!
ఈ ఫలంబు లేవో తిని, యీ జలంబె
గ్రోలి, యీ తృణశయ్యల సోలిపోదు!
విస్మరింతును కష్టజీవితము నింక;
అనుభవింతు స్వేచ్ఛాయుతంబైన బ్రతుకు!
స్వార్థబుద్ధియు, ఈర్ష్యయు బలసియున్న
క్రూర మనుజ సమాజంబుఁ గోరనింక!
కాదు కాదు నేఁదప్పక పోదునటకె!
నిర్వహింపవలయు నా యనేక విధుల
ఆ మనుజలోక నరకంబునందె నేను
స్వర్గమును సృజింపఁ గృషిని సలుపవలయు !

మహామాత్యా! ఏమైనను మనవాంఛలొక రంగ మందుండనేదో యనిష్ట రంగమందు మన బ్రతుకులను మనము వెచ్చించునట్లు విధి మనల నియమించు తీరు నాకుఁ దోఁచుచున్నది.

బ్రహ్మనాయఁడు: మలిదేవా! నీవన్నది నిజమే దేశసేవకై పూనుకొనిన నేను రాజకీయ పంకమున దిగఁబడి పోయితిని, ఎంత కృత్రిమము! మరెంత నికృష్ట మీ రాజకీయ జీవితము!

మానవత్వమెల్ల మంటఁ గలియు దారిఁ
బాయలేఁడు రాజకీయ జీవి !
నీతిగొంతు పిసికి, భీతిలేక తిరుగు
మాయలాఁడు రాజకీయ జీవి !
కుటిల మతులతోడ, జటిల గతులతోడ
పదవికొఱ కొనర్చు ప్రాకులాట!
లోని తలఁపు వేఱు, పైని పలుకు వేఱు
చెప్పుటొకటియైన చేయుటొకటి!
నమ్మువారినైన నరకంబునకుఁ ద్రోయు
అవసరంబు వచ్చు నప్పు డపుడు !
ఎప్పుడెవ్వఁడెచట నేమి సేయునొ యని
మనసు కుదురు, కంటి కునుకు మాను!
పైకిపోవఁగోరి, పైకిపోక పడియు
పైకిపోవు పరునిఁ బడుటఁగోరు
అందునేని జుట్టు! అందకుండినఁ గాళ్ళు
పట్టుకొనుటలోన గట్టిపడును!
దేశ సేవ కొఱకు దీక్షఁబూనితినంచు
వట్టికూఁత లెన్నొ వాఁగుచుండు
కుక్కవోలె మ్రొక్కు, నక్కవోలె నడచు!
నవ్వియేడ్చు, యేడ్చి నవ్వునకట!

(కన్నమదాసు సమీపించు చుండును)

**మలిదేవరాజు**: మహామాత్యా! కన్నమదాసు మన కొఱకే వచ్చుచున్నాఁడను కొందును. అలరాజెట్లు రాయబారించెనో? కటకటా! ఏమిది? సదా మందహాసములఁ జిందు వీని వదన మిదేల నేఁడు విషాద వివర్ణమైయున్నది?

**బ్రహ్మనాయఁడు**: (స్వగతము) చెన్నకేశవా !

(కన్నమదాసు సమీపించి యవనత ముఖ్యుడై నిలచును)

**మలిదేవరాజు**: కన్నమా! గురజాల నుండి నీ వెపుడు వచ్చితివి? అలరాజేఁడీ?

(కన్నమదాసు శిరమెత్తి చూచి పెద్దపెట్టున విలపించును)

**బ్రహ్మనాయఁడు**: (స్వగతము) ధీరగుణ ధనుఁడైన కన్నమదాసు కన్నీరు మున్నీరుగా శోకించు చున్నాఁడు. నా వీనులే ఘోర దుర్వార్త వినవలసి యున్నవో? హా! అలరాజా ! ఛీ! హృదయమా! స్థైర్యమూని యుండుము, (ప్రకాశము) నాయనా! కన్నమా, మీ బావ?

**కన్నమదాసు**: (ప్రయత్నమున శోకమాఁపుకొని) తండ్రీ! యిఁక బావలేఁడు తండ్రీ!

**మలిదేవరాజు**: (నిర్ఘాంతపడి) కన్నమా! అలరాజు! ఏమైనది?

**కన్నమదాసు**: ప్రభూ! నరసింహరాజా ధముఁడలరాజుగారిని హత్య సేసినాఁడు!

(మలిదేవ బ్రహ్మన్నలు ఖిన్నులై నిర్విణ్ణులైపోదురు)

**బ్రాహ్మనాయఁడు**: (కంపిత స్వరమున) నాయనా! అలరాజా! నీ ధీరోదాత్త పాత్రము నిట్లు విషాదాంతముగా ముగించుకొంటివా? (ఎదురనున్నట్లు లక్ష్యించి) ఓరీ! నరాధమా! నరసింహా! విధాతృని సర్వోత్కృష్ట ప్రసాదమైన రాచమల్లుని ఘాతింప నీ చేతులెట్లాడినవిరా? నికృష్టుఁడా; తుదకిట్టి నీచత కొడంబడితివా? పలనాటి రాజవంశమున

కెట్టియ ప్రతిష్ఠం దెచ్చిపెట్టితివిరా? సుగుణ క్షీరాంబుధియైన అలుగురాజు కడుపున ఘోరకాకోల విషమువలె చెడఁబుట్టితివి కదరా!

**మలిదేవరాజు**: (బాష్పాకు లేక్షణుఁడై) అలరాజా! నీకు నేనెంతయు ఋణపడితిని, ఎన్ని జన్మలకైన నేనీ ఋణముఁ దీర్చుకొనగలనా ?

**బ్రహ్మనాయఁడు**: నాయనా! పలనాటి రాజకీయాకాశము నుండి యొక మహోజ్జ్వలతార రాలిపోయినది. ఈ బ్రహ్మనాయని కుడిభుజమే కూలిపోయినది.

(మలిదేవరాజు కన్నమదాసు లిరువురు పరస్పరము కౌగిలించుకొని విలపింతురు)

**బ్రహ్మనాయఁడు**: (ఇరువురి నక్కునఁజేర్చుకొని సమాశ్వాసించుచు) నాయనలారా! నాఁడు కోడిపోరునఁ జిట్టి మల్లునిఁ గోల్పోయితిని; నేఁడు రాయబారమున రాచమల్లునిఁ గోల్పోయితిని; రేపు సంగరంబుననిఁక నెందఱ మల్లులఁగోల్పోదునో? సర్వవిధముల మంద భాగ్యుఁడీ బ్రహ్మ నాయఁడే

పెంచి పెద్దఁజేసిన నన్ను విస్మరించి
నాగసానికిఁ దొత్తయ్యె నరసరాజు!
ఇంటి వెలుపలి దొంగతో హితముఁ గూర్చు
ఇంటి దొంగనొకనిఁ బెంచుకొంటి నకట!

నాయనా, కన్నమా, వీరమేడపికీ హృదయ విదారక సమాచారము చేరినది కదా.

**కన్నమదాసు**: (భగ్న స్వరమున) తండ్రీ! నేనేదియో చెప్పఁదలంచు చున్నాను కానీ చెప్పలేకున్నాను. గొంతు పెగిలి వచ్చుటలేదు, గుండె దిటవు చిక్కుటలేదు. కాళ్ళు తడఁబడుచున్నవి. స్వరము గద్గద మగుచున్నది. (కొంత తెప్పటిల్లి) తండ్రీ! ఈ దుఃఖవార్త విన్నంతనే——

తీవ్ర ఝంఝూనిల హతిచేఁదెస్సి, ధరణిఁ
జేరి జీరాడులతయయ్యె చెల్లమాంబ!
దారుణ కుఠార ఘూతాన ధాత్రిమీఁదఁ
గూలిపోవు భూరుహమయ్యె కొమ్మవిభుఁడు !

**బ్రహ్మనాయఁడు**: ఆ జననీ జనకుల పుత్ర శోకాశ్రు ప్రవాహము నేనే సాంత్వనోపాయ సేతువులన నరికట్టఁగలను? హో! చెన్నకేశవా !

**కన్నమదాసు**: తండ్రీ ! మరియునట్టి తఱి –

శోక వివశులై, తీవ్ర సంక్షుభిత హృదయు
లై, ప్రబల భయకంపితులై ప్రజాళి
సజల నయనముల్, దీన వేషములుఁదాల్చి
చేరి మూఁగిరి శాంతి కుటీరము కడ!

**బ్రహ్మనాయఁడు**: హో! చెన్నకేశవా! ఉత్తమ ప్రజా నాయకుఁడైన అలరాజు అస్తమించినాఁడు. ప్రజాజీవిత మందెట్టి రాజకీయ పరిణామము ఘటిల్లునో? నాయనలారా! గుండె కూడఁబెట్టుకొన వలసిన కరాళ కాలమిది! యిఁక నడువుఁడు, పోదము

(అందఱు నిష్క్రమింతురు)

## ద్వితీయ రంగము
## (శాంతికుటి వీరమేడపి)

**బ్రహ్మనాయఁడు**: బావా: కొమ్మరాజా ! కీడెంచి మేలెంచవలె

**కొమ్మరాజు**: (విషణ్ణాస్యముతో) హా ! పుత్రా! కుసుమ కోమల గాత్రా! నా ప్రాణాధిక ప్రాణమా!

**బ్రహ్మనాయఁడు**: బావా! కొమ్మరాజా! కీడెంచి మేలెంచవలెనందురు; మేలెంచితినే కాని కీడూహింపక అలరాజు నటకంపినాఁడ!

**కొమ్మరాజు**: (కౌగిలించుకొని) బ్రహ్మన్నా! బ్రహ్మన్నా! యీ భీకర క్లేశమును, యీ యగాధ ఖేదహాలా హలమును నేనెట్లు భరింపఁగలను?

**మలిదేవరాజు**: (వ్యాకుల స్వరమున) మామా ఒక్కగానొక్క బిడ్డనుఁజెమట నెత్తురుఁగాఁ జూచి పెంచుకొంటిరి! కులదీపకుండగు చెట్టంత కొడకు పోయి పుట్టెఁడు దిగులుతో నున్న మీకీ వృద్ధాప్యమున మనశ్శాంతి యెట్లుండును? (కన్నీరోడ్చుచు) అనంత శోకార్ణవమును నీ హృదయమున సృజింపనెంచి దుర్విధి యలరాజును బ్రతుకుఁదెరల కావలకు దీసికొని పోయినది!

(కొమ్మరాజు బిగ్గరగా విలపించును)

**బ్రహ్మనాయఁడు**: (స్వగతము) కన్నీటి వెల్లువలకు నేను కట్టలు వేయుచుండ మలిదేవుఁడు వానినిఁ దెగఁగొట్టు చున్నాఁడు! శోక పీడితుననునయించుట కెంత వ్యవహార పరిజ్ఞానము కావలయును! (ప్రకాశము) అలరాజు భగవంతుని నిష్కళంక సృష్టి! ప్రపంచ ప్రత్యేకాభరణము! ఆతఁడు భౌతికముగా మన సమక్షమున లేకున్నను మన యంతరంగముల సంతతము వెల్గుచునే యుండును.

(నేపథ్యము నుండి తూర్య నినాదములు)

**బ్రాహ్మనాయఁడు**: మలిదేవా? వింటివా? సైన్యలక్ష్మికి నీవు పూజలొనర్పవలయు! నీవు సత్వర మటకేగి యుండుము. నీవెనుక నేనిదే వచ్చెదను.

**మలిదేవరాజు**: (కనులుఁదుడుచుకొని) మామా! మీ కివేనా చరణాభివందనములు! (కొమ్మరాజ పాదములకు నమస్కరించును)

**కొమ్మరాజు**: (దుఃఖమును దిగమ్రింగి మలిదేవుని లేవ దీసి) నాయనా! మలిదేవా! అధర్మాక్రమములపై దండెత్తుచున్నావు. నీకు విజయమగుఁగాక !

(మలిదేవరాజు నిష్క్రమించును)

**బ్రహ్మనాయఁడు**: (పరిశీలించుచు) బావా! ఏమిది? ఒగుడాకువలె నున్నావు? ఆ వాడిన ముఖమేమి? ఆ గుంటలు వడిన కనులేమి? ఆ తేజో విహీనములైన చూపులేమి?

కొడుకు పోయిన దిగులుతోఁ గుమిలి కుమిలి
కూడు నీళ్ళను ముట్టవు కొంచెమేని!
లోని బాధను చాలించి మానవుండు
సక్రమంబ పోవలె దినచర్యలందు!

నీ వేయిట్లుండ యిఁక నా చెల్లెలి గతియేమి? ఇటుచూడు, బావా! మనసునకు శాంతిఁ దెచ్చుకొనుము,

**కొమ్మరాజు**: (శుష్కహాసమొనర్చి) నాకు శాంతియా?

అతులిత రాజ్య వైభవము లన్నియుఁబోయె! వనప్రవాసమా
వెతలమయంబెయయ్యె! మరి, బిడ్డఁడొకండునునిట్టులయ్యె! నా
బ్రతుకున నెందుఁజూచినను బాధలె కన్పడుచుండ, శాంతి నా
మతి కెటుకల్గునో తెలుపుమా! సచివోత్తమ! ధర్మవిత్తమా!

కనుచూపు మేర నెటుఁజూచినను నైరాశ్య గాఢాంధ కారమే యావరించి యున్నది.

**బ్రహ్మనాయఁడు**: బావా! మరణమని వార్యమైనది. అనుల్లంఘనీయమైన ఆ సహజస్థితికి ముందు వెన్కలుఁగా నెల్లరకును బోకతప్పదు. ఈ మట్టికుండ లన్నియు నెప్పుడో పగిలిపోవును; లోని జీవనమలతయు నెప్పుడో నేలపాలై పోవును. ప్రాజ్ఞులు పరలోక గతులకై ఖేదపడరు.

**కొమ్మరాజు**: బ్రహ్మన్నా! అశాంత జీవితమందీ క్షణ క్షణ మరణమున కన్న ప్రశాంతముగా నొకేసారి మరణించుట మేలు కదా.

**బ్రహ్మనాయఁడు**: బావా! మాతృ గర్భము నుండి ప్రకృతిమాత యొడిలోఁబడి నంతనే ప్రతి జీవుఁడునుఁ గెవ్వు కెవ్వునఁ గక్కటిల్లుచు జీవితమొక దుఃఖయాత్రయని సూచించుచున్నాఁడు. ఈ ప్రాణికోటి యందెవరి జీవితములు సుఖమయములో చెప్పుము! ఎవరి దుఃఖములు వారికున్నవి.

శాంతి గర్భమున నశాంతియే బ్రతుకు!
శాంతి వెలుపల నశాంతియే బ్రతుకు!
బ్రతుకు నిరంతర రణమంచు నెంచి
ప్రతిమానవుఁడు యోధవరుఁడు కావలయు!

జీవిత రంగానస్థిర వీరుఁడెవఁడొ
జీవిత సమర విజేతయు నతఁడె !
బ్రతుకెన్నఁడును చావువలె నుండఁదగదు
బ్రతుకున్న వఱకును బ్రతుకంగ వలయు !

ఆశతోడనె ప్రాఁకులాడంగఁ దగును
ఆశయే మనుగడ కాయువై తనరు !
గతము చేసెడి బోధ గమనింపలేక
గతము నరయుచు దుఃఖమునుపడఁగనేల?

భావిజీవనశోభ భావింపలేక
భావిజీవితమెంచి భయమందు టేల?
ఆలోచనా మతియైన విజ్ఞాని
కీ లోక బంధనమే విలాసఖని!

ఆవేదనా హృదియైన అజ్ఞాని
కీ విశ్వ సౌందర్యమే విషాద వని!
శకల భాండములోన జలము నిలువదు;
వికల చిత్తమున జీవితము నిలువదు!

బావా! అలరాజు నీ తనయుఁడు కాఁడు! అతఁడొక మాయబొమ్మ!

**కొమ్మరాజు**: (వికాసముతో) అవును! వాఁడు మాయబొమ్మయే !
అవును! వాఁడు మాయ బొమ్మయే !

(బాలచంద్రుఁడు కన్నమదాసు ప్రవేశింతురు)

**బాలచంద్రుఁడు**: (వీరావేశముతో) అన్నా! కన్నమా! సప్తవత్సర ప్రవాసకాలమున మూలఁబడిన నా కరవాలము నేఁడు సానదేరి తలతలల మెఱయుచు, శాంతియను అంధకారమున కావలనున్న నా పౌరుషమునకుఁ గాంతి పథమును నిర్మించినది! గాలిలో రెపరెపలాడు పతాకమట్లు రణభూమి కెపుడు పోదునాయని నా హృదయము తహతహ లాడుచున్నది. (కొమ్మరాజును సమీపించి) ఈ తీవ్రవేదన, యీ దారుణజ్వాల, ప్రగాఢ హృదయ తాపము తీరుటెట్లు? కత్తిదూసి మింటికెత్తి

ఛేదింతున్ సమరోర్విలో నరసరాట్మీర్షమ్ము! తద్వ్యూహమున్
భేదింతున్! భయదోగ్ర భంగి రిపులన్ వేధింతు! నాగమ్మలే
కాదా దేవత లడ్డుపెట్టినను ఆగంబోక మచ్చౌర్య రా
శీ దీప్తుల్ ప్రసరింప నీ శపథమున్ జెల్లింతుఁ గొమ్మాధిపా

**కన్నమదాసు**: (స్వగతము) అహో! కొమ్మన మామా! ఈ తీవ్ర సంక్షోభమందును గంభీరముగా నేదో మహాసాగరమువలె నున్నావు!ఎంతటి మహానుభావుఁడవో నీవు!

(బాలచంద్ర, కన్నమదాసు లిర్వురునుఁ గొమ్మరాట్పాదములకు నమస్కరించి కొమ్మ రాజాశీర్వాదములంది నిష్క్రమింతురు)

**బ్రహ్మనాయఁడు**: బావా ! నాకును సెలవొసంగుము.

(ఇరువురు కౌగిలించుకొందురు. కొమ్మరాజు శాంతికుటీరాభిముఖుఁడై నిష్క్రమించును. ఇంతలో మలిదేవరాజు ప్రవేశించును)

**బ్రహ్మనాయఁడు**: (శంకా సంక్షోభితాత్ముఁడై ) రాజా! ఏమిది? వెనుదిరిగి వచ్చినావు?

**మలిదేవరాజు**: (దీనముగ) మహామాత్యా! మామవెళ్ళిపోయెనా?

**బ్రహ్మనాయఁడు**: ( హీనస్వరమున ) అవును, మలిదేవా!

ఎదబెదురుచునుండ, పెదవులదరుచుండ,
కను కొలుఁకుల జలము కలఁగుచుండ,
దైన్య మాస్యమందుఁ దలఁకుచుండఁగ బావ
అడుగులోన నడుగు నిడుచు నేగె|

**మలిదేవరాజు**: (కన్నీళ్ళతో) మహామాత్యా! ఏలొకో నాయెడఁద మరల మామను జూడవలెనని, కౌగిలించి కన్నీరుఁ గార్చవలెనని యారాట పడుచున్నది.

**బ్రహ్మనాయఁడు**: (నివారించుచు) వలదు. రాజా! వలదు. ప్రస్తుతము పౌరుషోత్తేజముతో నుండవలసిన నీవు విషాదభావమున నుండ దగదు.

**మలిదేవరాజు**: (శంకాపీడితుడై) మహామాత్యా! నా యశ్రు పాతమిది యశుభ సూచకము కాదు కదా.

**బ్రహ్మనాయఁడు**: రాజా! లేనిపోని శంకలతో నీవు బాధపడకుము; నన్ను బాధింపకుము; ''సాహసే లక్ష్మి'' యందురు కదా! ఆజిలో నన్యాయము పైనను, అక్రమముపైనను పగతీర్చుకొనఁబోవుచున్న వీరవరుఁడవు! కలిగిన కష్టముల కాలికొనగోటితోఁ దన్నిన ధీర హృదయుఁడవు! అలుగు మహీపతికి ననుఁగు బిడ్డఁడవు! ఈ బ్రహ్మనాయని యుత్తమోత్తమ శిష్యుఁడవు!

**మలిదేవరాజు**: (ఉత్తేజితుఁడై) అవును. గురుదేవా ! అవును.

(మలిదేవరాజు మోఁకరించి, బ్రహ్మనాయని చరణములఁ గన్నుల కద్దుకొనును. నేపథ్యమున తూర్య నినాదప్రస్థాన భేరీ ధ్వానములు చెలరేగును.)

## తృతీయ రంగము
## (శుద్ధాంతము – గురజాల)

**నాయకురాలు**: (స్వగతము) ఏఁడీ? యీా నరసింహరాజు యింకను రాకున్నాఁడు? (అలికిడి విని) నరసింహ ప్రభూ! రారమ్ము! నీ కొఱకె నిరీక్షించుచున్నాను.

(అమాంత ముప్పెనవలె నలగామరాజు తీవ్ర భీకర దృక్కులతో, క్రోధ కంపిత దేహముతో ప్రవేశించును)

**నలగామరాజు**: వచ్చుచున్నాను. వచ్చుచున్నాను. ఎలుగెత్తి పిలువుము, కామాంధుఁడై నీ మాయా బంధమునఁ బడి కన్ను మిన్నెఱుఁగక పొర్లాడు నీ ఱంకు మగనిఁబిలువుము, ఏఁడీ? ఆ ద్రోహి! ఆకృతఘ్నుఁడు! ఆ నరరూప రాక్షసుఁడు! ఆభ్రాతృమర్మ ఘాతుకుఁడు ఆ నరరూప రాక్షసుఁడు! ఎక్కడ? ఎక్కడ?

**నాయకురాలు**:(స్వగతము)ఈ మహనీయుఁడేదో గిలివెట్టుకొని కనకన లాడించు చున్నాఁడు! సోదెకుఁ బోవఱంకు వెల్లడైనట్లు నా నెత్తి మీఁది కిదేదో కుమ్ముకవచ్చి పడినది. (ప్రకాశము) ప్రభూ! ఏ చెప్పుడు కూఁతలకో చెవి యొగ్గి మీరు నన్నునుమానించు చున్నారా?

**నలగామరాజు**: ఛీ! ధూర్తులారా! అలరాజు నెందులకు సంహరించితిరి? మీచేతు లెట్లాడినవి?

**నాయకురాలు**: (స్వగతము) గొంతు కత్తెరవలె నా ప్రాణముల మీఁదికిది వచ్చిపడినది. (ప్రకాశము) ప్రభూ ప్రభూ! తన హత్యాదోషమును మా పైకి నెట్టి బ్రహ్మన్న చేయుచున్న దుష్ప్రచారమును మీరును విశ్వసించుచున్నారా?

**నలగామరాజు**: ఛీ! కులటా, కట్టిపెట్టు మిఁక నీ కపట నాటకముల, ఎట్టి వివేక హీన దుర్మార్గుఁడేని శత్రువుపై నేరము మోపుటకు స్వహస్తమునే ఖండించుకొనునా?

**నాయకురాలు**: (స్వగతము) కటకటా! వ్యవహారమెల్ల తారా్మా అగుచున్నదే? డొంకల కంటెను రాచబాటయే కంటక మయముగానున్నదే?

**నలగామరాజు**: (కన్నీరోడ్చుచు) నిను నమ్మి పితృ సముఁడైన బ్రహ్మనాయనికి దూరమైతిని; అమృత భాండమును ద్రోసి, విషకలశమూనిన మందమతిని.

**నాయకురాలు**: (కృతక విలాపముతో) ప్రభూ! ఆస్థులఱుగునట్లు చీము నెత్తురు ధారవోసి పలనాటి కోటీరమునకేను చేసిన సేవలేమైనవి? తుదకిట్లు వెగటైతినా?

**నలగామరాజు**: నా చిత్తమును విషతిక్త మొనర్చితివి. నాయందు దురాశపరుని. దురాక్రమణ దారునిఁబెంచితివి. తుదకునన్ను దుర్భర విషాదార్ణవ మధ్యమున ముంచితివి. ఇవేనా నీ సేనలు? క్షుద్రకీటకమా ! ప్రాణములతో నిన్ను విడువను.

(నలగామరాజు కత్తి దూయును. నాయకురాలు భయవిహ్వలయై యాక్రందించును. ''ప్రభూ! ప్రభూ!'' యనుచు చాటున దాగియున్న పోతురాజు ప్రవేశించి ప్రభువును నివారించును. నలగామరాజు తీవ్రోచ్ఛ్వాస నిశ్వాసములతో నిశితాక్షుఁడై చూచుచు నిలచియుండును)

**నాయకురాలు**: (మోఁకటించి, అంజలి ఘటించి) హా! ప్రభూ!

అనల కణముల చందాన కనులు కోప
పుం సెగలఁజిమ్ముచుండ ప్రభూ! యిదేల?
తీక్ష్ణ వీక్షణాశుగము లీ దీనురాలి
పైఁ బఱపు చుంటిరో కృపాభరిత హృదయ !

**నలగామరాజు**: (ప్రశాంతుఁడై. నిశ్వసించి కత్తి నొఱలోనికిఁద్రోసి) మహామంత్రిణీ! త్వరపడితిని....పొరపడితిని, దుర్భర దుఃఖభారమున మతిఁదప్పి వర్తించితిని, మహామంత్రిణీ! హా! మహామంత్రిణీ!

**నాయకురాలు**: (లేచి నిలచి) ప్రభూ! ప్రభూ !

**నలగామరాజు**: (శూన్య దృక్కులు నిగిర్చి) అటు చూడుము, మహామంత్రిణీ! అటు చూడుము.

రాత్రి దద్దఱిల్ల, దశదిశలొక్కటై
పిక్కటిల్ల, విలయవేళవచ్చె!
సంగరోర్విలోన సామంతరాగోలఁ
దాల్చి బ్రహ్మ మంత్రి తాండవించు!

**నాయకురాలు**: ప్రభూ ! పోతురాజు, కేతరాజు, భేతరాజు, చింతపల్లిరెడ్డి, మాడుగుల రెడ్డి, మొదలుగా గల సమర కళాధురంధరులిందఱు కోల్తల సేయఁగల వారుండ మనకేమికొదవ? అదియుఁగాక మేక పోతుగాంభీర్యమువలె ముఖభీకరమే కాని యిపుడెందులకును గొఱకాని వృద్ధ బ్రహ్మనాయఁడన్న మీకీ వెఱపేల? పోతురాజా ! పోతురాజా!

**పోతురాజు**: అమ్మా ! అమ్మా!

**నాయకురాలు**: దేశము నలుమూలల కోవురమును గట్టుదిట్టము గావింపుము. గురజాల పురికి మొగసాలయైన కారెమపూడికి నీవు సత్వరమే పోయి యచటి రక్షణ చర్యల నెల్ల స్వయముగా వీక్షించి రమ్ము. ఎంత శీఘ్రముగా నీవుపోయి వచ్చిన సంతమంచిది.

**పోతురాజు**: అమ్మా ! చిటికలో నటకుబోయి తెప్పపాటులో నిటకు వచ్చి వ్రాలెదను.

**నలగామరాజు**: (నిస్తేజుఁడై) మహామంత్రిణీ! అసహాయ శూరుఁడును, జగదేక వీరుఁడునునైన బ్రహ్మనాయని సామర్థ్యము నీ వెఱుఁగవు, ఈ బ్రహ్మాండమెల్ల నిండి యున్నట్లా మహాపురుషుఁడు నాకగుపించుచున్నాఁడు.(నీరసించి మూర్ఛిల్లును)

**నాయకురాలు**: (విహ్వల స్వరమున) అయ్యో, ప్రభూ! ప్రభూ!.. పోతురాజా! ప్రభువుల నిపుడు రాజమందిరమున విశ్రమింపఁ జేయ వలయును.

(పోతురాజు కరతాళ ధ్వనులొనర్చి పెద్దగా నొక కేకవేయును కొందఱు భటులు ప్రవేశింతురు. అందఱును గలిసి నలగామ రాజును

లేవఁదీసికొని పోదురు; నాయకురాలు వారి ననుసరించును. వారొక దెసగా నిష్క్రమించిన కొంత తడవునకు వేఱొక దెసనుండి నరసింహరాజు ప్రవేశించును)

**నరసింహరాజు**: (స్వగతము) ఏదీ? ఆమె,

నన్ను రమ్మని పిలచిన వన్నెలాఁడి!

మదిని దోచుక పోయిన మాయలాఁడి !

ఆడిన మాట తూచా తప్పకుండ వచ్చి యుండెడిదే; కానీ, యెందుల కింకను రాకున్నది? మా యెడబాఁటు నాకేదో లాగుననున్నది.

ఓ ! జగన్మోహినీ ! ఓ ! నాగసాని !
ఓ! నిత్యయౌవనీ! ఓ! నాగసాని !
ఓ ప్రియ! ఓహో! నాయకురాల !
ఓ ! జవరాల ! ఓహో! నాయకురాల!

రమ్ము; నాయురాలా త్వరగా రమ్ము, ఏమియు లేకున్నను మనకేదో సంబంధ మున్నదని లోకము భావించుచున్నది. (కొంత విచారముతో) నేనా యెలనాగను గామించుచున్నాను. కానీ, యెంతకును నామె మనోగతమే నాకు విదితముఁగా కున్నది. చౌడునఁజల్లిన విత్తులవలె నామె యెడనేఁ జేసిన యత్నములెల్ల విఫలములగునా?

నన్ను బాధించు పుష్ప బాణాలు నిన్ను
గూడ బాధించునా యని కోమలాంగి
నడుగలేను ! యథార్థంబు నరసికొనఁగ
కంటఁబడదేల కొంటె పూవింటివాఁడు?
ఐనను, నాకా సంశయ మెందులకు ?
అర్ధరాత్రి నిద్రితుఁడైన అలునిఁజంపి,
ఆమె కోర్కిని నెఱవేర్చినాము మేము !
మా పరాక్రమంబుఁ దలంచి మాత్రమైన
చంచలాక్షి మమ్మేల ప్రేమించకుండు ?

ఇది తేల్చుకొనుటకే గతరాత్రి నేనామె సౌధమునకేగి గవాక్షము నుండి శయ్యా మందిరములోనికి వీక్షింతును గదా.

ప్రళయ తాండవ రుద్రుని గళము నుండి
జారి ధరణిఁబడిన నాగహార మనఁగ –
పాము కూసముల్ వోలు వల్వలు ధరించి
మించు బోఁడి పాన్పునఁ బవ్వళించియుండె!

అపుడా భీకర సౌందర్యావ లోకమును నాకనులు తట్టుకొన లేకపోయినవి. వచ్చిన దారినే తిరిగి పోయితిని కానీ, ఆహా, ఏమి యామె సోయగము. రేయెల్ల స్వప్నము నందా యిందు వదనయే కాదా, (ఆవులించి, యొడలు విలుచుకొని) రాత్రి నిదురలేమిచే నా యొడలిపు డిరువురు పట్టుకొని నల్వురు కొట్టుచున్నట్లున్నది. (కామ వికారముతో) నా యుల్లమును గొల్లగొట్టితివి కదవే నాయురాలా. (అలికిడి విని) ఓహో, ఆ లావణ్యవతియే యే తెంచుచున్నది.

(కవి ప్రవేశించును)

**నరసింహరాజు**: (స్వగతము) ఛీ, వీఁడా ?

**కవి**: ప్రభువులకు నమస్కరించుచున్నాను (నమస్కరించును)

**నరసింహరాజు**: నీవి నీకే యర్పించుచున్నాను.

**కవి**: ప్రభూ, నా నూత్న కవిత్వ మాలింతురా ?

**నరసింహరాజు**: కవుల కిదియొక పిచ్చి! ఊఁ కానిమ్ము.

**కవి**: వినుఁడు, ప్రభూ. వినుఁడు.

ఆసవలనఁగాని, ఈసువలనఁగాని
మానవుండు హంతయౌను కాదె?
ఆస, యీసు —— రెంటి నావలఁబెట్టిన
మానవుండు దేవుఁడౌను కాదె!

**నరసింహరాజు**: (స్వగతము) వీఁడు నన్ను గూర్చియే కైతఁగట్టి నాఁడా? (ప్రకాశము) ఓయీ ! నీకొక కవనమేనా ? యితర విద్య లేవేని యున్నవా?

**కవి**: ప్రభూ! చిత్రలేఖన మభ్యసించితిని. అఱచేతులందు గీతల రూపమున నుండు జాతక భాషనుగూడ చదువ నేర్చితిని.

**నరసింహరాజు**: (చెయిచాపి) ఓయీ! చూడుము. నేను చక్రవర్తి నగుదునేమో చెప్పుము వలదు, (చెయిఁదీసికొని) నా కిటువంటి వాటిలో నమ్మకము లేదు. నేను మానవ ప్రయత్నమునే విశ్వసింతును, ఆదియుఁగాక నీవు చేతిలోని జాతక భాషనే మిడకఁగలవు కాని, మా నాయకురాలికి వలె మోమున కావలనుండు మానస భాషను బఠింపగలవా ?

**కవి**: (తలయూపి) చిత్తము ప్రభూ!

**నరసింహరాజు**: ఐనచో నా మొగముఁ జూచి చెప్పుము, నేను దుర్మార్గుఁడనా? సన్మార్గుఁడనా?... నేను దుర్మార్గుఁడననియే నేను భావించుచున్నాను

**కవి**: (స్వగతము) పెను చిక్కునఁ బెట్టినాఁడే (ప్రకాశము) ప్రభూ! మిముగూర్చికూడ మీరు నిక్కమే వచింతురు కాన, మంచివారనియే యెంచవచ్చును.

**నరసింహరాజు**: మీ చచ్చు తెలివికిఁజాల సంతసించితిని తమరింక వచ్చిన దారిఁబట్టవచ్చును,

(కవి నిష్క్రమించును)

**నరసింహరాజు**: (స్వగతము) ఏదీ? నాయురాలింకను రాకున్నది. పలనాటి సిరియెల్ల నాయకురాలి కన్నులందే యున్నది కదా.

(నాయకురాలు పొంచిపొంచి ప్రవేశించుచుండును)

**నాయకురాలు**: ( స్వగతము ) ఓహో ! ఈ చలచిత్తుఁడిచటనే యున్నాఁడు. చిమచిమలాడుచున్నదేమో. పెల్లునఁ దెగనీల్గుచున్నాడు. ముందు వీని జోరు తగ్గింపవలయును (సమీపించును)

**నరసింహరాజు**: మహామంత్రిణీ! స్వాగతము! సుస్వాగతము! మీరు తీరికగానే యున్నట్లున్నారు. కానీ ——

**నాయకురాలు**: (ఆవేదన నటించుచు) చింత తీరికకాదు; కంతి బలుపును గాదు నరసింహ ప్రభూ!

**నరసింహరాజు**: నాయురాలా! ఏమిది? నీ విచార హేతువేమి? ఇట నీ శాసనము ఝుంఝూమారుతముగా సాగుచున్నదే. పట్టినదెల్ల పసిఁడి జేయగల పరుసవేదివే. బమ్మిని తిమ్మిని, తిమ్మిని బమ్మిని జేయగల ఘటనాఘటన సమర్థురాలవే. నీకా కలఁత యేల?

**నాయకురాలు**: ప్రభువులు పైపై మాటలవారేకాని చేతికందరు కదా.

**నరసింహరాజు**: (దర్పముతో) మబ్బులలోని నీళ్లుఁ దేఁగల మొనగాఁడను నేనుండగా నీ కేమి కొఱఁత? ఏమి కావలెనో చెప్పుము. అఖిలాండకోటి బ్రహ్మాండములు గాలించి గాలించియైన సాధించుకొని తెత్తును.

**నాయకురాలు**: (నీరసము నభినయించుచు) నాకొక చావుకాదు నరసింహ ప్రభూ! అలరాజును మీరు వధించిన కథతో దేశమెల్ల ఆట్టుడికి నట్లుడికి పోపుచున్నది. ఇంక మీ మచ్చ మాపుడెట్లాయని చింతిలుచున్నాను.

**నరసింహరాజు**: ఎవ్వరేమనుకొన్న మనకేమి? నీవును. నేనును గలసి చేసిన ఆ పనికై నీవును, నేనును విచారింపరాదు.

**నాయకురాలు**: అలరాజును నీవేల సంహరించితివయ్యా స్వామీ!

**నరసింహరాజు**: ( నిర్ఘాంతపడి) నీవు సేయు మన్నఁగదా నేనట్లు చేసితిని!

**నాయకురాలు**: ఛీ! అంతయునెత్తు భారమైనది. తగులబెట్టి నట్లున్నది. బాగు, బాగు, బలే వాఁడవు.

**నరసింహరాజు**: (సాను నయముగ) నాయురాలా! కోపముననట్లు చూడకుము. చేపలవంటి నీకన్నులు పాములై పోవును. నీకృపావలోకనమే మాకు నాక లోకము; నీ కోపావ లోకనమే మాకు నరక లోకము.

**నాయకురాలు**: నీ మైదు మాటలు కట్టిపెట్టుము. కృత్రిమ మానవా, నీ కుహక చర్యలు నాకడ ఫలింపవు; దూరముగ నుండుము.

**నరసింహరాజు**: (క్రోధావేశమును మందస్మితముగా మార్చుకొని) నాయురాలా! గుండె ఝల్లుమను కోడిగముల నన్నుగలంతు వేల?

**నాయకురాలు**: ముచ్చు ప్రొద్దుల గొంతులు గోయువాఁడవు, ఎంతకైనఁదగుదువు.

**నరసింహరాజు**: మేల మాడుచుంటివో, తూలనాడు చుంటివో తెలియకున్నది. ఒఱగొడ్డెములతో నన్నుడి కింపకుము.

**నాయకురాలు**: చెప్పుము. అలరాజును దెగటార్చితివి కదా!

నరసింహరాజు: (స్వగతము) ఏమిది? పశ్చిమానిలమువలె వీచుచున్నది. (ప్రకాశము) నేనే పాపము నెఱుఁగను, అంతయు నీవే.

**నాయకురాలు**: ఏపాపము నెఱుఁగవు పాలుఁద్రావు పసికందువు క్రూరకర్ముఁడా, నిష్ఠుర హృదయుఁడా!

నీసరివచ్చు హంతలవనీతల మందిఁక పుట్టఁబోరు సు
మీ్మ సున రాచమల్లుని వధించు ప్రబుద్ధుఁడవయ్యు, పైగ నేన్
జేసిన పాపమేమనుచు నీల్గెదు! మూసిన డాఁగునే మహా
త్మా! సరిగా వచింపుము యథార్థము నింక ప్రమాణపూర్తిగా !

**నరసింహరాజు**: నన్నేదో పితలాటకమునఁబెట్టి గజిబిజింపఁదలంచు చున్నావు, కాదేని ——

నాపైఁ గోపముఁ జూపఁగాఁ దగునె యన్యాయంబుగా నాయురా
లా! పై నొక్కటి, లోన నొండొకటి పల్కన్నేర నీ రీతి! నీ
లోపం బేదియు లేని చందమున నాలో దోసముల్ జూతువే?
ఈ పాపంబునకెల్ల కారణము నీవే కావె నిక్కంబుగన్ !

**నాయకురాలు**: నా కిది యెక్కడి తగులాటము. ఓ: సూర్యచంద్రులారా! ఓ! పంచభూతములారా! చేముంచి సొప్తిక కృత్య మొనర్చి యోట్రించుచున్నాఁడు! సత్యమునుగూడ హత్యసేయుచున్నాఁడు. ఆహా! ఈతఁడెట్టి యసత్య ప్రలాప కళా ధురీణుఁడో!

**నరసింహరాజు**: ఆహా ! నీవుంటివికదా యాదర్శ నారీ శిరోమణివి.

ఎన్నఁడేని బొంకియే యెఱుఁగవు నీవు,

నీకు నీవ సాటి నీతిలోన !
కలియుగాన నీ వొకతె వెందులకొ కాని
తప్పబుట్టినావు ధాత్రిపైన !
పూర్వజన్మ యందెపుడొ హరిశ్చంద్రుఁడే
నీకు సోదరుండు నీరజాక్షి !
అవని నుద్ధరింప నవతార మెత్తిన
మహితశీల వీవె మందగమన !

**నాయకురాలు**: నీ వెట్టి దగాకోరువో. కుళ్ళుపోతువో, చిట్లు కొఱ వివో నాకిపుడర్థమగుచున్నది.

మెత్తమెత్తఁగాఁ గనుపింప నొత్తి, యొత్తి
చూతురన్న రీతి నీకింత చులుకనైతి
నే నృసింహ భూజాని ! కానిమ్ము, నీ దు
రితము లెన్నాళ్ళు సాగునో రిక్తహృదయ !

**నరసింహరాజు**: గిచ్చి యేడ్చువారు నీవంటివారేకదా! నీవింతటి గొడప గొండివని నే నెఱుఁగను.

నీలోనే నేరముఁగా
నీ, లేనేలేనియట్లు నిలఁదీతు వహో!
నీ లోపాలను, నీనే
రాలను లోకంబె నాయురాలా ! యెఱుఁగున్!
నీకు నేనే తేరగా లభ్యపడితినని తలంపకుము.
లలనా ! మును నీ చేసిన
పలు తప్పుల నాదిది యొక పాటిది యగునా?
కలికీ ! సూదికి బెజ్జము
కలదని జల్లెడయె దెప్పఁగా చెల్లునటే ?

అలరాజ రక్తముచే నీ ప్రతీకార రోషానలము చల్లార్చుకొనుటకై నన్నా దుష్కృత్యమునకుఁ బాల్పఱచితివి. వాస్తవమున కీవే నన్నొక యాయుధముగా వినియోగించుకొని రాచమల్లుని మట్టు పెట్టితివి.

**నాయకురాలు**: నిప్పువంటిదానను, నీ మూలమున సమ్మెటపోట్ల వంటి నిందలు నేనెక్కడ భరింతును నాయనా! నీతో నా కిఁక కూడు కాదు. నా పరువు నాగులేటఁ గలియు నట్లున్నది.

చాలుచాలింక నీ చెల్మి! చక్కని గుణ
పాఠమున్ నేర్పినావు ! లెంపలను వైచి
కొందు! ఆరయ మోమోటకుం జనంగ
నేదొ మూఁడు నన్నట్లాయె నిట్లు తుదకు!

సందు దొరికినది కదా యని యిఱుకునఁబెట్టి నాకేమసకేయఁ జూతువా ? ఒక్కొక్కరు కడుపున నింత చేఁదు పెట్టుకొని యుందురు కాఁబోలు.

**నరసింహరాజు**: పరాకు, నమ్మికలు రాజకీయము లందు పనికిరావు కదా, నిన్ను విశ్వసించి నేనీ దుర్వ్యవహారమునందు తలఁదూర్చినందులకు దుఃఖపడుచున్నాను.

**నాయకురాలు**: ఆహా! ఎంత నయగారివి. నిష్ఠుర వాక్కులతో నా హృదిని విచారించుచున్నావు.

**నరసింహరాజు**: నీ కొక హృదయము కూడ నున్నదా ? దోషరాశివి నీవు. పాపపు గుట్టవు నీవు, కుట్రల పుట్టవు నీవు.

**నాయకురాలు**: నీకల్లబొల్లి కూఁతలు కట్టిపెట్టుము.

**నరసింహరాజు**: నీ యల్లిబిల్లి వాఁగుడు నరికట్టుము.

**నాయకురాలు**: ఆ తలబిరుసు దనమే వలదు.

**నరసింహరాజు**: ఆనోటిదురుసు దనమే తగదు.

**నాయకురాలు**: సర్వ దుర్గుణ పరిపూర్ణ స్వరూపుఁడవు. మానవాకార దానవుఁడవు.

(ఔడుఁగఱచి నరసింహరాజు గ్రుడ్లుఱుమును)

**నాయకురాలు**: కనులింతఁజేసి చూచుచున్నావు. ఏమి? కూరాకు సేయుదువా? నీ వెంత యదరఁజూచినను బెదరు వారులేరు. నీ కోపమును వేరొక్కచోట మండించుకొమ్ము,

(ఏదో యడుగుల సవ్వడివలె వినఁబడును)

**నరసింహరాజు**: ఎవరో వచ్చుచున్నారు. (హీన స్వరమున) ఈ మల్లగుల్లాలతో రెట్టించుకొని మనము రద్దిపడుటేల? నీకు పుణ్య ముండును;

**నాయకురాలు**: (స్వగతము) ఉలికి పడి చిఱు చెమటలు పుట్టివడఁకు చున్నాఁడు. ఇదేయదను (ప్రకాశము) నేను ఋజు మార్గురాలను; నాకేమి భయము.

ఔరా ! యెంతటి మాయకాఁడవు! అకార్యంబీవుకావించి, యా
నేరంబెవ్వరి నెత్తికో పులుమఁగానే తీరునే హంత? నీ
ఘోరాఘంబునఁ బాలు పంచకుము నాకున్, నీకివే నా నమ
స్కారంబుల్ పదివేలు! పొమ్ముభవదాకారంబె భీఁగొల్పెడున్!

**నరసింహరాజు**: (బిక్క మొగముతో) కానిమ్ము. నీవెంత సాపించినను, సతాయించినను, సహించియే యుందును.

ఏలిక సానివై యధమ భృత్యునిగా నను జెక్కినావు! నీ
కేలునఁ గీలుబొమ్మవలె గీసిన గీటును దాఁటఁడన్ని నే
రాలను దెచ్చి యీ నరసరాజ శిరంబున రుద్దు మెల్ల పా
పాలకుఁ గాలభైరవుని భాతిగ వీఁడొక డుండెనే కదా!
కటకటా! నన్నెంత ఘోరముగా మోసగించితివి.
నాకుఁ దొలుత నఱచేతుల
వైకుంఠముఁజూపి, తుదకు పాతాళమునన్
భీకరముగఁ బడఁద్రోయుట
నీకుఁదగిన నీతికాదు నీరేజముఖీ!

అంతయును నా కర్మము కాక మరేమి? ఒకనాఁడు బ్రహ్మనాయని వాత్సల్య శిఖర మధివసించిన నేను నేఁడు నీ కపట హ్రదమున మునిఁగి పోయితిని.

మునగ లెక్కించినావని మున్నరయక!
మురిసిపోతి! తుదకు కడు మోసపోతి!
ఉల్లమొల్లకున్నను రాచమల్లు నకట!
చేఁదు మ్రింగు పగిది హత్యసేసినాఁడ!

(నరసింహరాజు నిష్క్రమించును. తత్ క్షణమే పోతురాజు రొప్పుచు. రోజుచు ప్రవేశించును)

**పోతురాజు**: (ఆతురతతో) అమ్మా, అమ్మా, అమ్మా! మహామంత్రిణీ వారు!

**నాయకురాలు**: (ఒయ్యారముతో) కందురీగలు కుట్టినవాని వలె కంగారుపుట్టి గంతు లేయుచున్నావేల పోతురాజా!

**పోతురాజు**: అమ్మా, మన కోట బీటలు వాఱుచున్నది.

**నాయకురాలు**: ఎక్కడ ?

**పోతురాజు**: మాల కన్నమదాసు కన్నాకుగా మలిదేవుని దండు కట్టాయితమై నాగులేటి కావల, కారెమపూడి కీవల మొగ్గరించి యున్నది. ఆదిచూచి గుండెపగిలి, చావు బ్రతుకులతో హయమెక్కినేనిట కుడా యించితిని.

**నాయకురాలు**: మంచిపనిసేసితివి! (అని సుదీర్ఘ వికటాట్టహాసమొనర్చును)

**పోతురాజు**: ఆమ్మా, తమ రట్లు ప్రహసించునపుడు ప్రళయ కాల జ్వాలాక్షుని కపాలమాల వలె మీ దంతపంక్తి నన్ను భయకంపితు నొనర్చును.

**నాయకురాలు**: (మరల సుదీర్ఘ వికటాట్టహాస మొనర్చి) పోతురాజా! నేనన్నచో నాకే భయము. అచట యెట్లున్నదో చెప్పుము.

**పోతురాజు**: అమ్మా! అచట భేరీ భాంకారములతో, వారణ ఘీంకారములతో, కంఖాన హ్రీంకారములతో, వీరభట హుంకారములతో కారెమపూడి బోరెత్తు చున్నది. నాగులేరు హోరెత్తు చున్నది. నాగుండె ఠారెత్తుచున్నది.

**నాయకురాలు**: (పండ్లు గొఱుకుచు) ప్రతి వీరులను దొరకిన వారిని దొరకినట్లు పచ్చడి సేయుఁడు, రొయ్యలను విడిచి పులుసున గలుపునట్లు, వారిని నఱికి నాగులేటఁ గలుపుఁడు.

**పోతురాజు**: కానీ, అమ్మా. మనతో పోరికై దిట్టముగా బ్రహ్మన్న పుంజుకొని యున్నాఁడు.

**నాయకురాలు**: ఆగుఁగాక ఇత్తటి నాతని కోడిపోవుట కల్ల పోతురాజా! నా తెల్ల గుఱ్ఱపుఁ దోఁక కుచ్చువంటి మీసములు గల– ఆ ముది మంతిరి, ఆ సామంత రాగోలు కాఁడు, ఆ యోడిపోయిన కోడి పందెకాఁడు, ఆ బమ్మనాయఁడు నీకగుపించినాఁడా?

**పోతురాజు**: ఆహా! కనుపింపకేమి? వారి సేనా పారావారము జూచువారికి గుండెలు జారుచున్నవి. ఎక్కడెక్కడివారు నాయనికి సాయమై వచ్చినారు.

**నాయకురాలు**: ఆట్లయిన యుద్ధ ధర్మములు మనకేల? నీతి నియమముల నీటఁ గలిపి, ఎత్తునకు మాఱెత్తువేసి జయలాభమును సాధించుటే మన ప్రధాన లక్ష్యము.

**పోతురాజు**: ఈ సారి మన యెత్తులన్నియు చిత్తగునేమో?

**నాయకురాలు**: ఆట్లయిన మన విధానము మనకున్నది కదా!

ఆత్మపక్షబలం బెక్కువైన యపుడు
శత్రు పక్షంబుతో పోరు సలుపవలయు !
ఆత్మపక్షబలమె తక్కువైన యపుడు
శత్రు పక్షంబుతో సంధి సలుపవలయు !

**పోతురాజు**: కానీ, మహామంత్రిణీ!

''అలరాజు లేఁడని వ్యధఁజెందవలదు
అలరాజు మన యంతరాత్మలఁగలఁడు''

అనుచు కన్నమదాసు మహోపన్యాసము లొసఁగుచు స్వీయానీకమును రణోద్దీపిత మొనర్చుచున్నాడు.

**నాయకురాలు**: (రోషకుంచిత భ్రూభంగముతో) ఓరోరీ: అలరాజా ! నీ పెట్టి బెట్టిదుఁడవు! చుట్టమై వచ్చి దయ్యమై పట్టుకొనినావు! చచ్చియుఁ జావకున్నావు! పోతురాజా! పోదము, రమ్ము,

(ఇరువురు నిష్క్రమింతురు)

## పంచమాంకము
## ప్రథమ రంగము
## (సింహసౌధము – గురజాల)

**నరసింహరాజు**: (తీవ్రసంక్షోభముతో) నేనున్న చోటి నుండి నా ప్రాణము లెటకెటకో పరువిడుచున్నవి. నాలోని హంతయే కాఁబోలు నన్ను వెంటాడు చున్నాఁడు.

మెత్తని సెజ్జపై నయిన మేనును వాల్చినఁ గున్కురాదు! యీ
తత్తరపాటునన్ దిరముదప్పి భ్రమించుచు నుంటినౌర! నా
కెత్తటినైనఁ దప్పదిఁక మృత్యువు! తప్పదు నాకు బాలుచే
గత్తికిజిక్కి చచ్చి, కలకాలము దుర్యశమందు వ్రాఁతయున్.

నా కిదేదో వినూత్న జీవితమువలె నున్నది. నా హృదియందు – ఆశాంతి – సంక్షోభము– ఉద్ధృతమైన తుపాను– భీకరమైన సుడిగుండము.

ఈ విభావరీ పటుతమో భావమేదొ
నా మనో మందిరమునఁ దాండవముసేయు!
ఈ నికృష్టపుంజీఁకటు లెన్నినాళ్లు?
ఈ యగోచర శృంఖలా లెన్నినాళ్లు?
కటకటా! నా దెట్టి దుర్భర జీవితము.
అరయఁ గటకటాలందు సింహంబు కరణి
బ్రతుకుచున్నాఁడ నా దొక బ్రతుకటంచు!
స్వేచ్ఛఁదప్పి నేనెట్లు జీవింతు నిట్టి
బ్రతుకు కన్న చావు సుఖతరంబు కాదె!
అహో: నాయురాలు, అదెంతటి క్రూరురాలు.
దివ్య సురభిళ కాంతులఁదేజరిల్లు
మొగలి పొదలందు మిన్నాగు మూఁకవోలె–
హాయిగా, తీయగాఁ బల్కు నాయకురాలి
పలుకు పలుకునందు విసపుఁ దలఁపు లౌర!

ఈ దుర్భరైకాంతమునం దవనత మస్తుఁడనై, అంతర్మనస్కుఁడనై, అనేకానేక స్మృతికుంతములతో నా హృదిని గాయ పఱచు కొనెద. నా మిడిసిపాటునకు, నేఁబోయిన పోకిళ్ళకుఁ దగినట్లు సమస్త నరక యాతనలను మానసికముగా ననుభవించెదఁ గాక!

(పోతురాజు ప్రవేశించును)

**పోతురాజు**: (స్వగతము) ఈయన పాణితలమును ఫాలభాగమున కానించి గోడుఁ గుడుచుచున్నాఁడు. (సమీపించి చేతులెత్తి మ్రొక్కుచు) ప్రభూ! మీకివే నా యేటికోళ్ళు, ఎట్లున్నారు ?

**నరసింహరాజు**: అయ్యా! దయసేయుఁడు, దయసేయుఁడు. తమవంటి వారి చల్లని చూపుల వలన నింత చక్కగా బ్రతుకీడ్చుచున్నాను.

**పోతురాజు**: ఇటీవల శత సాహస్రానేక క్షణముల నుండి తమ దర్శన భాగ్యమే మా పాపపుఁ గన్నులకు లభించుట లేదు. ప్రభువులు రోసమునకు పుంజులు కదా! ఆవల సంకుల సమరము జరుగనుండ తోఁక పీఁకుడు గాఁడవై పీను గుమోము వైచుకొని కూర్చుండు టేల?

**నరసింహరాజు**: (ఉగ్రుఁడై) నాది పీనుఁగు మోమఁటరా? గూబకనులు, మేక దౌడలు కప్ప నోరు, కొంగ ముక్కు, ఔల్లు బొచ్చుగల పిశాచముఖమా! కోటలో పడి పందికొక్కువలె బొక్కుచున్నావు. పందెపుఁ బుంజువలె నిక్కుచున్నావు కానిమ్ము. వచ్చిన పని యేదో క్లుప్తముగా నేడువుము; మూఁడు ముక్కలలోఁ జెప్పుము; పలుకులను వ్యయపఱచకుము; మితభాషి వగుము; పోతరించి వదరకుము.

**పోతురాజు**: మహామంత్రిణి మూడోకన్ను తెఱచినది. యుద్ధ సంసిద్ధురాలైనది.

**నరసింహరాజు**: అట్లయిన నీ వంటి దేవర దున్నపోతులకు జాతరకాల మేతెంచినది. ఐనను యుద్ధమా? ఎందులకు? ఎందఱనైన వధింపఁగలము; అందొకనినైన బ్రతికింపఁ గలమా ?

**పోతురాజు**: ఆహా! ఎంత చక్కని సూక్తి. చిలుక పలుకు వలె నున్న కొలికిపూస కదా. ఓ భూత భవిష్యద్వంతలారా! యీ మంత్రమును

విస్మరింపక జపింపుఁడీ, ప్రభువులు దయాప్రపూర్ణులు. ఉదార స్వరూపులు, విశాలహృదయులు! బ్రహ్మదేవుఁ డీమహామహుని పోతఁబోసి, ఆ యచ్చు నంతిటితోఁ దీసివేసె! ఏమి ప్రభూ! నాగాంబగారి చేతి క్రింద నలఁగినవారు, సామాన్యులా తమరు ? మహాశయా!

**నరసింహరాజు**: (స్వగతము) ఈ పొట్టకూటి తొత్తు కొడుకునకుఁ గూడ నేనెంత లోఁకువైపోయితిని!

(నేపథ్యము నుండి రాగాలాపము వినపడుచుందును)

**నరసింహరాజు**: (శ్రవణ మభినయించి) ఎవఁడాతఁడు? సుదీర్ఘరాగ ప్రస్తార మొనర్చుచున్నాఁడు! నా తనువెల్ల చెవులై పోవుచున్నది. అహో! స్వీయరాగ శంపాసో పానములచే ఈ తమో మేఘమండలము నధిరోహించుచు నన్నెదో యూర్ధ్వ జగతికిఁ గొంపోవుచున్నాఁడు.

**పోతురాజు**: ప్రభూ! గొంతు శ్రావ్యముగా నున్నది.

**నరసింహరాజు**: శ్లాఘ్యముగా నున్నది.

**పోతురాజు**: వీనుల విందుగ నున్నది.

**నరసింహరాజు**: మాన సానందముగ నున్నది.

**పోతురాజు**: పూల తోటలో నున్నట్లున్నది. ప్రభూ !

**నరసింహరాజు**: స్వర్గ సీమలో నున్నట్లున్నది.

**పోతురాజు**: చెవిలో పానకము వోయుచున్నట్లు మోఁతగా నున్నది ప్రభూ!

**నరసింహరాజు**: నీ వాఁగుడు పానకములో పుడకవలె నున్నది. నోరుమూయుము.

(పోతురాజు చేతితో గట్టిగా నోరు మూసికొనును)

**నరసింహరాజు**: ఆహా! ఏమి గాత్రము అతఁడు నారదుఁడో? తుంబురుఁడో ?

**పోతురాజు**: ఆంజనేయుఁడో? హనుమంతుఁడో?

**నరసింహరాజు**: ఛీ! బుద్ధిలేదా? ఎన్నిసార్లు నోట గడ్డిపెట్టవలె? నిశ్శబ్దము. (నేపథ్యము నుండి గీతిక)

ఓ ! హంతకా ! ఓహో ! హంతకా !
నీ కరమున గత్తులా?
నీ మనమున మంటలా ?
ఓ! ఓహో! హంతకా !
నీ బ్రతుకున గతుకుల బాటలా ?
ఓ! ఓహో! హంతకా !
నీ కత్తి పోటులో
నీ మిత్తి పాటలో
నెత్తుటి మడుఁగుల గోడులా ?
ఓ! హంతకా! ఓహో! హంతకా !
ఎదుటివారి వ్యధలే
నీ హృదయానికి సుధలా ?
ఇది తగదురా మదోన్మత్తుఁడా !
ఓ! హంతకా ! ఓహో! హంతకా!
మానవ రూపములో
దానవ భావము లా ?
క్రూర మృగానికన్న నిది ఘోరముకాదా?

(నరసింహరాజు వివర్ధుఁడై, విషణ్ణుఁడై, తదేక నిశ్చలుఁడై నిలచియుండును)

**పోతురాజు**: ప్రభూ! ఏమిది? పరధ్యాన విచార వ్యాకులములతో నున్నారు. ముసురుపట్టిన నింగివలె మీ మోము మంగుబాఱిన దేల ?

**నరసింహరాజు**: ఆ పాడు వాఁడెవఁడో. తనపాటతో నా కశాంతిఁ గల్పించినాడు

**పోతురాజు**: కాదు, మీరే యులుకూనియో భేదఖండిత హృదయు లగు చున్నారు. అయ్యో! ప్రభూ కన్నీరోడ్చు చున్నారా? భవాదృశుల నిరంతర శోకాశ్రుపాతము చేతనే క్షీర సాగరము క్రమ క్రమముగా లవణ సాగరమై పోయినది.

**నరసింహరాజు**: ఈ విచార సమయముననా నీ పరిహాసోక్తులు నిన్నేమి సేయవలె, నిలువునc బగులcగోయవలె.

**పోతురాజు**: ప్రభూ! నాపైన (గొంతుcజూపి) మీకింతవఱకు గుఱ్ఱెందులకు ప్రభూ!

**నరసింహరాజు**:పొమ్మురా. పొమ్ము. ఆపాటకాcడెవ్వcడో పట్టుకొనిరమ్ము.

(పోతురాజు నిష్క్రమించి యువగాయకునితో ప్రవేశించును)

**యువకుcడు**: (తొట్రుపాటుతో) ప్రభూ! మాపాదములకు మీ ప్రణామములు.

**నరసింహరాజు**: ఓయీ, యువకా, గాయకా, నీ పేరేమి?

**యువకుcడు**: నా పేరు గానయ్య ప్రభూ!

**నరసింహరాజు**: ఇదేమిపేరు? సరే కానిమ్ము! నీ వెవcడవు ?

**గానయ్య**: నేనొక హరిజనుcడను ప్రభూ !

**నరసింహరాజు**: హరిజనుcడవో? గిరిజనుcడవో? నీవేజనుcడవైన నాకేమి? సజ్జనుcడవేనా ?

**గానయ్య**: నేను దుర్జనుcడను గానుప్రభూ !

**నరసింహరాజు**: నీ వాలకమదేదో నేరము సేసినవానివలె నున్నది. కానిచో నా నత్తురు వత్తురు లాడుటేమి ? ఆ నంగివేసము లేమి ? ఆగిడిగిళ్ళు. వెట్టుటేమి? సరిగా నిలcబడుము.

**పోతురాజు**: ప్రభూ! ప్రభూ! నాలి ముచ్చువానిని నీళ్ళు నమలు వానిని, నేలcజూచు వానిని నమ్మరాదు ప్రభూ.

**నరసింహరాజు**: ఓరీ: లేకీ! నీవు నోరు మూయుమురా! (గానయ్యతో) ఏమోయీ. నీవు హంతవా యేమి !

**గానయ్య**: (నిర్ఘాంతపడి) నేను హంతనా ?

**నరసింహరాజు**: కాదు, కాదు. ఎవరినైన నీవు చంపితివా? కాదు, కాదు. ఎవరిప్రాణమైన నీవు హరించితివా? కాదు. కాదు! ఎవరినైన నీవు పరలోక మంపితివా ?

(గానయ్య కన్నీరోడ్చును)

**నరసింహరాజు**: (వాని చిబుకము స్పృశించి) మా నాయనవుగా! భయపడి దాఁచుము. నేను నీ వాఁడను. నీబోఁటి వాఁడను. నీవు హంతవు కావా? నీ గాత్రమున నాకు పశ్చాత్తాపపు టపస్వరపు జీరలు స్ఫురించుచున్నవి. నీ వెవరినో హత్య సేసియే యుందువని నేను భావించుచున్నాను.

**గానయ్య**: (ఏడ్చుచు) నేనా పాపమెఱుఁగను ప్రభూ!

నరసింహరాజు: ఆది పాపమా? పాపమే యందువా?

**గానయ్య:** సాటి మానిసిని తిట్టుటేపావము! కొట్టుపే పాపము! చంపుటన్నిఁటికన్న పాపము ప్రభూ !

**నరసింహరాజు**: సరే. నీవు హంతపు కావేని భయపడుటేల? భాధ పడుటేల? బావురుమని యేడ్చుటేల? అవి యన్నియు హంత పడవలసిన పాట్లు. ఆతఁడు సభ్యతా ప్రపంచమున శిరమెత్తుకొని తిరుగులేఁడు! అతఁడు వెలి వేయఁబడినవాఁడు.

ఒక్క క్షణము నం దొక్కని నొక్కసారి
యొకఁడు హత్యసేసిన నది యొకటె చాలు!
హంతకుఁడు క్షణక్షణమును హత్యసేయఁ
బడును చిత్ర హింసలతోడ ప్రతిఫలముగ !
కాన, నీవు కలయందేని హంతవుకారాదు.

**గానయ్య**: ప్రభూ! మున్నెట్లుంటినో మును ముందట్లే

**నరసింహరాజు**: ఉండుము, నాయనా! మంచిది. నీవు బుద్ధిమంతుఁడవు! నీవు స్వేచ్ఛాజీవివి! ఎటకేని నీవు పోవచ్చును.

**గానయ్య**: (వినమ్రుఁడైనమస్కరించుచు) ప్రభూ! యీ భృత్యుడు సెలవు తీసికొనుచున్నాఁడు. (నిష్క్రమించును)

**పోతురాజు**: ప్రభువులవారి పాదపద్మ సన్నిధికి మహామంత్రిణివారు. నివేదించుకొనిన విన్నప మొకటి కలదు; చిత్తగింపుఁడు!

**నరసింహరాజు**: (ఆగ్రహావేశముతో) ఓరీ! పచ్చెపుదొంగా! ఆ పోలేరమ్మ కివొక పోతురాజవు సరిపోయితివి. ఛీ పొమ్మావలకు! దాని పేరు నా కడ నుచ్చరింపకుము. పొమ్ము.

**పోతురాజు**: ప్రభూ ! ప్రభూ!

**నరసింహరాజు**: (కనులింతచేసి) నిన్ను మ్రింగెదను. పొమ్ము!

(పోతురాజు పరుగెత్తును)

**నరసింహరాజు**: (స్వగతము) ఓ! కపట నాటిక సూత్రధారిణీ! నాగసానీ! నీ కల్లనుడు లెల్ల నమ్మి నీ వేదో త్రవ్వి నా తలకెత్తుదు వను కొంటి గాని, తుద కిట్లు శఠగోపురము వెట్టుదువని తలపనైతి.

> "ఈ పలనాటి రాజ్యమునకెల్ల మహాధిపుఁజేతు నిన్ను! నీ
> వే పనిసేయుమన్న అదియే విధిగా శిరసావహింతు! నీ
> యాపదలందు నా బ్రతుకు నడ్డము పెట్టుదునంచు" నెన్నియో
> పాపపు బొంకులాడి నను వంచన సేతువె నాగసానిరో !

ఓ! వనితా! నీ ప్రళయ గర్భిత ప్రణయ సౌందర్యమీ సృష్టివైచిత్ర్యము. అట్టి కుసుమ లావణ్యాంతర్భాగముననా యిట్టి ఘోర కాకోల విషాగ్ని చ్ఛటలు! కటాకటా ! నన్నెట్టి యధోగతు నొనర్చితివే నాయురాలా.

> ఏలికనౌదునంచు మది నెంతయు నుబ్బితిఁగాని, నీవు నా
> పాలిట శక్తివై కపట పాశముఁబేనుట గాన నక్కటా!
> నేలపయిన్ జరించు నను నింగిపయిన్ విహరింపఁజేసి, యీ
> నేలనె తాకి చావుమని నెట్టితి వెంతటి నిర్దయాత్మవో ?

దివ్యాఱుపుఁ బ్రువ్వును చోరుఁడు ప్రయోగించునట్లు అలరాజ మారణమునకై నన్నుపయోగించుకొంటివి. లౌకిక శూన్యుఁడనై నీవు సేయుమన్న దెల్ల చేసితిని. దుర్విధి ప్రేరణచే నవివేకి యపరాధి యగును గాఁబోలు హా! దైవమా!

ఆయుధమూనలేదు, నిదురైనను మేల్కొనలేదు. చెంత నే
సాయముగానిలేదు, మతి శాంతి యొకింతయునైనలేదు, లే
బ్రాయము దాటలేదు తన వచ్చిన కార్యము దక్కలేదు ఔ
రా! యిటువంటి దీను నలరాజును జంపితి నెంతపాపినో ?

ముందు వెన్క లెఱుఁగని యావేశమున మందమతినై అలరాజును వధించితిని. ఆవేశమా! నీ మాఱు పేరే యవివేకము. అయ్యో! ఆకసమా! నే నా ఘోరకృత్య మొనర్చునపుడేల నీవు ఫెళఫెళార్భటులతో విఱిగి నా పైఁబడలేదు. ఆత్మహత్యా సదృక్షంబైన అలరాజ హత్య నెట్లొ నర్పఁగలిగితిని,(అశ్రుపూరితనేత్రుడై) అమ్మా! పేరిందేవీ, నీ పసుపుఁ గుంకుమలఁ జెఱపిన జాల్ముండను, దుర్మార్గుండను.

ఏ చేతులపై నిడుకొని
నీ చిన్నతనంబునందు నిను బెంచితినో
ఆ చేతుల నీ పుస్తెను
నీచముగాఁ ద్రుంచినాను నేనే తల్లీ!

ఓ! హృదయమా! నీవు దేనితో సృజింపఁ బడితివో కదా! నీ కాఠిన్యమే పాషాణమున కున్నది? ఏ వజ్రమున కున్నది. అయ్యో! నేను పాపు లందఱికంటె పాపిని, నేను మానిసినా ? సింగమునా ?

ఈసు వహించి బాంధవుల కెన్నియొ గోతులు త్రవ్వినాను! పే
రాసకు లొంగిపోయి అలరాజునె యంతము సేసినాను! నా
దోసములెంచి భూప్రజలు దూషణసేయ గ్రహించి నా నిసీ
రోసములేని నా బ్రతుకు రూపఱి పోవక యున్న దేలొకో ?

నేను దుర్భరవేదనా భరిత మరణ శిక్షార్హుఁడను. (కత్తితో బొడుచుకొనఁబోయి, యాగి) అన్య హత్యా క్రౌర్యమే కాని ఆత్మ హత్యా ధైర్యమేదినాకు? కానీ, నేను బ్రతికి యుండియుఁ జచ్చియున్నాను. ఓ! అలరాజా! మరి నీవో, మరణించియు జీవించియే యున్నావు.

(నాయకురాలు, పోతురాజు ప్రవేశించు చుందురు)

**నాయకురాలు**: ఏమను చున్నాఁడా మానవ మృగరాజరాజు? అతని చూపులెట్లున్నవి ? ముఖచేష్ట లెట్లున్నవి ? కుచ్చితముగాఁ జూచుచున్నాఁడా? స్వచ్ఛముగాఁ జూచుచున్నాఁడా? కలకలలాడుచున్నాఁడా? వెలవెలఁ బోవుచున్నాఁడా ? ఆతని వదనమున నాతని హృదయ మెట్లున్నది?

**పోతురాజు**: అమ్మా! నేనాయనకు నమస్కరించితిని; ఆయన నన్ను దిరస్కరించెను. నేనాయనవైపు దీనముగాఁ జూచితిని, ఆయన నా వైపు కోపపుఁ జూపుల తూపులు విపరెను; అంత నేనాయన దెస దీక్ష్ణముగా వీక్షించితిని కొంత తడవు మేమట్లు చూపులతోఁ గొట్టుకొంటిమి. తరువాత నాయన సింగఁడు బూరఁడై కస్సుబుస్సుమని నన్నుఁ గఱువఁ దైతక్కలాడి నాఁడు, అంతట నేను

**నాయకురాలు**: ఏడ్చినట్లున్నది నీ రొద. పోదముపద. (ముందు పరిక్రమించి) అడుగో, మేఘనాథుఁడొక్కడే యున్నాఁడు.

**నరసింహరాజు**: (స్వగతము) ఈరంపెలాఁడి మరే మారాముళ్ళు పన్నుటకో మందహాసములఁ గ్రుమ్మరించుచు గోటుగా నిటే వచ్చుచున్నది. ఔరా ! అంతపని చేయించి, అంత గొడవసేసి, ఎంత నింపాదిగా నున్నది.

లోని భావమెల్ల లోలోన దాఁచియు,
తెచ్చుకొన్న నవ్వుఁ దెలియనీక,
ఏమెఱుఁగని చూపు లితరు లరయునట్లు
నాటకంబులాడు నాగసాని!

**నాయకురాలు**: (సమీపించి) నృసింహ ప్రభూ! ఇటీవల నల్లపూసవైనావు. ఇటువంటి తరుణమునఁ డకటక లాడింప వల సినవాఁడవు కదా.

అరయన్ వైరి మదేభ కుంభముల వ్రయ్యల్ జేసి, తద్రక్త సా
గర కల్లోలములన్ ప్రమోదజయనౌ కాయానముల్ సాగించు ఓ!
నరసింహాగ్రణి! నేఁడిదేల మొగముం దప్పించి కూర్చుంటివో
పరిపంథుల్ పరిహాసముల్ సలుపుచున్ బై పైకిదండెత్తఁగన్ !

**నరసింహరాజు**: (స్వగతము) ఈ యమురాలు మరల దాపురించినది; యీ వఱకే నాగుండె పచ్చిపుండై యున్నది.

**నాయకురాలు**: ప్రభూ! అరివీరుల పులుసు వండగల వాఁడవు. నీ విట్లు పసలేని నాసివానివలె ముడుచుకొని కూర్చుండు టేల?

**నరసింహరాజు**: కొన్ని ముఖప్రీతులు, కొన్ని యెత్తిపొడుపులు.

**నాయకురాలు**: ఆందఱకన్న పైచేయివని అహం బ్రహ్మీభవించు బ్రహ్మన్న కావరమడఁపఁ గల యేకైక వీరుఁడవు కదా.

**నరసింహరాజు**: మాటలోన మాధుర్యము – మనసు లోన మాలిన్యము.

**నాయకురాలు**: ప్రభూ! నీతో నేను వివాదపడినదెల్ల యథార్థమని దురూహపడి నొచ్చుకొంటివి కాబోఁలు, అది కేవలము కృతక కలహ మనియు, మన కుపయోగకరమైన సమయోచిత రాజకీయ ప్రక్రియ యనియు నీవు గ్రహింపవలయును.

**నరసింహరాజు**: కొంటె కూతలు, కుంటి సాకులు.

**నాయకురాలు**: యోధులకెల్ల యోధుఁడవు, సమరమన్న నెగిరి గంతువేయువాఁడవు. ఇప్పుడేల యిట్లేడుపు కెదురు చూచుచు మక్కుడు పట్టిన మతితో వెళ్ళబెట్టుచున్నావు? నీకిది పెద్ద కళంకము కాదా?

**నరసింహరాజు**: ఆహా! ఓహో! యిని పలుకులా! చక్కెర చేదు గుళికలు. ఇవి మాటలా: కంటికి గనరాని యీటెలు.

**నాయకురాలు**: చేయి తిరిగిన ఖడ్గవీరుఁడవు. గుఱిఁదప్పని యేటు కాఁడవు. మొన కట్టఁగల మొనకాఁడవు.

**నరసింహరాజు**: అన్నియు సమయానుకూల ప్రశంసలే..

**నాయకురాలు**: అడిగిన చిరాకు. ఆడుగకున్న పరాకు. ఆవలపోరు జరుగ నున్నది. ముట్టెమోపున మిరీగతి నంకెవేయుట పాడికాదు. మీ యెడ మచ్చికఁగల దాన నగుటచే బెట్టు సెడ గొట్టుకొని కూడ వేఁడుకొను చున్నాను. ఏకమై మనము శత్రు ఖడ్గమును భేదింప వలయును. మనలో

మనకీ పోరపు మనకే చెఱుపు సుమా ! ఇరు పోటీల కిల్లుచెడు; వాత నొప్పుల కొడలు చెడు.

**నరసింహరాజు**: నీ కంతరంధిగా నున్నచో నీవే పొమ్మా రణ రంగమునకు, నాకా దూలలేదు. పో, పొమ్ము.

**నాయకురాలు**: ప్రభూ! మీరెంత వీరులైనను మీ కింత గీర తగదు. పొందుఁగోరి వచ్చిన వారిని పో పొమ్మనరాదు. చెప్పిచెప్పి నా నోరు పడిపోయినది. నన్నిఁక వేపుకొని తినకుఁడు! మిమ్మింక సాగ దీయ లేను ప్రభూ ! (ధోరణి మార్చి) ఎంతకును మెత్తఁబడ వేమయ్యా !

మృతుఁడు మూర్ఖుఁడు నిర్వురున్ మతుల మార్చు
కొనరు! నీలోఁ గలుపుకోలు తనమె లేదు!
ఎంత పెడసరపుం గట్టెవీవు! నిన్ను
నెట్లు సంస్కరింపఁగలనో యెఱుఁగనైతి !

మలిదేవుని సేనలు రేపు లగ్గపట్టునపుడుఁగాని నీకుఁ దెలి యదు. ఏదెట్లు ముదనష్టమైన నాకేమి? పోతురాజా! ఎంత చెప్పినను యీ స్వామి వినఁడు; పోదము పద.

**నరసింహరాజు**: పొమ్ము. దువ్వి దువ్వి, అఱచి అఱచి, అలసి పోయినావు.

**నాయకురాలు**: ఇట నా మొఱాలించు నాథుఁడే లేఁడా ? ఇంత వాగిన దెల్ల బీడునఁ గురిసిన వానాయెనా? ప్రభూ పోరికై తఱకలు పుట్టి యిపుడే కోసకోడి వగుచున్నావు. బాలచంద్రుఁడు నిన్ను విడచి పెట్టునా ? ఆ నెలబాలునకు నూలుపోఁగుగా నీ తల పోక తప్పునా?

**నరసింహరాజు**: ఛీ! తంటాలమారీ ! పో పొమ్ము. నా ప్రప్రథమ శత్రురాల వీవు.

**నాయకురాలు**: నేరగాని కెల్లరును గానివారి వలెనె కానుపింతురు. నీ బ్రతుకు నాకు, నా బ్రతుకు నీకు దెలియును. నాకన్న నీ మేలు గోరు వారెవరు? నన్ను నిరాశాహతురాలిఁ జేయక నా మాటవిని సైన్యాధిపత్య మును స్వీకరింపుము. రండు పోదము, (సమీపించుచుండును)

**నరసింహరాజు**: (క్రోధస్వరమున) ఛీ. దూరముగ నుండుము.

నారీరూప విషోరగంబ! దరికిన్ రాబోకు, రాబోకు ! నీ
బూరుంబూతలుచెల్లఁబోవిచట! పో! పొమ్మింక! నిన్నమ్మి, ఆ
తీరున్ నేను నరాకృతిన్ మృగమనైతిన్ మున్ను! తల్లీ! మరే
క్రూర వ్యూహముఁ బన్నవచ్చితివొ నాకుంబెన్ పిశాచంబవై!

**నాయకురాలు**: హా! హతవిధీ! నీ వెంత యూహాతీతముగా వ్యతిరేకింతుపు. అట్టి చెలికారమున కిట్టి దుస్థితి పట్టించితివా ?

**నరసింహరాజు**: వగలాఁడీ. ఒలకపోయకు మింక నీవలె కోపము నాపుకొనుటయు, కపటపుఁ గూతలు కూయుటయు నా చేతఁగావు.

**పోతురాజు**: అమ్మా! గబ గబ యఱచువారును, పక పక నవ్వు వారును కపటము లేని వారు.

**నరసింహరాజు**: (స్థిర గంభీర స్వరమున) ఓ! నాయురాలా, మనము నర నారీ రూప విషశస్త్రములము, భీకర క్లేశములు మనలఁ బీడిం చును. ఉభయుల మనంత కాలము నిరంతరము నరకానలమున దగ్ధ మయ్యెదము. నీ మనోవల్మీకమున నున్న గరళ తత్త్వమును, నాహృదయ గుహనున్న క్రూరసత్త్వమును రెండు నేకమైనవి. ఏకమై ఘోరాతి ఘోర పాతకమును.దుష్కర దుష్కృతమును గావించినవి.

అటుచూడుము. యుగ యుగాలనుండి సంస్కార బలముచే దినదిన ప్రవర్ధ మానుఁడైన మహోన్నత విశ్వమానవుఁడు, బ్రహ్మాండ నాయకుఁడు. నీ కౌటిల్యముతోఁ జేయఁగల్పిన నా కాఠిన్యమును నిశిత నిష్ఠుర దృక్కుల పరిశీలించుచున్నాఁడు. యుక్తాయుక్త వివేకమును, చిత్త సంస్కారమును గల మనుష్యజాతిలో మనమేల యుద్భవించితిమి? మృగపద చిహ్నముల ననుసరించుచుఁ గుటిలాటవీ పథములఁ బయనిం తము పద.

మన మాలిన్యమునే దేవదేవుని పవిత్ర హస్తము తుడిచివేయఁగలదు? మన కలంకమునే పూత వియత్తరంగిణీ జలములు ప్రక్షాళింపఁ గలవు

దుర్మార్గులయెడ జాలిపడు వారెవరు పాపాత్ములను గాపాడు వారెవరు: సత్కీర్తికంటెను సౌఖ్యములేదు; దుష్కీర్తికంటెను దుఃఖము లేదు. అదిగో, సరకద్వారము మనకొఱకే తెఱచికొని యున్నది. చిత్ర గుప్తుడు విష నామములను ప్రత్యేకముగా లిఖించినాఁడు.

ఆవేశమున నేనేదియో వాక్రుచ్చితిని. క్షమింపుము. కాలగమన మహేంద్ర జాలమున గహన భూములు మహా సామ్రాజ్యములైనవి. మహా సామ్రాజ్యములు మరుభూములైనవి. కావలసినదేదో కాకపోదు. నేనెవఁడను? విధి నిర్ణేతనా?

**నాయకురాలు**: మీ పలుకులచే నాతల పోయి నేలకుఁ గొట్టు కొనుచున్నది. నాకిపుడేదో యిదిగా నున్నది. నా కన్నులఁ దెఱపించినారు. ఆ పాపమెల్ల నాదే. నన్ను మన్నింపుఁడు ప్రభూ! అటుచూడుడు – డేగ చూపుల కన్నమదాసుని నాయకత్వమున శత్రుసేనా సమూహము కారెమ పూడి కడ నాగ కల్లోలినీ తటమున మోహరించి యున్నది. ఇంక జరుగ నున్నది మహాసమరము.

**నరసింహరాజు**: సమరమా? అది మహా హత్యా కార్యక్రమము. సమర రంగమా? అది విశాల హత్యానిలయము. సమర యోధులా? జగత్సమ్మత హంతలు అవునా? వారేకారు, ఇతరులనే రూపమున బాధించు వారుగూడ నా దృష్టిలో హంతలే! అవునా?

**నాయకురాలు**: అవును ప్రభూ!

**నరసింహరాజు**: ఇంక సంగ్రామమేల వారితో సంధి ——

**నాయకురాలు**: వారు సమ్మతింతురా ప్రభూ!

**నరసింహరాజు**: నీకా సంశయమేల? మన రాయబారిగా కేత రాజును వారి కడకుఁ బంపుదము, (ఇరువురు నిష్క్రమింతురు)

## ద్వితీయ రంగము
## (పాంథశాల – కారెమపూడి)

**కేతరాజు**: ఓ! సకల సుగుణధామా! మలిదేవ సార్వభౌమా ! రాముఁడేలిన నేలకాదా యిది? బుద్ధుఁడు పుట్టిన భూమికాదా ఈ నేలపై నెందులకీ యక్రమములు? ఈ భూమిపై నెందులకీ సంగ్రామములు ?

అలుగున్నృపాలుని కాలపు
పలనాఁడు వెలిఁగిన వైభవంబూడియు ని
ట్టులయిన తెఱంగెఱుంగఁ గ
నుల నీరొలికెడిని నాకును, తదితరులకున్ !
ఆదియును గాక ---
ప్రజల రుధిర మాస్వాదించు రణ పిశాచి
కేల కొలుపుల్ గొలువఁ జూతు వీవు భూప ?
దేశ నాయకు లీ పగిదిన్ జరించు
టరయ తద్దేశ మంద భాగ్యంబు కాదె ?

పోరు జరిగిన సీమ పురుగు పారిన చేనువలె పాడైపోవును. ఈ మహో పద్రవము నుండి దేశమును రక్షింపుము.

**మలిదేవరాజు**: ఇల్లు కాలఁబెట్టి జల్లెడతో నీరు వోయుచున్నదీ. సంధి – పోరులేనినాడు పొందుఁగోరనివారు, పోరుజరుగు నపుడు పొందుఁ గోరుబందుల చూరు నంటిన నిప్పును చీరనంటినఁగాని కానరు కదా..

**కేతరాజు**: మహాశయా! నా సంధి యత్నమునకుఁ బురుడునందే సందు కొట్టునట్లున్నవి మీ వాక్కులు.

మునుపటి వై రబుద్ధిని సమూలముగాఁ బెకలింపుమయ్య ! నీ
మనమున లేనిపోని యనుమానము లుండిన వీడుమయ్య! నా
మనవిని ఆలకించి రణమార్గము నేగుట మానుమయ్య ! భూ
జనులకు నెల్ల శ్రేయమొక శాంతిపథంబె కదయ్య భూవరా

**మలిదేవరాజు**: నాఁటి నుండి నేఁటి వఱకు మాటి మాటికిని వారే కయ్యమునకుఁ గాలుఁ ద్రవ్విరి. అట్టివా రీనాఁడు నిక్కముగా శాంతితో నిలుతురన్న మేము నమ్ము టెట్లు?

**కేతరాజు**: మలిదేవ ప్రభూ!

మాటికి మాటికిన్ గలహ మార్గముఁ ద్రొక్కిన వైరివర్గ మీ
నాటికి శాంతితో మెలఁగునా, యను సంశయమేల నీకు? సం
స్ఫోటము సర్వనాశమనుచున్ గ్రహియించిరి వారుఁగూడ! నా
మాటను నమ్ముమా! తలఁపుమా యివి చేతులు కావు కాళ్ళుగన్!

కావున, ఉభయపక్ష జనక్షయ హేతువును, విషాదాత్మకము. నైన యీ ఘోర హింసా కాండకు స్వస్తి చెప్పుము.

**కన్నమదాసు**: కేతరాజా! అలరాజ హత్యతో వారి ద్రోహసముద్రమ తిక్రమించినది. ఇపుడే మొగము పెట్టుకొని నీవు సంధి కుదర్ప వచ్చితివో చెప్పుము

**మలిదేవరాజు**: శాంతినాయకుఁడైన అలరాజునట్లు చంపుకొన్న ఆ దుర్మదాంధుఁడు నలగామరాజును మేము విశ్వసించు టెట్లు ?

**కేతరాజు**: ప్రభూ! దుండగు లెవ్వరో చేసిన ఆ ఘోర కృత్య మందు నలగామ ప్రభువుల కెట్టి ప్రమేయమును లేదు.

అలుని మరణంబుచే నా మహాధిపు కొౌక
కంట నాగులేటింకొక కంట చంద్ర
వంక ప్రవహించు తెఱఁగున బాష్పవారి
యురలుచున్నదన్న నతిశయోక్తికాదు !

**కన్నమదాసు**: (మలిదేవునితో) ప్రభూ! చొల్లువాఁగుడు కల్లల పుట్టిల్లు. ఈతడిన్ని మాటలు చెప్పుచున్నాడు; ముందు వీనిని విశ్వసింపరాదు.

**కేతరాజు**: (బిత్తరపోయి, తెప్పరిల్లి) కన్నమదాసూ పెద్దలను గౌరవించుట నేర్చుకొనుము. అట్లు మాట్లాడుట పెద్ద తెలివికాదు.

**బ్రహ్మనాయఁడు**: నాయనా, కన్నమా శాంతింపుము.

**కేతరాజు**: (అటుతిరిగి) మహామాత్యా! విశ్వజనీనచరితా. మీ మాటయే విస్మరించితిని.

దేశ జనులకు ప్రగతి పథాశఁ జూపి,
ఇన్ని యేండ్లుగా శాంతికై కృషి యొనర్చి,
ఈనఁగాచి నక్కల పాలుఁగా నొనర్తు
వేల తుదకు సంగరమున కిచ్చగించి!

నిన్న మొన్నటి వాఁడవా నీకు నేను జెప్పుటకు ఎల్లరమును నీ కనుల ముందు పుట్టి పెరిఁగిన వారము. ఆ దారి కాదీ దారిఁ బొందని శాసింపుము. అందఱును నీకు విధేయులే.

**కన్నమదాసు**: పాము కూత పుంజుకు తెలియదా? నాయకురాలి యీ కపట సంధియొక్క ఆంతర్యము నాయనగా రెఱుఁగనిది కాదు.

**బ్రహ్మనాయఁడు**: నాయనా, కన్నమా! నీవు శాంతింపుము. ఓ కేతరాజా
కలుగును మానవాళికి సుఖంబను నా కలలేగతిన్ నిజం

బులగు? అనాదినుండియు మనుష్య సమాజ చరిత్ర నీ మహీ
తలముననెందుఁజూచిన నధర్మము, స్వార్థము, పక్షపాతమున్
కులమతభేదభావములు, కుట్రలు, హత్యలు; యుద్ధముల్కదా!

**కేతరాజు**: మహానుభావా! తమరే యిట్లు నిరుత్సాహముగానుడువుట సంతాప కరము. (కలయఁజూచి) అట్లయిన నెప్పటి కప్పుడిట్లే కచ్చెలు పెంచుకొని కోడిపుంజులవలె కాళ్ళకుఁ గత్తులుఁ గట్టుకొందురా?

**కన్నమదాసు**: ఇంతకు మున్నుమేము శాంతి ప్రస్తావన తెచ్చినపు డెల్ల వారు చుక్కల లోనికిఁ జూచిరి. అట్టివారితో మేమిపు డేకి భవించు పెట్లు వారికిని మాకును రాజీ కుదుర్చు వాఁడవా నీవు?

**కేతరాజు**: మున్ను ''శాంతి, శాంతి!'' యన్న మీరే నేఁడిట్లు నమ రాయత్తు లగుటఁజూచి ''చేసినది జపము, వేసినది గాలము'' అని యెవ్వ రైనను మిమ్ములనే విమర్శింతురు.

**కన్నమదాసు**: (కించిత్క్రోధముతో) ఎవ్వరును విమర్శింపరు; నీ వంటి వాఁడనవలసినదే.

**బ్రహ్మనాయఁడు**: కన్నమా! శాంతింపుము. కేతరాజా! వినుము.

కొండల కానలంబడియు, కూటికి గుడ్డకు మోము వాచియున్.
గండములెన్నొ చెండినను, కాటికిఁ జిక్కక నిల్చి యెండలో
నెండియు, వానలోఁ దడిసి, యిక్కటులందితి గాని, నాయెదన్
మండదు పౌరుషాగ్ని, మదిమాడదు ఎక్కటి పోరిటక్కులన్

**కేతరాజు**: విశాల హృదయా! మహానాయకా!

కరుణా స్వాంతుఁడు బ్రహ్మనాయఁడని లోకంబెల్ల కీర్తించు నీ
పరమోదార గుణంబుఁ జూపుమిపుడో ప్రజ్ఞానిధీ! దేశమె
ల్ల రణాఖాతపు టంచునన్ నిలచియుండన్ తద్రణాఖాత మం
దరయన్ ద్రోతువొ బ్రోతువో? తుదకునీయందున్నదా సర్వమున్

పలనాటి సామ్రాజ్య లక్ష్మికి సర్వాంగ కవచమవు నీవుండం గానే దేశము రుధిర స్రోతమునఁదేలి పోఁగలదు. కాన

గతమనునది మఱపుకాగ, మైత్రి యనెడు
తీవె పందిరెక్కు తీరుఁజూడు!
కాని వారినైనఁ గాచు కరుణయందు
నాఁడు ధర్మజుండు! నేఁడు నీవు!

ఏమి? మలిదేవ ప్రభూ! యుద్ధోన్మాదులమైన మన నుండి దేశ భవిష్యత్తునకు అంధకారమే కాని వెలుఁగు లభింపదు. ఇపుడు నీ విధాన మేదియో నచ్చుపెట్టక వచింపుము.

**కన్నమదాసు**: ఓ! కేతరాజా! తెఱ్ఱ నోటితో నీ వదే పనిగా నూఁడరఁ గొట్టు టేల! నూఱు సెప్పుఁడు, వేయిచెప్పుడు; ముందు మా రాజ్య మును మాపశమొనర్పరేని ప్రభువుల వారీసంధికి సుతరాము సమ్మతించరు.

**కేతరాజు**: మీ రాజ్యమును మీ కప్పగించు పూచినాది. అంతే కథా ! ఇంకేమైన నున్నదా ?

**బ్రహ్మనాయఁడు**: ఏమి మలిదేవా ? యింక తర్జన భర్జన సేయు టేల? కేతరాజా ! నీవి టాలా టోలి మాటలు కావని మాకు నీయందు గుఱి కుదిరినది. కన్నమా ! ధర్మదార పట్టించి, శ్వేతి కేతనము లెత్తింపుము.

**కన్నమదాసు**: ఎవరక్కడ ?

(ఒక భటుఁడు ప్రవేశించును)

**భటుఁడు**: (వినమ్రుఁడై, వీరముష్టితో) ఆజ్ఞ !

**కన్నమదాసు**: ఓయీ! యిటురమ్ము, (చెవిలో) నీవుపోయి వ్యవహార మంతయుఁ జెప్పి బాలచంద్రుఁ డెక్కడున్నను (సరే తత్క్షణమే యిటకుఁ బంపుము వడిగాఁ బొమ్ము, (భటుఁడు నిష్క్రమించును)

**కేతరాజు**: (ప్రహర్షముతో) ఓ! బ్రహ్మనార్యా! దిక్చుంబిత కీర్తి కిరణ ప్రసారా ! విశ్వప్రపంచార్చితా! నిన్నేమని కీర్తింతు నయా ?

దుర్మదచిత్తులై జనులు ద్రోహము లొండొరు సేయుచుండ నే
మర్మములేని భావమున మానవకోటికి సేవఁజేయు నం
తర్ముఖుఁడీవు! నీవలెనుదారులు కొందఱు ధాత్రినుంటచే
ధర్మరథంబు నేఁటికిని దారినిఁ దప్పక సాగుచుండెడిన్!

(అంజలి ఘటించి)

భవ దుదారాశయములకు వందనంబు
లేను పోదు నీదారి మహానుభావ!
శాంతి దేవతార్చకుఁడ వశ్రాంత హితుఁడ
వైహికాముష్మికంబుల నరయుదీవు!

(బాలచంద్రుడు తీవ్రవేగమున ప్రవేశించును)

**బాలచంద్రుఁడు**: (మహోద్వేగముతో) ఓ! మలిదేవప్రభూ!

నాతింగూడఁగ మూఁడె ప్రాణధనమాన ధ్వంసముల్, దాని దు
ర్నీతి వ్రాతముఁ గప్పిపుచ్చి యిట తానే ప్రాజ్ఞుఁడై నట్టులన్
కోతల్కోయును! బోధ సేయును అనిన్ ఘోరంబధర్మంబనున్
ఈతండెవ్వఁడు బొమ్మలాట నడి నిస్సీ కేతిగానింబలెజ్ !

**కేతరాజు**: (స్వగతము) ఈతఁడు వట్టితిప్పకాయవలె నున్నాఁడు.

బాలచంద్రుఁడు: ఇటువంటి త్రాడూ బొంగరము లేని కొండెకాని మాటలు విందురా ? రాయబారులై వచ్చి గూఢచారులై వ్యవహరించువా రిట్టివారే.

**కేతరాజు**: ఓయీ ! బాలచంద్రా. యిందఱు పెద్ద లుండ నంద అను ధిక్కరించి వక్కాణించుట నీకు సబబు కాదు.

బాలచంద్రుడు: ఛీ! నోరు మూయుము.

వారికి బుద్ధిలేక నినుఁబంపిరి బో యిట కెట్లు వచ్చినా

వౌర! యితండు వచ్చెను బొ అర్థవిహీన విధాన సంధికై

మీరును సమ్మతింతురె? నిమేషము యోచన సేసినా రె? ఘో

రారిని విశ్వసించి హృదయంబుల నర్పణ సేసికొందురే ?

ఎన్ని నాళ్ళిట్లు శాంతరసమున శత్రువును సంరక్షింప దలంచుచున్నారు ? ఇదంతయు మెఱుపు దాడికై వారు పన్నిన పన్నాగమే. కాని వేఱొండు కాదు.

కదనము సేయ రండనుచు కత్తులు దూసిన ధూర్తచిత్తులే

కదనము సేయ రాదనుచు కల్లలు కూసిన విశ్వసింతురే?

అదియునుగాక మొన్న నెకదా అలరాజును శాంతికామునిన్

హృదయ విదారకంబుగ వధించిరి! దానిని విస్మరించిరే?

**కేతరాజు**: ఊరిదెల్ల యొకత్రోప ఉలిపికట్టె దింకొక త్రోవ, అంతయు పడుచుతనపు టుడుకు నెత్తుటి దుడుకు తనము.

**బాలచంద్రుఁడు**: (కసరి కత్తిదూసి)

ఏవఁడవురోరి ! నీ విటుల నింకను బ్రేలేదు నీతిమాలి; నే

నెవరనుకొంటివో? యెఱుఁగవే చెనటీ! అయితాంబ పట్టి, వీ

ర వరుఁడు, బాలచంద్రుఁడు, అరాతిమదేభమృగేంద్రుఁడీతఁడే

బవరము సర్వమున్ నడుపువాఁడుసుమీ గురజాల వారితో !

**కేతరాజు**: (స్వగతము) ఈ తుంటరి పంతగించి టలాయించు చున్నాఁడు. వీనితో శాంతముగభాషించినను భేరిని జోకొట్టున ట్లేయగును, కావున నోరు మూసికొనుట యుత్తమము.

**బాలచంద్రుఁడు**: పొమ్ము. ఇంకనేని పొమ్ము పరువు దక్కించు కొని పొమ్ము. పోయి, పరమ లుబ్ధాగ్రేసర చక్రవర్తి నలగామునకు అధ మాధమ దుర్మంత్రిణి నాగమ్మకు; పచ్చి నరహంత, నరరూప రాక్షసుఁడు. ఆ

నరసింహునకు చెప్పుకొమ్ము. కీర్తిశేషుఁడైన అలరాజ మహాశయులే బాల చంద్రాకృతిఁబూని ప్రతీకార ప్రథన మొనర్పనున్నారని చెప్పుము

**కేతరాజు**: మలిదేవప్రభూ! మహామాత్యా! ఏమిది?

**బాలచంద్రుడు**: ఏమున్నది? నెత్తురు దొప్పలు కట్టి నాగులేటగలియునింక. శతకోటి నరసింహుల నీ బాలచంద్రుని చంద్రహాసము నొసఁగినను రాచమల్లుని క్రూరముగ ఘాతించిన వారి ఘోర పాతకము తీరిపోదు. (మలిదేవరాజుతో) ఇపు డెవ్వరేని

యీ సంధి కిచ్చగింతురేని, అలరాజ హంతలతో చేతులు కలిపిన వారనియే నేనెంతును.

**మలిదేవరాజు**: కేతరాజా! యిఁక సమరము కొనసాగక తప్పదు. నీవు పోవచ్చును.

**బాలచంద్రుఁడు**: (కన్నమదాసుతో) అన్నా! రణభేరీ ధ్వానమున కనుజ్ఞనిమ్ము.

**కన్నమదాసు**: (చిఱునవ్వుతో) తమ్ముఁడా, నీ కంఠస్వరమే సమర దుంధుభి స్వనమై ప్రత్యక్షించినది కదా.(కేతరాజు మెల్లఁగా లేచి నిష్క్రమించును)

**మలిదేవరాజు**:మిత్రమా!కన్నమా!మనవాహినినెల్ల యుద్ధసన్నద్ధ మొనరింపుము.

**కన్నమదాసు**: చిత్తము ప్రభూ! నిష్క్రమించును)

**మలిదేవరాజు**: (దర హాసముతో) బాలచంద్రా. ఎంత గడుసు వాఁడవోయి.

తనకు మునింగినట్లుగ నతండొక డత్యధికార్ద్ర చిత్తుఁడై
అని వలదంచు నీతి కడు యాతనలంబడి నూటిపోసె ! ఆ
తని కతఁడొక్క పెద్దయెకదా! మనమెవ్వరు లెక్క సేయకుం
డిన విధమెల్ల తాఁదలఁచి డిల్ల పడండొకొ డెందమందునన్?

**బాలచంద్రుఁడు**: (మందస్మిత నమస్కృతు లొనర్చి) అలరాజ హంతలైన వారిపై కలపగఁదీర్చు కొనుటకైన మనమీ పోరు గావింపవలయు.

**మలిదేవరాజు**: అవును బాలచంద్రా! (బ్రహ్మనాయనితో) రండు. మనమింక మన స్కంధావారము కడకేగుదము.

**బ్రహ్మనాయఁడు**:(నిశ్శబ్దముగ నిట్టూర్చి)హా!చెన్నకేశవా!(అందఱు నిష్క్రమింతురు)

## తృతీయ రంగము
## (వీర శిబిరము – రణభూమి)

**కన్నమదాసు**: (భైరవ ఖడ్గముఁ బైకెత్తి జై! చెన్నకేశవా !

ఓ! వీరవరులార! ఓ విజ్ఞులార!
నా విన్నపముల వినవలయు మీరు !
పరమ శాత్రవుఁడేని భయ కంపనమున
శరణన్నచో వాని సమయింపరాదు!
స్త్రీ బాల వృద్ధులఁ జెఱపట్టరాదు,
ఏ బాధలంగాని యిరికింపరాదు !
పుట్టలు గుట్టల పొగులుచుఁ బ్రాఁకు
నట్టి భీతమతుల హతమార్పరాదు !
గాయపడి కడు రక్తాంగుఁడై మూర్ఛ
వోయిన దీనుని పొరిమార్పరాదు!
కరవాలమే జారి కలవర మొందు
అరివీరు నుసురుల హరియింపరాదు !
అటునెటో వీక్షించు నాతని పైన
పటు శస్త్రముల్ గుప్పి పడగొట్టరాదు !
ఆయుధంబును బూనుటే యెఱుంగని య
మాయకుం గని పెట్టి మాయింపరాదు !
ఎవ్విధంబైన దుర్వృత్తినింగాని
చివ్వలోపల మీరు సేయంగరాదు !
చెన్నుఁడీ హృదినుండి చెప్పించినాఁడు
కన్నమ నోటితో కదన ధర్మములు !

మనసంపాదన మెప్పుడున్ మనకృషిన్ మాత్రంబె పుట్టంగనౌ
ప్పునుగానీ, అది యెన్నఁడేని తగదే మోసంపు మార్గానౌ వ
చ్చినచోన్! కాపునయుద్ధధర్మముల మీచిత్తంబులందుంచి, వై
రినికాయంబులతోడఁ బోరుఁడిఁక మిర్మీశక్తులొప్పారఁగఁ!

జై! చెన్న కేశవా !

(సేన నుండి "జై! చెన్నకేశవా !" అని ప్రతినినాదము)

**బాలచంద్రుడు**: (సమీపించి) అన్నా! సర్వసైన్యాధ్యక్షా ! నిజ కర్తవ్య పులకిత మనస్కుఁడై, నీ ప్రత్యేకాశీస్సులకై నీ సమక్షమున నించి యున్నాడు నీతమ్ముఁడు బాలచంద్రుడు (కైమోడ్చును).

**కన్నమదాసు**: (పరిష్వజించి) జగదేకవీరా, అసహాయశూరా? నా సహోదరా బాలచంద్రా! ఉఱుకులు పెట్టు రణోత్సాహమున, వీర పల్నాటి పౌరుషంబెల్ల నీ యందె పుంజీభవించినట్లున్నావు.

కలియుగాభిమన్యుండను ఘన యశంబు
దశదిశా వ్యాప్తినొంద యుద్ధ ధరణీ త
లంబున భవదమోఘ శౌర్యంబుఁజూప
వలయు నాకూర్మి తమ్ముఁడా! బాలచంద్ర!

ఇమ్ముగ కారెమపూడి ర
ణమ్మున నీ ప్రతిన తీర నరసింహుని శీ
ర్షమ్ము పడగొట్టి, తద్ర
క్తమ్మునఁ గొమ్మాత్ముజునకు తర్పణమిమ్మా!

ధర్మరక్షకై బలియైన కర్మవీరుఁ
డమరజీవి చెల్లమ సూతి కాత్మశాంతి
కలుగుఁగాక ! మార్తాండుఁడు వెలుఁగు దాఁక
నీ ప్రతాప కీర్తి పతాక నిలుచుఁగాక!

(బాలుని శిరముపై ఆశీర్ముద్రనుంచి) తరతరాల వీరుల కాదర్శమూర్తి వగుము నా తమ్ముఁడా.

**బాలచంద్రుఁడు**: (ఖడ్గమెత్తి) ఇంక విమతవర్గమెల్ల టంపు తెగువట్లు గగ్గోలొనర్చెద. శాత్రవారణ్య మధ్యమున సుడిగాలివోలె కార్చిచ్చుఁ బుట్టించెద.

చేదింతున్ సమరోర్విలో నరసరాఛేట్మీర్షమ్ము! తద్వ్యూహమున్
భేదింతున్! భయదోగ్ర భంగి రిపులన్ వేధింతు! నాగమ్మలే
కాదా దేవతలడ్డుపెట్టినను ఆగంబోక మచ్ఛౌర్య రా
శీ దీప్తుల్ ప్రసరింప నా శపథమున్ జెల్లింతు నా యగ్రజా!

**కన్నమదాసు**: తమ్ముఁడా! నీవు సఫలీకృత ప్రతిజ్ఞుఁడ వయ్యె దవు, రా, పోదము.

(వారు నిష్క్రమింతురు. బ్రహ్మనాయఁడు ప్రవేశించును)

**బ్రహ్మనాయఁడు:** కటకటా! నా మాతృభూమి కెట్టి దుర్భర దుర్గతి పట్టినది.

పల్లెనాటి గడ్డపైఁగల శిల లెల్ల
క్రుంకు గట్టుదెసకు గూలినట్లు
పల్లెనాటి సీమ పైఁగల తలలెల్ల
ప్రథన భూమినకు వ్రాలియుండె!

ఈ సంగ్రామ కోలాహలము నా హృదయమునకు హాలా హలమువలె నున్నది. ఔరా: ఏమి నా కర్మము.

శాంతికై నేఁబడిన సమస్త శ్రమంబు
మట్టి పాలు కాగ సమర ముట్టిపడియె!
దైవదర్శనార్థము దీర్ఘతపము సేయ
"దయ్యమే'' నాకు తుదకు ప్రత్యక్షమయ్యె !

ప్రతి స్పర్థులమై నేనును నాయురాలును. ఏనాఁటి నుండి పలనాటి రాజకీయ చతురంగ మాడుకొను చున్నాము. కాదు, కాదు –

ఎవరికెవ్వారు శాత్రవు లీ ధరిత్రి
పైన ? సర్వులకు విధియే వైరిసుమ్ము!
నేఁడు విధితోడ పోరుచున్నాఁడ తుదకు
నాఁడు విధితోడ పందెంబు లాడినాఁడ!

విధి ముందు మన మెంత? మన బ్రతుకు లెంత? మన తెలివితేటలెంత ? అది విధియో, మరేదియో కాని ——

మనుజశక్తి కతీతమై కనఁగరాని
మహితశక్తి యేదొ కలదు! మానవుండు
దీనుడద్దాని యెడ పరాధీనుఁడయ్యు
తానెదో యుద్ధరించు దర్పాన నిలుచు!
ఇంక తుములమెట్లు సాగుచున్నదో పరిశీలించెద గాక!

(బ్రహ్మనాయఁడు నిష్క్రమించును, నరసింహరాజు ప్రవేశించును)

**నరసింహరాజు**: పూజ్యులైన బ్రహ్మనాయని సందర్శింప నెటులో సాహసించి యిటకే తెంచితిని. (పరికించి) ఎవ్వరును లేరేయిట, అహో! ఆ మహానాయకుని పాదస్పర్శతో పావనమైన పవిత్ర క్షేత్రము కదా యిది, (తత్ప్రదేశమును నరసింహరాజు కనుల కద్దుకొనుచుండ, చంద్రుఁడతి రయమున నటకేతెందును )

**బాలచంద్రుఁడు**: ఓరోరీ ! నరసింహా !

ఆగుమోరీ నరాధమా ! ఆగుమోరి !
ఎటకుఁ దప్పించుకొని పోదువీవు ? రామ
బాణమే తప్పుఁగాక యీ బాలచంద్ర
నిశిత కరవాల హతి తప్పునే దురాత్మ?

హైహయాన్వయ గౌరవం బనుగురాజ
గౌరవమ్ము, ఈ పలనాటి గౌరవమ్ము
మనుజజాతి గౌరవమును మంటగలిపి
హత్య సేతువే అలరాజు నర్ధరాత్రి?

**నరసింహరాజు**: ఓరీ! తుంటరీ! దిక్కు లదరు నట్లు కక్కరింపకుమురా.

మృత్యుదేవి నైన భృత్యురాలిగఁజేయు
నాయకురాలి సఖుఁడ! నన్ను గెలువ
నీ తరమ్ముకాదు, నిన్ను బుట్టించిన
బ్రహ్మ తరము కాదు బాలచంద్ర!

ఓరీ! పోకిరీ! వినుము
వీర నరసింహుతో కత్తిపోరనంగ
సాని సబ్బాయితో సరసంబు కాదు!
ఉగ్ర నరసింహుతో ఖడ్గయుద్ధమనఁగ
బొంగరాలు త్రిప్పుటకాదు బుద్ధిహీన !

**బాలచంద్రుడు**: ఓరీ! తులువా ! తల పొగరెక్కి కిలారించు చుంటివా ?

అర్ధరాత్రాన నిద్రితులైన వారి
ప్రాణముల్ దోఁచుటనుకొంటివా రణంబు?
క్రూరచోర! కుటిల హంత! రార! పండి
బద్దలైనది నేఁడు నీ పాపమెల్ల!

కాలసర్పమౌ నాయకురాలి తొత్తు
వగుచు మృగసమమ్ముగ కూతుమగని మ్రింగి
శిరము నెత్తుక తిరుగుదే సిగ్గుమాలి ?
తచ్ఛిరంబుండ తగదురా కుచ్చితుండ!

నరసింహరాజు: ఓరీ! ప్రేలుగొండీ!
సాని సబ్బాయి గుబ్బలపైన నొక్క
దెబ్బతో వ్రాలఁజేతు నీ దిమ్మతిరుగ;
బాలచంద్రాధమా! యింక! ప్రేలబోకు
నీకు మూఁడెరా రోజులు నేఁటితోడ

అస్మదీయోత్త మాంగంబు నాహవమున
ద్రెంతునంచు నలుగురిలో ప్రతిన యొనర్చు
విక్రమార్కుఁడవా నీవు? వక్రభాషి!
ఎవరి శిరము త్రెళ్ళునొ చూతువీవె రార!

**బాలచంద్రుఁడు**: ఓరీ! దేశద్రోహి! యీ ప్రధనమున నీ రుధిరముతో నీ క్షుద్ర చరిత్రయు. నా వీరకీర్తియు లిఖించెద.

**నరసింహరాజు**: అతిభయప్రద లందు హేమా హేమీ లెందరో నా చేతిలో హతా హతమైపోయిరి. నీవెంతరా? హుప్పని యూదనఁటరా ?

(పరస్పరము కరవాలముల టాకించుకొని వారొక దెసగా నిష్క్రమింతురు. మరియొక దెసనుండి బ్రహ్మనాయఁడే తెంచును)

**బ్రహ్మనాయఁడు**: కటకటా! దేశ తనూశక్తి నెల్ల నాహరింప పుట్టిన రాచపుండు వోలె నాకీ రణక్షోణి కన్పట్టుచున్నది. (అర్ధ నిమీలితా క్షుడై, దోయిలొగ్గి) హా! చెన్నకేశవా! అన్నియు నీ లీలలు తండ్రీ!

(నేపథ్యము నుండి——)

**బాలచంద్రుడు**: ఓ ! మలిదేవ పక్ష మహావీరులారా! వినుఁడు!

రాజ భారము దాల్చిన రాచమల్లు
నర్ధరాత్రి నిద్రా సమయాన హత్య
సేసిన నృసింహ ఘాతుకు శీర్షము దొల
గించి నా ప్రతినంబు నెగ్గించుకొంటి!

**బ్రహ్మనాయఁడు**: (దుఃఖ విహ్వాలుఁడై) హా! చెన్నకేశవా.

(వికటాట్టహాస మొనర్చుచు బాలచంద్రుఁడు నరసింహరాజరుండముతో ప్రవేశించును)

**బ్రహ్మనాయఁడు**: (ఆగ్రహోదగ్రుఁడై) ఓరీ: రాక్షసుఁడా. ఏమి, నీ ఘోర పైశాచి కోల్లాసము?

కనులు నెత్తి కెక్కినవె మూర్ఖ ! యిదేల
యిట్టి దుర్భర దుస్సహ కృత్యమునకె
గొప్ప సాహస మీడేర్చు కొన్న పగిది
ప్రేలు చున్నావు భువనంబు వీనులదర !

**బాలచంద్రుఁడు**: (నిశ్చేష్టుఁడై) తండ్రీ!

**బ్రహ్మనాయఁడు**: ఛీ! నీచుఁడా ! నీచే నట్లు సంబోధింపఁ బడుటకు సిగ్గిలు చున్నాను.

పుట్టినాఁడవు నా కడుపున ననేక
వత్సరాలకు శీలము వారి వంశ
గౌరవంబును నట్టేటఁ గలుపు కొఱకు !
పుత్ర రూపంబు నీకేల శత్రుహృదయ ?

బాలచంద్రుఁడు: (తీవ్రస్వరమున) తండ్రీ!

బ్రహ్మనాయఁడు: (పైపైకి బోవుచు) పో ! పశువా! పొమ్ము
రమ్మహో మొనకాఁడ! దురమ్ము సేయ
రమ్మనుచు నీ కెవఁడు స్వాగతమ్ము వల్కె?
అన్నిఁటికి నేనె యర్హుఁడ నంచు నెట్టు
కొనుచు వత్తువు నీకున్న ఘనతఁజూప !

బాలచంద్రుఁడు: (ఉగ్ర స్వరమున) తండ్రీ!
బ్రహ్మనాయఁడు: పాపాత్ముఁడా! నోరెత్తుకు మింక!
హృదయమే లేని నీ శౌర్యమేల ధూర్త?
చూపఁ దెచ్చితివా నీ ప్రతాపమునకు
ప్రతిఫలమ్ము నృసింహు శిరమ్ము నిటకు !
ఎవఁడు నీ మగంటిమిని హర్షించు నిచట?

అనుగు భూవల్లభుని పైరు నం దవక్ర
విక్రమాఢ్యుఁడౌ నరసింహు నక్రమముగఁ
గూల్ప నీ చేతు లేరీతి పాల్పడియెనొ
దుర్మదాంధుఁడా! రణభూమిఁ దొలగిపొమ్ము !

**బాలచంద్రుఁడు**: (క్రోధోద్రేకముతో) నన్ను రణభూమి నుండి తొలఁగి పొమ్మనుటకు నీవెవఁడవు? (కసరి, నరసింహుని మస్తకమును విసరి నేలకు గొట్టి–) నేను దుర్మదాంధుఁడనా?

క్రూరనాయకురాలి ఘోర తంత్రానేక
మరయకుండిన దుర్మదాంధుఁడెవఁడు?
మాయ ఫణంబున మలిదేవ నృపుని రా
జ్యంబు నూడ్చిన దుర్మదాంధుఁడెవఁడు?
రాయబారిగ నంపి రాచమల్లుని ప్రాణ
మరుల కొడ్డిన దుర్మదాంధుఁడెవఁడు?
శాంతివాక్కులతోడ చచ్చుదద్దమవోలె
తలదాచుకొను దుర్మదాంధుఁడెవఁడు ?
దుర్మదాంధుఁడెవఁడొ? ధూర్తుఁడెవఁడొ? దుష్టుఁ
డెవఁడొ అఖిల లోక మెఱుఁగు సుమ్ము!
ఊరకీవు నోరు పాఱవైచు కొనిన
ఊరుకొనెడు వారు లేరుసుమ్ము!
ఆహా ! ఏమి నీ దౌర్జన్యము.
ఆది నుండియు నీవు అంత్యంబు దనుక
చేసియుండిన ఘోర దుష్కృత్యచయము
నరయువారు నడుగువారు కరువున బడి
పోయిరంచు నీవెంచుకోఁబోకుమింక !

నేనే వీరజన విరుద్ధ మార్గముఁ ద్రొక్కితినని నీవిట్లు నిప్పులు గ్రక్కుచుంటివో చెప్పుము.

అలరాజున్ నడిరేయిఁ జంపునొక దుర్వాంతన్ సమర్థించి, ఆ
కలుషాత్మున్ సమరాన గూల్చిన ననుం గర్హింతువా నీవు? నీ
పలుకుల్ విన్నజగంబు మెచ్చదు! రణవ్యాపారముంజొచ్చి, శ
త్రులఁజెండాడుటఁగాక వారినిఁక ముద్దుల్ బెట్టుకొమ్మందువా ?

(కన్నమదాసు ప్రవేశించును)

**బాలచంద్రుఁడు**: (కన్నమదాసుతో) అన్నా !

చెల్లమాంబకుఁ గడుపునఁ జిచ్చు, పేరి
యాలదేవి హృదికిఁజిచ్చు, బాల చంద్రు
నకు తనువు నంతటికిఁ జిచ్చనంగ రాచ
మల్లు నటకంపి చంపిన మాన్యుఁడితఁడు!

(మలిదేవరాజు ప్రవేశించును)

**బాలచంద్రుఁడు**: మలిదేవ ప్రభూ! (తండ్రిని జూపి) అటువంటి కుత్సిత మిత్రుల కన్న(నరసింహుని తలఁజూపి) అటువంటి బహిరంగ శత్రువులే నయము కదా!

**కన్నమదాసు**: (గదమాయింపుతో) బాలచంద్రా, ఏమి? నీ తామసము. పెద్దల కెదురు తిరిగి మొరాయించెదవా? క్రొవ్వాఁడి పలుకు బాఁకులతో పితృహృదయమును క్షోభ పెట్టుదువా? నీకు బుద్ధిలేదా ?

**మలిదేవరాజు**: బాలచంద్రా! ఆయనెవ్వరను కొంటివి? నీవు తిరస్కరించి ఘర్షణ పడవలసిన దాయన తోడనా ?

**బాలచంద్రుఁడు**: (రోషవ్యధతో) ప్రభూ! అన్నా! అందఱును నన్నే దూషింపుఁడు ! ఎల్లరకును ఈ బాలుఁడొకఁడు తేలికగా నున్నాడు.

**బ్రహ్మనాయఁడు**: మలిదేవా! కన్నమా! వాఁడు తన యిచ్చ వచ్చినట్లు నన్ను దుటారింపనిండు. కొడుకైపుట్టి నన్నిట్లు పువ్వుల బెట్టి పూజించుచున్నాఁడు.

**బాలచంద్రుఁడు**: (నిరసనముతో) నీవు తండ్రివి కావు. నేను తనయుఁడను గాను, నా పైఁ గచ్చెఁ బూని నీ వెపుడు మచ్చరించితివో మన కపుడే యా స్పర్శ పోయినది.

**మలిదేవరాజు**: బాలచంద్రా! నీ వింతటి వెఱ్ఱి వాఁడవని నే నెన్నఁడు నూహింపలేదు.

తండ్రివీవు కావు, తనయుఁడనేఁగాన
టంచు కాండ్రుకాండ్రు మనెద వౌర !
తనయుఁడీవు కాక, జనకుఁ డాయన కాక
ఏల తప్పునోయి బాలచంద్ర?
ఆయనకు నీ యెడ వాత్సల్యమేకాని మాత్సర్యముండునా?
కన్నబిడ్డవు కావున నిన్ను నాల్గు
మాటలనియె జనకుఁ డింతమాత్రమున్ స్వ
తంత్రతకు తాను తగడంచుఁ దలఁచినావె?
చాలు చాలింక తగ్గుమో బాలచంద్ర !

**కన్నమదాసు**: తమ్ముఁడా! నీకింకను చిన్నతనము పోలేదు.

ఒక్కమాట వడినవాఁడు, ఒక్క దెబ్బ
తిన్నవాఁడును చెడిపోవ రెన్నఁడేని!
జనకుఁడు భవద్ధితార్థియై యనియె గాక
పరిభవింప నిన్నను నొకో బాలచంద్ర ?
ఐనవారెవరో కానివారెవరో కూడా తెలియదా నీకు?
నిన్ను దూషింప నాయన నీ పగతుఁడె ?
బిడ్డకిటు భయభక్తుల బెట్టనెంచి
జగడ మొనరింపఁ జాలఁడే జనకు డింత
బేలతనము నీకేలొకో బాలచంద్ర?

**బాలచంద్రుడు**: (రుద్ధకంఠమున) దుష్టుని శిక్షించుట దౌష్ట్యమా అన్నా. హత్య గావింపఁబడిన మన బావకై మన మెంత శోకించితిమి బావ నట్లు ఘోరముగ వధించిన దురాత్మునిది నేరమే కాదా? ఆ క్రూరుని ధర్మయుద్ధమున సంహరించిన నాది దుర్మార్గమా? అన్నా చెప్పుము. నిక్కమేదో పలుకుము–న్యాయమేదో చెప్పుము.

**కన్నమదాసు**: (కన్నీళ్ళతో స్మరించుచు) బావా! అలరాజా! నీవు మా యందఱి డెందము లందును జీవించియే యున్నావు.

**బాలచంద్రుడు**: (బ్రహ్మనాయని జూపుచు) ఇపుడు నా రణోత్సా హంబు గుంచింప నెంచియే కదా తా నన్ని యనుచితంబు లాడుట. (దుఃఖించును)

**కన్నమదాసు**: (కౌగిలించి బుజ్జగింపుతో) తమ్ముఁడా ! నీయుత్తమ సాహసము గణనీయమైనది.

నీ దృఢ ప్రతిజ్ఞ నెరవేరె! నరసింహు
మస్తకంబు త్రెళ్లె! మాన్యుఁడైన
రాచమల్లునాత్మ రంజిల్లె! యింక నీ
వేల వగవ వలయు బాలచంద్ర?

**బాలచంద్రుడు**: (కనులు దుడుచుకొని) అవును, నే నేల నిష్కారణముగ ఖేదపడవలయు?

అర్ధరాత్రియం దలరాడ్మహాత్ము హత్య
సేసిన నృసింహ దుష్టాత్ము శిరము నఱికి,
నా ప్రతిజ్ఞ నీడేర్చు కొన్నాఁడ నేను !
ఎవ్వరేమని యేడ్చిన నేమినాకు ?

(బాలచంద్రుడు నిష్క్రమించును)

**బ్రహ్మనాయఁడు**: (నిట్టూర్చి) సర్వావ మాన భారముల, సకల నిష్ఠురముల గ్రహించితి. (నరసింహుమస్తముఁ దీసికొని) హా! చెన్న కేశవా! ఇంక నెక్కడి రాజవంశము? రాజరక్త మెల్ల నేలపాలైపోవు చున్నది.

**కన్నమదాసు**: (శుష్క హాసమొనర్చి) తండ్రీ! రాజరక్తమనునది ప్రత్యేకముగ నుండునా యేమి?

ఈ మహోగ్ర సంగ్రామ మహీ తలమున
ఝురులు కట్టుచు నాగులేర్జలము నందుఁ
గలసిపోవు కవోష్ణర క్తంబు! ఇందు
ప్రభుల రక్తమేది ? భటుల రక్తమేది?

సర్వమును జదునై పోవుచుండ నిఁక మిట్ట పల్లము లెక్కడ తండ్రీ!

**బ్రహ్మనాయఁడు**: (వ్యాకులముతో) కన్నమా! కన్నమా ? (కన్నమదాస వదనములోని కవలోకించును)

**కన్నమదాసు**: (నిశ్చలముగ) తండ్రీ!

(బ్రహ్మనాయఁడు తల పంకించి, విచారించుచు నొక పీఠ ముపై చదికిలఁబడును. కన్నమదాసు నిష్క్రమించును. బ్రహ్మనాయనికి సామీప్యమున నింకొక పీఠముపై మలిదేవుఁ డాసీనుఁడగును)

**మలిదేవరాజు**: (వివర్ణాస్యముతో, బాష్పాకులేక్షణములతో) అన్నా, నరసింహా!

ఇద్దర మొక్క కంచముననే భుజియించితి మొక్క సెజ్జనే
నిద్దురవోయినా మపుడు నీవును నేనును! చిన్ననాఁడె పో
ముద్దులు ముచ్చటల్ మురిపెముల్ గతియించినవయ్య సోదరా!
ఇద్దర మిన్నినాళ్ల కిపుడీ పగిదిన్ దరిజేరి నారమే ?

అయ్యో! సోదరా! విద్యాబుద్ధులీ మహనీయు నొద్దనే కదా మున్ను మనము నేర్చుకొంటిమి,

నాఁటి నీ యొద్దికయును, నీ సమ్రతయును
నాకు మఱపు రాకున్నవి నరసరాజ !
నిన్న ధోగతి పాల్జేసె నిశ్చయముగ
నాయకురాలి కుటిల బుద్ధి నరసరాజ!

(దుఃఖమును దిగమింగి. కనులు దుదుచుకొని) మహామాత్యా! నేను....ను పోవుచున్నాను (నిష్క్రమించును)

**బ్రహ్మనాయఁడు**: (నరసింహు శిరము మూర్కొని) అయ్యో! నాయనా! తుద కిట్టి యాఱడి చావుతో నీదేహయాత్ర ముగిసినదా?

ఏమి యొనర్చె నీ కలుఁడు? ఎందుల కాతనిఁ జంపినావు? నీ
కీ మిడిమేలపుందలఁపు లెవ్వరు వోసిరి? నేనెఱుంగనే
నీ మనమెట్టిదో? మునుపు నేర్పితి నీతుల నీకు నా యొడిన్!
ఆమమకారమౌర! హృదయాకుల రూపముఁదాల్చె నేఁటికిన్!

అరయ నీవట్టి ఘోర నైచ్యమ్ము సేయ
పాల్పడఁ గలాఁడవే? పోతపాలు గాక
నీకు బుట్టు పుండేయిది? నిర్మలాంత
రంగము చెడదే కలుషవాత్ర్య వణమందు !
(నరసింహుని తలను దదేక దృక్కులజూచి నిర్వేదముతో)

**ఇది——ఉత్తమాంగము**: ఇది – ఉత్తమాంగము. ప్రాణికోటి యందు నుత్తమోత్తముఁడైన మానవుని యుత్తమాంగము. అట్టియుత్త మాంగమున కిపు డెట్టి దుర్గతి పట్టినది?

ఎముకల గూటిలో నెన్నాళ్ళు జీవుఁ
డాడెనో యీ శిరమం దన్నినాళ్ళు –
ఎన్నెన్ని యూహ లెన్నెన్ని కోరికలు
పాపపుణ్యాలకై ప్రభవించినవియొ ?
లోని తలపులకు బైని ప్రకటన
లెన్ని యీ మోముపయిన్ సాఁగినవియొ?
ఇప్పుడా భావంబు లెటకేగి నవియొ?
ఇప్పుడా హావంబు లెట దాఁగినవియొ?
కోపతాపము లెందుఁ గూలిపోయినవొ?
మోదభేదము లెందు మునిఁగి పోయినవొ?
పనిమాని పడియున్న పంచేంద్రియములు
తమతమ విధులను దలపోయ విపుడు!
మానసాచలములే మరణంబు నెదుట
మట్టి బుట్టలు కాక మానునే తుదకు ?
మహినేలు మహనీయ మకుట మయినను
దాని రోజున కదే ధాత్రిలో గలియు !
జీవించు నన్నాళ్ళు జేనెఁడు పొట్ట !
జీవమూడిన నాఁడు చేరెఁడు నేల !
ఈ మట్టి బొమ్మల కీ మూఁడు నాళ్ళ
బ్రతుకుల కిన్నిన్ని బదవ లెందులకొ ?

(విచారముతో) ఇంకను, నా జీవితాశ మరణింప కున్నదేల ?

(తీవ్ర క్షతగాత్రుఁడైన మలిదేవరాజు నెత్తికొని కన్నమదాసు. ఒక భటుఁడు వత్తురు. వ్యాకులపడుచు, లేచి బ్రహ్మనాయఁడెదురేగును. ముప్వురుగలసి మలిదేవరాజును శయనింపఁజేతురు. భటుఁడు నిష్క్ర మించును)

**బ్రహ్మనాయఁడు**: (గద్గద స్వరమున) నాయనా! మలిదేవా!
మలిదేవరాజు: (కన్నీరోడ్చుచు, నమస్కరించుచు) గురుదేవా ! .... నాకు సెలవిండు!.నా ప్రస్థాన తరుణ మాసన్నమైనది . ఇక నాకు సమయము లేదు. (కనులు మూసికొనును)

**బ్రహ్మనాయఁడు**: (తీవ్రకంపిత రోదన స్వరమున) అయ్యో! దయా మయా ! కృపాళూ ! దీనవత్సలా! ధర్మవీరా ! ధీరశూరా నాయనా ! నా మలిదేవా ! నీతర మిట్లు చెల్లించుకొని పోయితివా ? (నీరసముతో మలిదేపు నెడదపై శిరమూని మూర్ఛిల్లును)

**కన్నమదాసు**: విషాద బాష్పములతో హా ! మలిదేవప్రభూ !

ఆశ్రిత ఖగతతుల కాశ్రయం బొసంగు
కుల మహీజమా! నేఁడిట్లు కూలినావె?
కఠిన మతులకు గారుణ్యకాంతి సూపు
రత్నదీపమా ! నేఁడిట్లు రాలినావె ?

ఎక్కడ ప్రభూ! ఆ చెన్నకేశవుఁ డెక్కడున్నాఁడు? ఎక్కడ ప్రభూ! ఆ క్రూర విధాతృఁడెక్కడ? ధర్మమే జయమందురే? ఏదీ ? ఎక్కడ

కీడొనర్చు వారికి ప్రతికృతి యొనర్చు
తలఁపు సుంతైన లేని యుదారమతివి!
సద్గుణాఢ్యుల నిన్ని కష్టములఁబెట్టు
విధికి బుద్ధిలేదన్న తప్పిదము కాదు !

మహాప్రభూ ! గతించినది మీ భౌతిక కాయమే కాని సజీవము లైన మీ యాశయములతో మీరు చిరంజీవులై వర్ధిల్లుచున్నారు.

ప్రభువుబంటనుభేద భావంబుఁబాపి,
పులిని మేక నొక్క పడియ జలముఁద్రాపి,
వినుతికెక్కిన ఘనుఁడవు! మనుజులందు
దేవులుందురనిన భవాదృశులు కారె?

మహానుభావా! రో వెలంది యింటి పట్టెమంచము వంటి పదవీ పీఠము తమకుండిన నేమి? లేకుండిన నేమి?

నీచ తస్కరులెవ్వరో నీ మకుటము
దొంగిలించిరి కాని నీ దొరతనంబు
మాసెనే? జాతి హృదయ సీమలను ప్రేమ
నేలుకొన్న యేలిక వెవ్వరీడు నీకు?

(బాష్పములు జలజల రాలఁ దుడుచుకొని, దగ్గుత్తికతో) ప్రభూ! కాని వారు, ఐనవారు ఎల్లరును దలఁచియో. తలఁప్రకనో తమకుఁ గీడు సేసినవారేకాని మేలుసేసినవారు లేరుకదా.

నాయెడప్రేముడిన్, మరియు నాపయి నమ్మిక నీవునన్ జమూ
నాయకుఁజేయఁగా ——తుదకు నా యసమర్థతకాదె? ఆజి నీ
యాయువు లూడఁదీసినది! హా! మలిదేవ మహాధిపా! మహా
త్మా! యిటువంటిపాపిని, కృతఘ్నుని నెప్పగిదిన్ క్షమింతువో?

(కన్నమదాసు మోకరించి ప్రణమిల్లు చుండును. బ్రహ్మ నాయఁడు మూర్ఛనుండి తేఱుకొనును)

**బ్రహ్మనాయఁడు**: హా! దుర్విధీ! నా కెన్ని విధముల దుఃఖాను భవము గల్పించితివి?

**కన్నమదాసు**: (లేచి నిలచి) తండ్రీ! తండ్రీ!

**బ్రహ్మనాయఁడు**: నాయనా! కన్నమా! ఏ మహనీయుని జీవిత చ్ఛాయల మనమెల్లరము తదీయ ఫలము లనుభవించితిమో ఆ మహ నీయుఁడే కూఁకటి వేళ్ళతో నేఁడు కూలిపోయినాఁడు మన యాసలన్నియు నడుగంటి పోయినవి.

నన్నొక తండ్రిగాఁ దలఁచె! నన్నొకదైవముఁజేసికొల్చె ! తా
నున్నతరాజవంశమున నుద్భవమందియు గర్వదూరుఁడై
పిన్నతనంబు నుండియును బెద్దల నవ్విధి గారవించు వాఁ
డెన్నడు నెవ్వరుంబడని యిక్కటు లెన్నియొపొందెనక్కటా!

నిరంతర శోకాశ్రు ప్రవాహమే తన జీవితముగా గడపిన యీ పూజనీయుని కష్ట నష్టములకెల్ల కారకుఁడ నేనే.

మదమెక్కన్ మునుద్యూతమందుతన సామ్రాజ్యంబు నేనొడ్డఁగా
పదవీ భ్రంశము తాను దాల్చి, అటవీ వాస వ్యధాభారమున్
హృదియందించుకయైన నెంచఁడుకదా యీనా క్షమాజాని, నేఁ
డదివిన్ జేరఁగ నేను నెందులకుఁగాటన్ జేరకున్నాఁడనో?
అయ్యో! నేనెట్టి మానవుఁడను.
ఉజ్జ్వలావేశ పూరితుఁ, డున్నతాశ
య భరితాంతః కరణుఁడు, మహో చరిత్రుఁ
డు, మలిదేవ ధాత్రిపుఁడు నేఁడు మరణింప
హృదయమా! యేలకే బదాబదలు కావు?
నాయనా! కన్నమా! యిటు రమ్ము.

(ఇరువురును మలిదేవుని మృత దేహమును శిబిరాంతర్భాగము లోనికిఁజేర్చి తిరిగి ప్రవేశింతురు)

**కన్నమదాసు**: తండ్రీ! ఊఱడిల్లుము. (నిశ్చయోద్రేకముతో)
ఇట్టి ఘోరాతి ఘోరాల కింతటి ప్రళ
యాల కెవ్వతె కారకురాలొ యట్టి
కుటిల నారీ సర్పంబును గొప్పుపట్టి,
ఇనుఁడు క్రుంకులోన నిచటి కీడ్చితెత్తు!

(కన్నమదాసు నిష్క్రమించును)

**బ్రహ్మనాయఁడు**: (విచారముతో) కటకటా! సంగ్రామ రంగ మన్నచో వేల జీవులను బావులుగ నుంచి యాడు భయంకర చతురంగము కదా. హా ! ప్రాణులెల్లరును మరణించుచు మృత్యుదేవిని చిరంజీవురాలిగ

నొనర్చు చున్నారు. జయలక్ష్మి సిద్ధించుఁగాక ప్రయోజనమేమి? అనుభవించు ప్రభువే యస్తమించినాఁడు, (ప్రొర్లుకొని వచ్చు దుఃఖముతో) హా ! మలిదేవ ప్రభూ! వీరశయన మలంకరించితివా? దుఃఖమా! మున్నెన్ని జన్మముల నుండి నా హృదిని చీల్చి పిప్పిఁ జేయుచున్నావు?

పుట్టి చేటలోన బడకముందె, మాతృ
గర్భమందు నాకొక్క యాకారమైన
రాకముందె, ఏ దుర్భర శోక మనుభ
వించినాఁడనో నన్ను నే నెఱుఁగకుండ ?

ఇపుడు నాయెడ నాకే యేహ్యభావము పొటమరించుచున్నది.
ఎన్నొ విషాద ఘట్టములు! ఎన్నొ పరాజయ సన్నివేశముల్!
ఎన్నొ పరాభవంబులు! మరెన్నొయనాదరణాసి ఘాతముల్!
నన్నెరియించికూడ మరణాశకునన్ మరలింపవయ్యె! నే
నన్నిట మొండినై బ్రతికినా నిది యేటికి చెన్నకేశవా ?

(కన్నమదాసు ప్రవేశించును)

**కన్నమదాసు**: ( విలపించుచు ) తండ్రీ! తండ్రీ !

శత సహస్ర సింహోగ్ర గర్జారవంబు
స్వీయ కంఠసీమన్ నిల్పి, వీరబోధ
సేయు శత్రు ప్రకాండ విజేత! నా య
నుంగుఁ దమ్ముఁడు బాలచంద్రుఁడు గతించె!

నన్నుఁ గడు గారవముతో
"అన్నా!" యని చిత్తమూగునట్లు పిలచు నా
చిన్నారి తమ్ముఁడేగెన్ !
కన్నమదాసుఁడిపు డొంటికాఁడై మిగిలెన్!

**బ్రహ్మనాయఁడు**: (నిశ్చలుడై) నాయనా! యిందులకు దుఃఖించు టేల? బాలుని హావభావముల ప్రదర్శించిన పాత్రధారి తన భూమిక ముగిసినంతనే నిష్క్రమించినాఁడు.

**కన్నమదాసు**: తండ్రీ! తండ్రీ!

**బ్రహ్మనాయఁడు**: అవును, నాయనా ! కన్నమా! మన హాసవిలాసములు, మన మోద ఖేదములు, నన్నియు మన హావభావములే.

నీవు కన్నమదాసపు గావు, నేను
బ్రహ్మనాయఁడఁగా నిర్వరము నటులమె!
ఈ జగన్నాటకంబు సందెల్లరును బ్ర
వేశ నిష్క్రమంబు లొనర్చు వేషధార్లె!
(తల పంకించి వైరాగ్య దరహాసముతో)
ఇన్ని వత్సరంబు లీ విశ్వరూపక
మందు నేను నటుఁడనైతి! యింక
ప్రేక్షకుండనౌచు వీక్షింతు నా పాత్ర
మెవ్వరెవ్విధి నటియింపఁ గలరో ?

**కన్నమదాసు**: (విషాదాశ్చర్య చకితుఁడై) తండ్రీ, తండ్రీ.

(నమస్కరించుచు క్రమ క్రమముగా కన్నమదాసు నిష్క్రమించును)

**బ్రహ్మనాయఁడు**: వీరనాయకుల మారణ కేళీ విలాసము సన్నగిల్లు చున్నది. ఎడతెగక కురిసిన ఎఱ్ఱజడివాన వెలియుచున్నది.

నిన్ననేఁడు నిచట నింగి నంటిన పోరి
సత్తి యిప్పుడింత సప్పబడియె!
పెరుగు టెంతకైన విఱుగుట కొఱకని
బుధులు సెప్పుమాట బుగ్గికాదు!'

సమరకల్లోలమున సర్వమును లయించినది. ప్రకృతియందు, ఈ భీకర ప్రశాంతి యందు దీర్ఘ నిశ్వాసములు విడచెదను, కాట్రేఁడు తాండవమాడు ప్రేతకాలమేతెంచు నింక

కర్మసాక్షి చిమ్మెడు రక్తకాంతితోడ
పశ్చిమాకాశ ఖండమీ ప్రథన సీమ
కుఁ బ్రతిబింబమై తోఁచునాకు! ఇపుడందు
నిందు రుధిరార్ణవమె నిండె నేకతముగ!

ఈ స్మశాన శాంతి మయ శూన్య పరిణామమునకా నే నంత ప్రయాసపడితిని. నా ధ్యానము, నా జ్ఞానము, నా యాశలు, నా యాశయ ములు నన్నియు మిథ్యలే కదా. (కన్నమదాసు నాగాంబ నలగాములతో నేతెంచును)

**కన్నమదాసు**: తండ్రీ, తండ్రి యిటు వీక్షింపుము.

(బ్రహ్మనాయఁ డటు తిరిగి తేటిపాఱఁజూచును)!

కన్నమదాసు తండ్రి. తండ్రీ !
ఏ మహామారి పలనాటికెల్ల నిన్ని
తిప్పలుందెచ్చె నది నేఁటి కిప్పు డిచట
నిగళ బద్ధమై నిల్చి యుండినది! దీని
నేమి సేయు మందురో సెప్పుడింక నాకు !

(అని కన్నమదాసు భైరవ ఖడ్గము నెత్తును)

**బ్రహ్మనాయఁడు**: కన్నమా! శాంతింపుము, కోఱలూడిన పామును గొట్టుటేల నాయనా..

**నాయకురాలు**: (కన్నీళ్ళతో నమస్కరించుచు) నన్ను క్షమింపుఁడు నేను పరమ పాతకురాలను, ఘోర రాక్షసిని, క్రూర సర్పమను. నేను గావించిన దెల్ల పైశాచికము, దారుణము, దురంతము.

**బ్రహ్మనాయఁడు**: నాగమ్మా, నిన్ను నన్ను నందఱ క్షమించువాఁ డా పరాత్పరుఁడే నమ్మా. నాయనా! కన్నమా ! వీరిరువురి శృంఖలముల దొలగింపుము.

(భైరవు ఖడ్గమును బ్రహ్మనాయని చరణ సన్నిధి నుంచి కన్నమదాసు నాగాంబ నలగాములు చేతి సంకెలలఁ దొలగించును)

**నాయకురాలు**: (స్వగతము) ఓహో! యీయన బ్రహ్మనాయఁడా, లేక బ్రహ్మాండనాయకుఁడా? ఈ మహనీయుఁడు నా దృష్టి కతీతుఁడైన మహోన్నతునివలె నా కిపుడు ద్యోతించు చున్నాఁడు. ఈయన మానవా కృతి నున్న చెన్నకేశవుఁడా, మరి నే నెవ్వతెను?

**బ్రహ్మనాయఁడు**: మహామంత్రిణీ: నీవు నిక్కముగ మహానాయకు రాలవు. కానీ, మా దురదృష్టముచే నీ యనన్య సామాన్య శేముషీ వైభవ మెల్ల దుర్మార్గమునబడి వినాశకరమైనది; నిర్మాణాత్మకము కాలేదు.

(నలగామరాజు తటపటాయించుచు తడగాళ్ళతో సమీపించు చుండును)

**బ్రహ్మనాయఁడు**: (సాదర స్వరమున) నాయనా! నలగామా! రా! నాయనా!

**నలగామరాజు**: (పశ్చాత్తాప రుద్ధ కంఠముతో) తండ్రీ! నేను నిష్ఠురుఁడను, కఠినుఁడను, పాషాణ హృదయుఁడను, పాపకర్ముఁడను, మహాత్మా! అందఱి బాధలకుఁ గారణుఁడనైన నేను మీ సమక్షముననే యున్నాను; కోరిన దండన విధింపుఁడు. (కాళ్ళపైఁబడును)

**బ్రహ్మనాయఁడు**: నిను శిక్షించుటకు లేలెమ్మనాయనా లేలెమ్మ నేనెవఁడను నలగామా!

**నలగామరాజు**: (శోకించుచు లేచి) నేను హత భాగ్యుడను నష్ట హృదయుఁడను. కష్టజీవనుఁడను, నిష్ట దరిద్రుఁడను,

మును పేనెంతేనియుఁ దలఁ
పనైతి! ఇపుడింత చూచి వగలందుదు నై
నను నేమగు? చేతులు కా
లిన నాకుల నందుకొంటలే మౌనకటా !

బంధులు చచ్చుటఁగాంచితి
నందల్లునిఁ దలఁచిన హృదయము బరువగునే
నెందుల కింకను చావనొ
యిందఱు నావారు మిత్తికెరలై పోవన్!

తమ్ముని రాజ్యభాగము నధర్మపుఁబందెమునందు మ్రింగి, ఆ
తమ్ముని, వాని వారిని మదమ్మునఁ గన్నులు కానరా కర
ణ్యమ్మునకంపి, యింకను మనమ్మున కెక్కక నీచుడల్లునిన్
వమ్ముగఁజేసెనంచు నను వైరిగఁజూచెను లోకమెన్నఁడో !

తెలియనివాఁడనైతి నెటు తీరమొ దైవమ! శోక వార్థిలో
నలసితి, సోలిపోతి నిపుడారసిచూచిన వేల ప్రాణముల్
తలలను వంచి మిత్తికిని దప్పికఁ దీర్చిన నెత్రుటేటి గా
థలఁగల కాలమున్ ధరణి తాల్పకపోదు మదీయ దుర్విధిన్!

**బ్రహ్మనాయఁడు**: నాయనా! నలగామా!
ఆజినరులె చత్తురనుకొంటి వక్కట!
చూడచూడ నింత చోద్యమయ్యె !
మట్టిఁగలసినట్టి చుట్టాల కేడ్తువో?
ఎదను జిక్కఁబట్టి యేలఁగలవొ ?

**నలగామరాజు**: తండ్రీ! తండ్రీ!

**బ్రహ్మనాయఁడు**: అయ్యో ! నాయనా!
కుక్కుట ద్యూతానఁ గుటిల విజేతవై
బంధులఁ గానకుఁ బంపునపుడు!
పార్థివాహంకృతి బరమత ద్వేషివై
పీనుంగు గుట్టలఁ బేర్చునపుడు !
దాయాది భాగంబు దాహోగ్ర బుద్ధివై
ధర్మంబు గానక ద్రావునపుడు !
శాంతి సందేశ విచార దూరుండవై
చివ్వకు మీసంబు దువ్వునపుడు!
అరయ వైతివేను గఱపి యుండిన నీతి
నెవరి మాటలాలకించి నావొ?
ఇపుడు రెంటఁ జెడితివీవు! జరిగె కీర్తి
నాశనంబు! బంధు నాశనంబు!
నలగామరాజు: అయ్యో! తండ్రీ!

పెద్దయైన పిదప నింత బుద్ధి సెడిన
కుక్కగతి పట్టు వానికి నిక్కమరయ!
పాడు పేరితో నూరూర పడుటకన్న
ఊరు పేరు లేకుంటయే యుత్తమమ్ము !

**బ్రహ్మనాయఁడు**: నాయనా ! యిప్పుడు నీ పశ్చాత్తాపమే నీ యోగ్య తను జాటుచున్నది: ఇంక నుండి దురాశా విషయ పిపాసలను దూర మొన ర్పుము, కుటిల సంకుచిత మనస్తత్వమును విడనాడుము, స్థిరశాంత నిర్మల జ్ఞానజ్యోతిని నీ చిత్తమున వహించి యుండుము.

**నలగామరాజు**: తండ్రీ! అమృత మయము నీ యంతః కరణము. రమ్ము, దయసేయుము. మరల యీ ధాత్రి మీఁద శాంతి ధర్మముల బ్రతిష్ఠింపుము. ఈ నిర్భాగ్య హృదయుని చరమాభిలాషను మన్నింపుము.

**బ్రహ్మనాయఁడు**: (నిశ్వసించి) అయ్యో ! నలగామా! జీవిత పథ మున నడచి నడచి విసిగి వేసారి పోయితిని చేరఁదగిన గమ్యమును జేరనైనలేదు. అప్పుడే యిరులు ముసురుకొన్నవి; కాలు సేతు లొకచోటికి వచ్చినవి. (నాయకురాలిని జూచి స్వగతమున) ఈమె మ్లాన ముఖియై నిశ్చల ముగ నిలచియున్నను ఎవరినో యాజ్ఞాపించుచున్నదానివలెనె యున్నది. తన పలుకొక శాసనముగా పలనాటి నేలిన ప్రభ్వికదా యీమె: ఏమైనను నిపుడీమె స్థితినాకు దైన్యమై స్ఫురించుచున్నది.

శిరము వంచికొనియు, చేతి గోటిని నోటఁ
గొఱుకు కొనుచు, కాలిగోటి నదిమి
యేదొ గీచుకొనుచు నేమియుఁ దోఁపక
మూగచూపుఁజూచు నాగమాంబ !

(ప్రకాశము) అమ్మా ! నీ యెడ నెట్టి నిర్బంధమును లేదు.

**నాయకురాలు**: ( గద్గద స్వరమున) నేను నిరాశ్రయురాలను. శాఖాచ్యుత పత్ర రీతి నే నేటకో పోయెదను (నిష్క్రమించును) బ్రహ్మనాయఁడు: దురధికార మదమువలె సంధ్యాతిమిర పుంజ ములు సాంద్రములగుచున్నవి.

లోకబాంధవుఁ డస్తాబ్దిలోన మునిఁగె!
అంధకార బంధురమయ్యె నవనియెల్ల !
పొలసుఁదినియు, ప్రేవులఁజిమ్మి పులుఁగులేగె!
దైన్య భీకర దృశ్యము హైన్యమైనసె

అహో! సంధ్యారుణ శోభాంగి భంగి నాగమ్మకూడ అంధకారమందైక్యమై పోయినది కదా.

**నలగామరాజు**: (చేతులు జోడించి) తండ్రీ! నా నో రెండిపోవు. చున్నది. తల తిరిగి పోవుచున్నది. నేనింక నిలువలేకున్నాను. నీ గుణా లయమున నా సేదఁ దీర్చుకొన నిమ్ము (శిబిరములోని కేగును)

**బ్రహ్మనాయఁడు**: నాయనా ! కన్నమా!
ప్రొద్దు పొడిచినది ! ప్రొద్దు క్రుంకినది!
నిద్దురపోదమా నిశ్చలముగను ?

**కన్నమదాసు**: తండ్రీ! తండ్రీ!

బ్రహ్మనాయఁడు! నాయనా! కన్నమా!
అర్థ రహితమైన, అసమర్థమైన
వ్యర్థ జీవితము బ్రహ్మన్నదే సుమ్ము!

**కన్నమదాసు**: (వ్యధిత స్వరమున) అయ్యో! తండ్రీ ! కారణ జన్ముడవు నీవు! నీ వట్టి వెఱ్ఱి పాటలఁబాడకుము.

**బ్రహ్మనాయఁడు**: అయ్యో ! నాయనా! బహువత్సరములు దూర దూరములనుండి నతశిరస్కుఁడనై పయనించిన దుఃఖ జీవితయాత్రికుఁడను, నా విషాద జనితోన్మత్తానందమున నిప్పుడు నన్ను స్వేచ్ఛగాపాడు కొననిమ్ము.

ఈ విశాల భువనమే నా భవనము !
దేవుఁడు చేసిన దివ్య మందిరము !
(శ్రవణ మభినయించి) నాయనా! కన్నమా! ఏమిది?

**కన్నమదాసు**: తండ్రీ! అది నాగులేటి చిఱు తరఁగల పెనుసవ్వడి.

**బ్రహ్మనాయఁడు**: (బాహువులు సారించి తల్లీ! నాగులేర్నదీమతల్లీ! నిన్ను విస్మరించితిని. నన్ను క్షమింపుము. ఇపుడీ సమవాకారమునకు భరత వాక్యము నీవే చెప్పఁగలవు.

ఇలలో మానవులెంత స్వార్థపరులో, యీర్ష్యాళురో, ద్రోహులో,
కలహోన్మత్తులొ, సర్వనాశకులొ వక్కాణించు యీ యుద్ధగా
థల లోకాఖిల మాలకించి హృదయార్ద్రమ్మందగన్ బాడు మా
జల నిర్ఘోష విషాద గీతికలనో! సర్పాపగా గాయనీ!

రచయిత హామీపత్రము.

నాచే రచయింపబడిన "పలనాటి భారతము" అను చారిత్రాత్మక పద్య నాటకమును, "గంగోత్రి - పెదకాకాని" (నాటక సంస్థ) వారిచే ప్రదర్శింపబడుటకు సర్వ హక్కులు యిచ్చివేసినాను. కనుక, ఆకాశవాణి, దూరదర్శిని మొదలైన కేంద్రములందు పై సంస్థ వారిచే ప్రసారము కావింపబడుటకు నాకెట్టి అభ్యంతరము లేదు.

ఇట్లు
ధనేకుల వెంకటేశ్వరరావు
గుంటూరు
28-2-06


ఆదివారం 22 జనవరి 2006 — 20 పేజీలు

ఈనాడు చిత్తూరు — ఆదివారం 22 జనవరి 2006

అహో అనిపించిన 'పల్నాటి భారతం'

నంది నాటకోత్సవం-2005

**పద్యం పల్లవించి...మానవత్వం పరిమళించి**

న్యూస్‌టుడే, తిరుపతి

ఎవరన్నారు పద్యానికి జనంలో ఆదరణ కరవైందని? వారినిటువైపు... మహతివైపు తీసుకు రండి. పద్యవిద్యానికి వారెత్తే చప్పట్లను వినిపించండి. మానవత్వం నశించిపో యిందన్న నైరాశ్యంలో ఎవరైనా ఉన్నారా! వారిక్కడకు రండి. మానవత మూర్తీభవించిన పాత్రల సంభాషణలకు జేజేలు పలుకుతున్న ప్రేక్షకులను చూడండి. మహతిలో శని వారం పద్యం పల్లవించి రసానందం డోలలూగించింది. మానవత్వం పరిమళించి గుండెల నిండా గుబాళించింది.



బుధవారం 1 ఫిబ్రవరి 2006 * 12 పేజీలు

## సమ్మోహితులను చేసిన పల్నాటి భారత పద్యనాటకం

పల్నాటి భారతం పద్య నాటకంలోని సన్నివేశాలు

గుంటూరు కల్చరల్ (ఐ.ఎన్.ఎస్), జనవరి 31: గుంటూరు కళాపరిషత్ పదేళ్ల పండుగ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రదర్శితమైన పల్నాటి భారతం పద్య నాటకం రసవత్తరంగా సాగి ప్రేక్షకులను సమ్మోహితులను చేసింది. నంది అవార్డుల విజేత పెదకాకాని గంగోత్రి కళాసంస్థ ఈ నాటకాన్ని సమర్పించింది. రచయిత వెంకటేశ్వరరావు రచన చేయగా, నాయుడు గోపి ఈ నాటకానికి దర్శకత్వం వహించారు. పలనాటి సీమలో ఎనిమిది శతాబ్దాల కిందట అన్నదమ్ముల మధ్య, అధికార పీఠాల మధ్య రగిలిన పగల వల్ల జరిగిన యుద్ధాన్ని రసరమ్యంగా చిత్రీకరించిన దృశ్యశ్రవణ కావ్యంగా ఈ చారిత్రక పద్య నాటకం సాగింది. వర్ణధర్మాలను తిరస్కరిస్తూ, చాపకూటి సిద్ధాంతాన్ని ఆచరించి ముందు తరాలకు మార్గదర్శకుడైన బ్రహ్మనాయుడు సంఘ సంస్కరణోద్యమాన్ని, పలనాటి వీర చరితలను హృద్యంగా గానం చేస్తూ పాత్రధారులు తమ పాత్రలకు జీవం పోశారు.

సాధారణంగా పద్యనాటకాలంటే రబ్బరులా సాగే పద్య రాగాలాపనలు, నే నంటే నేనే అంటూ పోటీలు పడి రాగాలను సాగదీసే నటుల వలె కాకుండా నేటి తరాలతో కూడి, రమ్యమైన క్లుప్త రాగాలతో కూడిన ఈ పద్య భావాలు ప్రేక్షకుల గుండెలను సున్నితంగా స్పృశించి పులకింపజేశాయి. కిక్కిరిసిన ప్రేక్షకుల ఆడిటోరియంలో ఒక సినిమా చూస్తున్నామా అనిపించే విధంగా పాత్రోచిత సహజ దృశ్య కావ్యంగా గుంటూరు నగర ప్రజల మదిలో ఈ నాటకం నిలిచిపోయింది. ఆసాంతం కదలకుండా కూర్చుని నగర కళాభిమానులు ఈ నాటకాన్ని తిలకించి, పులకించి నటీ నటులకు కళాభివాదాలందించారు.



ఆదివారం 22 ఏప్రిల్ 2007 20 పేజీలు

## వినయం కీర్తికి.. సోపానం

పల్నాటి చరితకు సజీవ దృశ్యం

న్యూస్‌టుడే, గుంటూరు కల్చరల్

పల్నాటి పౌరుషానికి ప్రతీక.. 'పల్నాటి భారతం'

'గంగోత్రి' నాటకీయ ప్రస్థానంలో ఓ సన్నివేశం

కె.ఎస్.టి.శాయికి గంగోత్రి పక్షాన సన్మానం



ఆదివారం 22 జనవరి 2006 8 పేజీలు

## ప్రతిధ్వనించిన పల్నాటి భారతం

తిరుపతి కల్చరల్, జనవరి 21 (ఐ.ఎన్.ఎస్) నంది నాటకోత్సవాలలో భాగంగా స్థానిక మహతి ఆడిటోరియంలో శనివారం ఉదయం 10 గంటలకు గంగోత్రి పెద్ద కాకాని వారిచే పల్నాటి భారతం పద్యనాటక ప్రదర్శన మహతి ఆడిటోరియాన్ని ప్రతిధ్వనింపజేసింది. ఇందులోని పాత్రలు, పాత్రధారులు ఆయా సన్నివేశాలకు సంపూర్ణమైన న్యాయం చేశారు. ఇందులో బ్రహ్మనాయుడుగా ఎస్. రవికుమార్, నాగమ్మగా ఎం. లక్ష్మీతులసీ, బాలచంద్రుడుగా అరుణకుమార్, మంచాలగా డి. విజయలక్ష్మి ముఖ్య పాత్రలను పోషించారు. దీనికి రచన డి. వెంకటేశ్వరరావు, దర్శకత్వం నాయుడుగోపి, సంగీతం టి. సాంబశివరావు, తబలా శేఖర్, హార్మోనియం ఆర్. కాళహస్తీశ్వరరావు, లైటింగ్ ఎస్. హనుమంతరావు సహకరించారు. ఇందులో రెండు వర్గాల వ్యక్తిగత తగాదాలే రాజ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తాయి. పాండవ కారకులుగా ఈ చిన్న కురుక్షేత్రం రక్తక్షేత్రంగా మారుతుంది. దీనికి బ్రహ్మన్న నాగమ్మ ముఖ్య కారకులు. బ్రహ్మన్న న్యాయంగా ధర్మంగా ప్రవర్తిస్తాడు. నాగమ్మ నక్క జిత్తులతో, క్షుద్ర రాజకీయాలతో ప్రవర్తిస్తుంది. చిలికిచిలికి పెద్ద గాలివానలా, చివరికి ఇరువర్గాల మధ్య జరిగిన రణరంగం గాథ ఇందులోని సారాంశం. దీనికి ప్రజలు హర్షధ్వానాలు పలు ప్రతిధ్వనించేలా చేశారు. నాగమ్మ పాత్రను లక్ష్మీతులసి, సహజంగా నటించారు. బ్రహ్మనాయుడు పాత్రలో రవికుమార్ ధర్మరాజులా నటించి ప్రజాదరణ పొందారు.



STATE | REGION

DECCAN CHRONICLE NELLORE 22 JANUARY 2006

**Battle revisited:** A scene from *Palnati Bharatam* staged at Mahati Auditorium as part of Nandi Natakotsav in Tirupati on Saturday. *(A Deccan Chronicle photograph)*



నాయుడు గోపి

"గంగోత్రి-పెదకాకాని" వ్యవస్థాపకులు

సాంస్కృతిక సేవాసంస్థ. స్థాపన 1990.



ధనేకుల వెంకటేశ్వరరావు

రచయిత

ఇప్పటికి అనేక పరిషత్‌లలో బహుమతులు గెలుచుకుంది.

- ఉత్తమ ప్రదర్శనలుగా 8 సార్లు బంగారు నంది, ఒకసారి వెండి నంది, ఒకసారి కాంశ నంది గెలుచుకుంది.
- మా నటీనటులు ఇప్పటికి 37 కాంశ్యనందులు అందుకున్నారు.
- 2006లో జనవరిలో తిరుపతి నాటకోత్సవాలలో మొత్తం 5 నందులను గెలుచుకున్నాము. ఇది ఒక రికార్డు.

ధనేకుల వెంకటేశ్వరరావు గారి రచన "పలనాటి భారతం"

- ఉత్తమ ప్రదర్శన – బంగారు నంది
- ఉత్తమ దర్శకుడు – కాంశ్య నంది
- ఉత్తమ నటుడు – కాంశ్య నంది
- ఉత్తమ నటి – కాంశ్య నంది
- ఉత్తమ ఆహార్యం – కాంశ్య నంది